

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావం
తుదు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 178

బుధవారం 13-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




పంత్ వచ్చేస్తున్నాడు

ఐపీఎల్ కోసం సిద్ధమని బీసీసీఐ ప్రకటన.. పూర్తి ఫిట్ అన్న వైద్య బృందం - 12లో



'జలన్' చేతికి జెట్ ఎయిర్‌వేస్

యాజమాన్య బదిలీకి అనుమతి.. ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ ఆదేశాలు - 13లో



ఖట్టర్ రాజీనామా

హరియాణా సీఎం పదవికి బీజేపీ నేత ఖట్టర్ రాజీనామా చేయగా.. నాయబ్ సైనీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు.

వివరాలు 6లో ▸



రైలు పట్టాలపై జీవితం ఆరంభించా

రైలు పట్టాలపైనే తన జీవితాన్ని ప్రారంభించానని, ప్రయాణికుల ఇబ్బందులు తనకు తెలుసని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



కూలిన తేజస్ యుద్ధ విమానం

భారత వైమానిక దళానికి చెందిన 'తేజస్' రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో కుప్పకూలింది. పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు.

వివరాలు 6లో ▸



సీఏఏ దరఖాస్తులకు కొత్త పోర్టల్

పౌరసత్వ(సవరణ) చట్టం కింద భారత పౌరసత్వం పొందాలనుకునే వారి కోసం కేంద్రం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్


గ్రామాల్లో అభివృద్ధిపైనా

'పచ్చ'పాతమే

- పనులు జరుగుతున్నా ఆగిపోయినట్లు రామోజీ దుష్ప్రచారం
- గడప గడపకు మన ప్రభుత్వంలో 65,857 ప్రాధాన్యత పనులు మంజూరు
- ఇప్పటికే రూ.1,100.78 కోట్ల విలువైన 30,025 పనులు పూర్తి
- కొనసాగుతున్న 1,978.46 కోట్ల విలువైన పనులు
- ఎప్పటికప్పుడు పూర్తయిన పనుల వివరాలు, బిల్లుల అప్‌లోడ్

14 లో

ఓఎన్జీసీ పైపులైనుతో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఐదో విడత సాయానికి సంబంధించిన చెక్కు అందజేస్తున్న సీఎం జగన్



మన తీరం.. మత్స్య హారం!

రూ.20 వేల కోట్లతో తీరం వెంట మౌలిక సదుపాయాలు

ప్రతి 50 కి.మీ.కి ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ లేదా ల్యాండింగ్ సెంటర్లు

వాయువేగంతో నాలుగు పోర్టులు.. బ్లూ ఎకానమీని పెంచేలా చర్యలు

జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా కాకుండా నేనే నేరుగా వెళ్లి ప్రారంభిస్తా

ఓఎన్జీసీ పైపులైనుతో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ఐదో విడత సాయం

23,459 కుటుంబాలకు రూ.161.86 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఐదేళ్లలో 'వైఎస్సార్ మత్స్యకార భరోసా'తో రూ.538 కోట్లు లబ్ధి

దాదాపు 20 వేల బోట్లకు డీజిల్ సబ్సిడీ కింద రూ.130 కోట్లకు పైగా చెల్లింపు

దురదృష్టవశాత్తూ మరణిస్తే అందించే ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు

2 లో

కళ్లెదుటే అభివృద్ధి

విజయవాడలో రిటైనింగ్ వాల్, రివర్ ఫ్రంట్ పార్కును ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

రూ.500 కోట్లతో నిర్మించిన కృష్ణా రిటైనింగ్ వాల్‌తో వరదల నుంచి నిశ్చింత.. రూ.239 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు శంకుస్థాపన

31,866 మంది పేదలకు సంపూర్ణ హక్కులతో పట్టాలు

2 లో

చనిపోయినా చిత్రవధ..

టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకల బరితెగింపు

గీతాంజలి వ్యవహారంలో మరింత నీచానికి దిగజారిన పచ్చమూకలు



కేసుల భయంతో ఆమెపై పెట్టిన దారుణమైన వ్యాఖ్యలు తొలగింపు

- ఆత్మహత్య సమయంలో ఎవరో తీసిన వీడియోను ఎడిట్ చేసిన టీడీపీ
- అందులో ఆమె కేరక్టర్‌ను అవమానించేలా కొన్ని వ్యాఖ్యలు జోడింపు
- 'ఎవరో ఇద్దరు తోసేశారట', 'ఎవరా ఇద్దరు' అనే మాటలతో ఎడిట్
- వాటినే పట్టుకుని 'తోసేసింది ఎవరు' అంటూ చెలరేగిపోయిన మూకలు
- దాన్నే 'వైసీపీ హత్యారాజకీయాలు' అంటూ ట్వీట్ చేసిన నారా లోకేశ్
- టీడీపీ దిగజారుడుతనంపై నివ్వెరపోయిన జాతీయ మీడియా
- గీతాంజలి కుటుంబానికి రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావం.. ర్యాలీలు
- ఆమె పిల్లలిద్దరికీ తలా రూ.10 లక్షల సాయం ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని వ్యాఖ్యలు
- సోషల్ మీడియా వేధింపులు భరించలేకే ఆత్మహత్య: గీతాంజలి భర్త
- ఆమె కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- కేసు నమోదు చేశాం... కారకులపై కఠినంగా వ్యవహరిస్తాం: ఎస్పీ

10 లో



ఇద్దరు ఎమ్మెల్సీలపై

అనర్హత వేటు

వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీలుగా గెలిచి పార్టీ ఫిరాయించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది. సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, సి.రామచంద్రయ్యలపై అనర్హత వేటు వేసినట్లు శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.

3 లో

విశాఖ ఎంపీ సీటుపై వదిన-మరిది డ్రామా!

- రెండేళ్లుగా అక్కడ పనిచేస్తున్న జీవీఎల్‌కు పురందేశ్వరి చెక్..
- పూర్వపు టీడీపీ నేత సీఎం రమేశ్ కోసం పట్టుబడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు
- తనకు సీటు రాకపోతే తీవ్ర పరిణామాలుంటాయని లోకేశ్ తోడల్లుడు భరత్ హెచ్చరిక
- చివరకు రమేశ్ కోసం అనకాపల్లి ఎంపీ సీటు ఇప్పించేందుకు కసరత్తు
- వెనుక నుంచి చక్రం తిప్పుతున్న బాబు.. కమల దళంలో తీవ్ర అసంతృప్తి

3 లో

అప్పుడు బీజేపీ.. ఇప్పుడు జనసేన

చంద్రబాబు విష కౌగిలిలో మిత్రపక్షాలు గిలగిల



- 2014లో బీజేపీకి ఇచ్చిన సీట్లలో కోత పెట్టిన బాబు.. మూడు స్థానాల్లో తన అభ్యర్థులకే బీ ఫారం ఇచ్చి మరీ పోటీకి
- ఇప్పుడూ జనసేన సీట్లలో కోత.. మొదట 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలు కేటాయింపు
- సోమవారం 3 అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానం కోత..మిగిలింది 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ సీట్లే..
- వాటిలో భీమవరానికి టీడీపీ అభ్యర్థి పులవర్తిని జనసేనలోకి పంపిన బాబు
- 2019లో భీమవరంలో పవన్‌పై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిందీ ఆయనే..
- జనసేనకు మిగిలినది 20 అసెంబ్లీ సీట్లే
- పోనుపోను ఇంకెన్ని తీసుకుంటారోనని జనసేన నేతల ఆందోళన

5 లో

ఇదండీ సంగతి



బట్ట సరిపోలేదు! నీ బట్టలో నుంచి కట్ చేసి ఆయనకు కుట్టాను!!

టీడీపీ-బీజేపీ కూటమికి మైనారిటీలు, దళితులు ఓట్లు వేయరు



- గతంలో చంద్రబాబు మోదీని టెర్రరిస్టుగా అభివర్ణించారు
- ఏపీలో పోటీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- మీడియాతో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి, హైదరాబాద్: ఏపీ సీఎం వైఎస్ జగన్ తనకు మంచి మిత్రుడని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. జగన్‌తో మంచి స్నేహం ఉందని, అది కొనసాగుతోందని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏపీ రాజకీయాలపై

మిగతా 3వ పేజీలో ▶



గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక)



కావటి మనోహర్‌నాయుడు (చిలకలూరిపేట)

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా మంత్రి గుడివాడ

చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా కావటి మనోహర్‌నాయుడు

కర్నూలు మేయర్ అభ్యర్థిగా సి.సత్యనారాయణమ్మ


సాక్షి, అమరావతి: విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. చిలకలూరిపేట సమన్వయకర్తగా గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడును నియమించారు. కర్నూలు మేయర్ బి.వై.రామయ్యను కర్నూలు లోక్‌సభ సమన్వయకర్తగా నియమించినందున మేయర్ అభ్యర్థిగా 25వ డివిజన్ కార్పొరేటర్ సి.సత్యనారాయణమ్మను ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం జగన్ ఆదేశాలతో ఈ నియామకాలు చేసినట్లు ఆ పార్టీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

మన తీరం.. మత్స్య హారం!

రూ.20 వేల కోట్లతో తీరం వెంట మౌలిక సదుపాయాలు

ఓఎన్జీసీ పైపులైనుతో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ఐదో విడత సాయం

23,459 కుటుంబాలకు రూ.161.86 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసిన సీఎం జగన్



బటన్ నొక్కి ఆర్థిక సాయానికి సంబంధించిన నిధులను విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి మత్స్యకారుడు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో సముద్ర తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ.కి ఒక పోర్టు కానీ ఫిషింగ్ హార్బర్ లేదా ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 4 పోర్టులను వాయువేగంతో నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. తీరం వెంట మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరిచామన్నారు. మనకున్న 974 కి.మీ. పొడవైన సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ బ్లూ ఎకానమీ (నీలి విప్లవం) పెంచేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వీటన్నిటివల్ల మత్స్యకారులు ఎక్కడెక్కడికో వలస వెళ్లి ఉపాధి వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా సొంత రాష్ట్రంలోనే మెరుగైన జీవనోపాధి లభిస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఓఎన్‌జీసీ పైపు లైన్ కారణంగా ఉపాధి కోల్పోయిన 23,458 మత్స్యకార కుటుంబాలకు ఐదో విడతగా ఒక్కొక్కరికి నెలకు రూ.11,500 చొప్పున ఆర్నెళ్లకు రూ.69,000 మేర పరిహారం చెల్లిస్తూ మొత్తం రూ.161.86 కోట్లను మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటివరకు ఐదు విడతల్లో రూ.647.44 కోట్ల మేర లబ్ధిదారులకు ప్రయోజనాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

జువ్వలదిన్నెకు స్వయంగా వస్తా

"ఇవాళే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించాలని తొలుత అనుకున్నా. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకుండా నేనే నేరుగా అక్కడకు వెళ్లి ప్రారంభించాలని నిర్ణయించా. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా మత్స్యకారులు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో తెలియచేసేందుకు నేనే స్వయంగా వెళ్లి ఆ హార్బర్‌ను ప్రారంభిస్తా. ఫిషింగ్ హార్బర్ వల్ల మత్స్యకారుల జీవితాలు మారతాయి. ఒక్కో ఫిషింగ్ హార్బర్‌లో ఎన్ని బోట్లు ఉంటాయి? కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలతో ఏ రకమైన అభివృద్ధి జరుగుతుందనే విషయాలు అందరికీ తెలియాలి. అందుకే అక్కడ ఇవాళ తలపెట్టిన కార్యక్రమాన్ని వాయిదా వేశాం" అని సీఎం జగన్ పేర్కొన్నారు.

రూ.20 వేల కోట్లతో తీరంలో సదుపాయాలు

మొత్తంగా 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లతో పాటు నాలుగు పోర్టుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నాలుగు పోర్టులను దాదాపు రూ.16 వేల కోట్లతో నిర్మిస్తున్నాం. పది ఫిషింగ్ హార్బర్లను రూ.4 వేల కోట్లతో నిర్మిస్తుండగా మరో రూ.200 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. మొత్తంగా రూ.20 వేల కోట్ల పైచిలుకు సముద్రతీర ప్రాంతంలో మౌలిక సదుపాయాల మీద పెట్టుబడిగా పెడుతున్నాం. ఈ పనులన్నీ వేగంగా జరుగుతున్నాయి. వీటివల్ల అత్యధికంగా మత్స్యకార కుటుంబాలు బాగుపడతాయి.

క్రమం తప్పకుండా ప్రతి ఆర్నెల్లకు..

రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మత్స్యకారులను ఆదుకునే విషయంలో ఓఎన్జీసీ మంచి మనసుతో ముందుకొచ్చింది. మత్స్యకార కుటుంబాలకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ఎక్కడా ఆలస్యం లేకుండా ప్రతి ఆర్నెల్లకు ఒకసారి సాయం అందిస్తూ ఆదుకుంటున్నాం. క్రమం తప్పకుండా డబ్బుల విడుదల కోసం గుర్తు చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌ను అభినందించాలి. ఇప్పటివరకూ ఐదు విడతల్లో రూ.647.44 కోట్లు ఇచ్చాం. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 16,408, కాకినాడ జిల్లాలో 7,050 కుటుంబాలకు మంచి చేస్తున్నాం.

బాబు సర్కారు ఆలకించలేదు..

2012కు సంబంధించి జీఎస్పీసీ రూ.78 కోట్లు పరిహారంగా 16,554 కుటుంబాలకు చెల్లించాల్సి ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. మనం అధికారంలోకి వచ్చిన మొదటి ఆర్నెల్లలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున మత్స్యకారులకు మేలు చేస్తూ ఆ రూ.78 కోట్లను 16 వేలకుపైగా మత్స్యకార కుటుంబాలకు అందచేశాం. ఆ కుటుంబాల అవసరాలను మన అవసరాలుగా భావించి వారికి తోడుగా నిలుస్తూ గొప్ప అడుగులు పడ్డాయి. ఆ తర్వాత జీఎస్పీసీని ఓఎన్‌జీసీ టేకోవర్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు దీని గురించి ఓఎన్‌జీసీ దృష్టికి తేవడంతో రెండు మూడేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఆ డబ్బులు వచ్చాయి. అయితే ఈలోగా మత్స్యకారులకు మంచి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయలేదు. మత్స్యకారులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసాను అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కల్పిస్తున్నాం.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

1.07 లక్షల కుటుంబాలకు వైఎస్సార్ మత్స్యకార భరోసా

చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మత్స్యకారుల సంక్షేమం కోసం తాపత్రయ పడుతూ అడుగులు వేశాం. 1.07 లక్షల కుటుంబాలకు ఐదేళ్లలో వైఎస్ఆర్ మత్స్యకార భరోసా ద్వారా రూ.538 కోట్లు సాయంగా అందించాం. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 మధ్యలో వేట నిషేధ సమయంలో వారికీ సాయాన్ని ఏటా అందించాం. చంద్రబాబు హయాంలో ఐదేళ్లలో మత్స్యకార సోదరులకు కేవలం రూ.104 కోట్లు మాత్రమే ఇచ్చారు. మనం ప్రతి ఒక్కరినీ ఈ పథకంలోకి తీసుకొచ్చి పారదర్శకంగా అందిస్తూ వచ్చాం. గతంలో రూ.4 వేలుగా ఉన్న సాయాన్ని ఏకంగా రూ.10 వేలకు పెంచి ఒక్కో కుటుంబానికి అందిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ మత్స్యకారులకు ఇంత సహాయం అందించడం లేదు.

రూ.130 కోట్లకు పైగా డీజిల్ సబ్సిడీ

గతంలో డీజిల్‌పై లీటరుకు రూ.6 మాత్రమే సబ్సిడీ ఇవ్వగా మనం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9కి పెంచాం. నాడు ఆ సబ్సిడీ ఎప్పుడిస్తారో కూడా తెలిసేది కాదు. ఇప్పుడు డీజిల్ పోయించుకున్నప్పుడే సబ్సిడీ ఇస్తున్నాం. దీనికోసం ప్రత్యేకంగా బంకులను ఎంపిక చేసి ప్రతి మత్స్యకారుడికి గుర్తింపు కార్డు ఇచ్చాం. డీజిల్ పోయించుకున్నప్పుడే రూ.9 సబ్సిడీ ఇచ్చేలా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం. డీజిల్ సబ్సిడీని వర్తింపజేసే బోట్లను కూడా పెంచాం. దాదాపు 20 వేల బోట్లకు రూ.130 కోట్లకు పైగా డీజిల్ సబ్సిడీ ఇచ్చాం.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా

వేటకు వెళ్లే మత్స్యకారులు దురదృష్టవశాత్తూ మరణిస్తే చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి ఇస్తున్నాం. ఘటన జరిగిన వెంటనే రూ.5 లక్షలు పరిహారంగా చెల్లిస్తూ మిగిలిన అమౌంట్‌ను ఆర్నెళ్లలోగా అందజేసే కొత్త ఒరవడి తీసుకొచ్చాం. ఇలా దాదాపు 175 కుటుంబాలకు మంచి చేస్తూ మరో రూ.17 కోట్లు అందించాం. గతంలో ఎక్స్‌గ్రేషియా ఎప్పుడు వచ్చేదో తెలిసేది కాదు. ఈ మూడు కార్యక్రమాలే కాకుండా డ్రిల్లింగ్ కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నాం. జీఎస్పీతో మొదట రూ.78 కోట్లు, ఓఎన్‌జీసీతో ఐదు దఫాల్లో రూ.647 కోట్లు అందచేశాం. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే విద్యుత్ సబ్సిడీని అందిస్తున్నాం. 40,850 మంది లబ్ధిదారులకు మంచి చేస్తూ దాదాపు రూ.3,500 కోట్లు సబ్సిడీగా ఇచ్చాం. ఆరు కార్యక్రమాలతో రూ.4,913 కోట్లు అందించాం. ఇవికాకుండా నవరత్నాల ద్వారా అదనంగా ప్రతి మత్స్యకార కుటుంబానికి సాయం అందిస్తున్నాం.

కార్యక్రమంలో ఇంధన, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మీ చేతి నుంచే ఆరో విడత కూడా..



రాష్ట్రంలో మత్స్యకార సోదరులంతా చాలా సంతోషంగా ఉన్నారు. మత్స్యకారుల బతుకుదెరువు, ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతూ మనసున్న ముఖ్యమంత్రిగా మీరు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం నుంచి నేరుగా సాయం అందడం మీ వల్లే సాధ్యమైంది. మళ్లీ మీ చేతుల మీదుగా ఆరో విడత కూడా తీసుకుంటాం. మీ ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరువలేనిది.
– పొన్నాడ సతీష్ కుమార్, ఎమ్మెల్యే, ముమ్మిడివరం

ఆశ వదిలేసుకున్న డబ్బులు అందుకుంటున్నాం..



గత ప్రభుత్వంలో రావనుకున్న డబ్బులు మీ చేతుల మీదుగా తీసుకుంటున్నాం. ఇప్పటివరకు ఒక్కొక్కరూ రూ.2,07,000 తీసుకున్నాం. ఇప్పుడు ఐదో విడతలో రూ. 69,000 అందుకుంటున్నాం. వేట నిషేధం సమయంలో గత ప్రభుత్వంలో అప్పులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు మత్స్యకార భరోసా, సబ్సిడీపై డీజిల్ అందిస్తున్నారు. గతంలో మాకు బీమా వచ్చేది కాదు. ఇపుడు మీరు ఇస్తున్నారు. నాకు అమ్మ ఒడి సాయం అందింది. మా అబ్బాయికి ట్యాబ్ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ ద్వారా మంచి వైద్య సేవలు అందుతున్నాయి. మా కుటుంబానికి రూ.5,32,000 మేర లబ్ధి చేకూరింది. ఆసరా సాయం కింద అందిన రూ.42 వేలతో కుట్టుమిషన్లు కొనుక్కున్నా. మా అమ్మకు చేయూత సాయం అందింది.
–నారాయణమ్మ, లబ్ధిదారు, కోనసీమ జిల్లా

అన్నీ ఇస్తున్నారు..



గతంలో మా గురించి ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. మా మత్స్యకారులందరికీ మీరు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. వేట నిషేధ సమయంలో ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఏటా రూ.10 వేలు ఇస్తున్నారు. ఆయిల్ సబ్సిడీ గతంలో కొందరికే అందగా ఇప్పుడు అర్హత ఉంటే చాలు అందరికీ ఇస్తున్నారు. గతంలో బీమా సాయం అందేది కాదు. ఇప్పుడు అన్నీ ఇస్తున్నారు. గతంలో ఫిషింగ్ హార్బర్లు లేవు. ఇప్పుడు మీరు ఏర్పాటు చేస్తున్నారు. మేమంతా మీ వెంటే ఉంటామన్నా.
– భైరవమూర్తి, వెంకటాయపాలెం, కోరంగి పంచాయతీ, కాకినాడ జిల్లా

కళ్లెదుటే అభివృద్ధి

విజయవాడలో రిటైనింగ్‌వాల్, రివర్ ఫ్రంట్ పార్కును ప్రారంభించిన సీఎం జగన్

- రూ.500 కోట్లతో నిర్మించిన కృష్ణా రిటైనింగ్ వాల్‌తో వరదల నుంచి నిశ్చింత
- రూ.239 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు శంకుస్థాపన
- 31,866 మంది పేదలకు సంపూర్ణ హక్కులతో పట్టాలు జారీ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కళ్లెదుటే ఇంత అభివృద్ధి కనిపిస్తున్నా రాష్ట్రంలో కొంతమంది మాత్రం ఒప్పుకోవట్లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. విజయవాడను గతంలో ఎప్పుడూ లేని విధంగా రూ.వందల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఏకంగా రూ.400 కోట్లతో అంబేడ్కర్ పార్కును మీ కళ్లెదుటే ప్రారంభించి పూర్తి చేశామని గుర్తు చేశారు. గత సర్కారు హయాంలో బెజవాడలో ఓ ఫ్లైఓవర్ కూడా పూర్తి కాని దుస్థితి నెలకొనగా మనందరి ప్రభుత్వం వచ్చాక దాన్ని పూర్తి చేయడమే కాకుండా మరో రెండు ఫ్లైఓవర్‌లు నిర్మించామని చెప్పారు. మంగళవారం విజయవాడలో పర్యటించిన సీఎం జగన్ కనకదుర్గ వారధి వద్ద ఇరిగేషన్ రిటైనింగ్ వాల్, కృష్ణా రివర్ ఫ్రంట్ పార్కు (కృష్ణ జలవిహార్)లను ప్రారంభించారు. రూ.239 కోట్లతో నగరంలో ఐదు చోట్ల నిర్మించే మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. విజయవాడ పురపాలక సంస్థ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పత్రాలు అందజేశారు. కొందరు లబ్ధిదారులకు సీఎం జగన్ స్వయంగా వీటిని అందించారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..



విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

31,866 పట్టాల రెగ్యులరైజ్...

ఈరోజు విజయవాడలో వివిధ కేటగిరీలకు సంబంధించి 31,866 పట్టాలను రెగ్యులరైజ్ చేసి ఆయా కుటుంబాలకు సంపూర్ణ హక్కులు కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. 22 ఏ కింద చేర్చడంతో హక్కులు లేక, రిజిస్ట్రేషన్ జరగక ఇబ్బంది పడుతున్న దాదాపు 21 వేల మంది వీరిలో ఉన్నారు. ఈ దుస్థితిని తొలగిస్తూ విజయవాడ సెంట్రల్, వెస్ట్, ఈస్ట్‌లో 16 కాలనీల వాసులకు మంచి చేస్తున్నాం. భ్రమరాంబపురంలో ఇళ్లు కట్టుకుని దశాబ్దాలుగా జీవిస్తున్న నిరుపేద కుటుంబాలు రెగ్యులరైజ్ కాకపోవడంతో అమ్ముకునే స్వేచ్ఛ లేక ఇబ్బంది పడుతున్నట్లు అవినాష్ నా దృష్టికి తెచ్చాడు. వీటన్నింటికీ పరిష్కారం చూపుతూ రెగ్యులరైజ్ జరుగుతోంది. ఎలాంటి వివాదాలు లేని 9,125 పట్టాలను కూడా రెగ్యులరైజ్ చేస్తున్నాం.

రూ.400 కోట్లతో అంబేడ్కర్ పార్కు

విజయవాడలో మీ బిడ్డ ప్రభుత్వం రూ.400 కోట్లు పైచిలుకు ఖర్చు పెట్టి అంబేడ్కర్ పార్కుకు అందరి కళ్లెదుటే పునాది రాయి వేయడంతోపాటు ప్రారంభించటాన్ని కూడా చూశారు. గతంలో విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు వెళ్లాలంటే ఒక్క ఫ్లై ఓవర్ కూడా పూర్తి కాని పరిస్థితి నుంచి 58 నెలల వ్యవధిలో పెండింగ్ ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయడమే కాకుండా మరో రెండు ఫ్లై ఓవర్లు అదే రోడ్డులో నిర్మించాం. కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ కూడా కలిపితే ఇంకో ఫ్లై ఓవర్ కూడా సాకారమైంది. ఇవన్నీ మన కళ్ల ఎదుటే యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యాయి.

బెజవాడ ట్రాఫిక్ కష్టాలకు విముక్తి

గుంటూరు నుంచి ట్రాఫిక్ విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం లేకుండా ట్రాఫిక్ కష్టాలకు విముక్తి కల్పిస్తూ కాజ నుంచి చిన్న అవుటపల్లి వైపు వెళ్లేలా చేపట్టిన ఔటర్ పనుల ప్రాజెక్టు పూర్తి కావచ్చింది. మరో రెండు నెలల్లో దీన్ని ప్రారంభించేలా పనులు జరుగుతున్నాయి. 58 నెలలుగా మన ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మంచి చేస్తూ ప్రతి అడుగూ అభివృద్ధి దిశగా వేస్తున్నాం. మనందరి ప్రభుత్వంలో స్కూళ్లు, హాస్పటళ్లు బాగుపడ్డాయి. గ్రామీణ స్థాయిలో వ్యవసాయం బాగుపడింది. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ఎప్పుడూ చూడని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒక్క రూపాయి లంచం లేకుండా వివక్షకు తావులేకుండా అర్హులందరికీ పారదర్శకంగా మేలు చేస్తున్నాం.

కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, కల్పలతారెడ్డి, మొండితోక అరుణకుమార్, రుహుల్లా ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్, డీసీఎంఎస్ చైర్మన్ పడమట స్నిగ్ధ, నీటి పారుదల, మున్సిపల్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు శశిభూషణ్, శ్రీలక్ష్మి, సీసీఎల్‌ఏ సాయిప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో భవాని శంకర్, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో కరకట్ట గోడలు..

కృష్ణా నదికి వరదలు వచ్చినా ఇబ్బంది లేకుండా దాదాపు రూ.500 కోట్లతో కరకట్ట గోడలు నిర్మించాం. గతంలో వరద వస్తే కృష్ణలంక ప్రాంతం నీట మునిగేది. గత పాలకులు మాటలకే పరిమితమయ్యారు. ఇలా గోడ కట్టాలని ఆలోచన చేసిన పాపాన పోలేదు. కృష్ణలంక ప్రాంతంలో అక్కచెల్లెమ్మలు, పిల్లలు, అవ్వలు, తాతలు సాయంత్రం పూట ఆహ్లాదకరంగా గడిపేందుకు పార్కు సుందరీకరణ పనులు చేపట్టాం.





లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పత్రాలను అందజేస్తున్న సీఎం జగన్, వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి

చిత్తశుద్ధితో నిర్మించారు



వరద వచ్చినప్పుడల్లా మా ప్రాంతంలోని ఇళ్లు ముంపునకు గురయ్యేవి. దీన్ని పరిష్కరించేందుకు ఎంతో మంది నాయకులు హామీ ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రిటైనింగ్ వాల్ నిర్మించారు. వారధి దిగువనే కాకుండా, ఎగువన కూడా నిర్మించారు. ఎగువ ప్రాంతంలో పార్కు అభివృద్ధి చేస్తాననడం సంతోషంగా ఉంది.
– కనగోని జ్యోతి, రణదివెనగర్

శాశ్వత పరిష్కారం లభించింది



రాణిగారితోట తారకరామనగర్ కరకట్ట దిగువన కూలీ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవిస్తున్నాం. తుపానులు వచ్చినప్పుడల్లా తట్టాబుట్టా సర్దుకుని పునరావాస కేంద్రాలకు వెళ్లేవాళ్లం. వరద ముంపునకు గురైన మా ప్రాంతాన్ని సీఎం జగన్ కళ్లారా చూసి చలించిపోయి గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గోడ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించింది.
– ఏలూరి వినయ్, తారకరామనగర్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

మేం 45 ఏళ్లుగా విజయవాడ నందమూరినగర్‌లో ఉంటున్నాం. కూలి పనులు చేసుకుంటూ అక్కడే ఒక బీ–ఫారం పట్టా ఉన్న ఇల్లు కొనుక్కున్నాను. అయితే ఎప్పుడు ఎవరొచ్చి ఖాళీ చేయమంటారోనని నిత్యం భయంతో కాలం వెళ్లదీశాను. కంటి నిండా నిద్ర ఉండేది కాదు. ఒక్కోసారి తిండి ఉండేది కాదు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి... పోయాయి. ఎప్పటి నుంచో అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాను. కానీ ఫలితం లేకుండా పోయింది. బీ–ఫారం పట్టాకు సంపూర్ణ భూ హక్కు పత్రాలను ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.
– చోడవరపు దుర్గ, నందమూరినగర్, విజయవాడ

రేపు సీఎం జగన్ కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ నెల 14న పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఆయన కర్నూలు జిల్లా ఓర్వకల్లు చేరుకుంటారు. అక్కడ నేషనల్ లా యూనివర్సిటీకి భూమి పూజ చేస్తారు. అనంతరం నంద్యాల జిల్లా బనగానపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరవుతారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. సాయంత్రం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ముస్లింలకు సీఎం జగన్ శుభాకాంక్షలు

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో ముస్లిం సోదర, సోదరీమణులకు సీఎం జగన్ శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బాధితులకు ముఖ్యమంత్రి ఆపన్నహస్తం

ఇద్దరికి రూ. 2 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విజయవాడ పర్యటన ముగించుకొని తిరిగి వెళ్తున్న సమయంలో బాధితులకు ఆపన్నహస్తం అందించారు. ఆర్థిక సహాయం కోరుతూ బాధితులు వినతులు అందించగా.. వారికి అండగా ఉంటానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన అధికారులు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బాధితులు ఇద్దరికి రూ. 2 లక్షలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా పలువురు అర్జీలు సమర్పించి తమ సమస్యలు చెప్పుకున్నారని తెలిపారు. సమస్యలు విన్న సీఎం తక్షణమే స్పందించి బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని తమకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఈరోజు ఇద్దరికి రూ. 2 లక్షలు చొప్పున చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, సీఎం చేసిన సహాయానికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. తమ కష్టాలను చెప్పుకున్న వెంటనే అర్థం చేసుకొని తక్షణమే స్పందించి సహాయం చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

సహాయం అందుకున్న వారు..

- విస్సన్నపేట మండలం, నరసాపురం గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు తమ ఆరేళ్ల కుమారుడు భానుతేజ కేన్సర్‌తో బాధపడుతున్నాడని.. చికిత్స అవసరాల నిమిత్తం సాయం చేయాలంటూ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా రూ. 2 లక్షలు సహాయాన్ని అందించారు.
- విజయవాడ, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన 31 ఏళ్ల కంబా ఏడుకొండలు.. ప్రమాదంలో తన రెండు కాళ్లు కోల్పోయానని.. తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగా రూ.2 లక్షలు సహాయాన్ని అందించారు.



భానుతేజ సమస్యను వింటున్న సీఎం



ఏడుకొండలు సమస్య వింటున్న సీఎం వైఎస్ జగన్



భానుతేజ వైద్యానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



ఏడుకొండలుకు ఆర్థిక సహాయం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

క్లుప్తంగా...

25 నుంచి డీఎస్సీ హాల్ టికెట్లు

- మార్చి 30–ఏప్రిల్ 30 వరకు పరీక్షలు
- 14 రోజుల పాటు రెండు సెషన్స్‌లో నిర్వహణ: మంత్రి బొత్స వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటించిన డీఎస్సీ-2024 పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం తెలిపారు. డీఎస్సీ పరీక్షల కోసం ఫిబ్రవరి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 15 నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా పలు కారణాలతో వాటిని ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14 రోజుల పాటు రెండు సెషన్స్‌లో పరీక్షలు ఉంటాయని, అభ్యర్థులు ఈ మార్పును గుర్తించాలని సూచించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు(ఎస్జీటీ) అర్హతలు మార్చడం, టెట్ పరీక్షకు డీఎస్సీ పరీక్షకు మధ్య తగిన సమయం ఇవ్వడం వంటి కారణాలతో షెడ్యూల్‌లో మార్పులు అనివార్యమైనట్లు వివరించారు. సెంటర్లను ఎంపిక చేసుకునేందుకు మార్చి 20 నుంచి వెబ్ ఆప్షన్లు ద్వారా అవకాశం కల్పిస్తున్నామన్నారు. హాల్ టికెట్లను ఈ నెల 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలు https://apdsc. apcfss.in/ లో చూడవచ్చన్నారు.

జాతీయ రహదారుల విస్తరణకు రూ.1,346.81కోట్లు

- ట్విట్టర్‌లో వెల్లడించిన కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని జాతీయ రహదారుల విస్తరణకు రూ.1,346.81కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తమిళనాడు టూ ఆంధ్రప్రదేశ్ ఎన్‌హెచ్-2 లేన్‌ను ఎన్‌హెచ్-4గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ/తమిళనాడు ఎన్‌హెచ్-716 రోడ్డును పుత్తూరు బోర్డర్ (20.03 కి.మీ.)వరకు విస్తరిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎన్‌హెచ్-71 లోని మల్లవరం జంక్షన్ నుంచి రేణిగుంట జంక్షన్ (17.40 కి.మి) నాలుగు లేన్‌ల షోల్డర్‌ను ఆరులేన్‌ల షోల్డర్‌గా, ప్యాకేజీ టూ కింద చిత్తూరు-తిరుపతి జిల్లాల్లో 'హైబ్రిడ్ అన్యూటీ మోడల్' (హెచ్ఏఎం)ను ఉపయోగిస్తున్నట్లు ట్విట్టర్ ద్వారా మంత్రి గడ్కరీ తెలిపారు. వీటితో పాటు కర్ణాటకలోని జాతీయ రహదారుల విస్తరణకు రూ.626.01కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దీనిలో భాగంగా కర్ణాటకలోని బళ్లారి నుంచి అనంతపురం మార్గంలో రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

గ్రేడ్-1 మునిసిపాలిటీగా పులివెందుల

సాక్షి, అమరావతి: పులివెందుల మునిసిపాలిటీని గ్రేడ్-1 స్థాయికి పెంచారు. ఈమేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పులివెందుల గ్రేడ్-2 యూఎల్‌బీ (అర్బన్ లోకల్ బాడీ)గా ఉంది.

నేడు ప్రధాన మంత్రి సూరజ్ ప్రోగ్రాం

వివిధ పథకాల లబ్ధిదారులతో వర్చువల్‌గా మోదీ ముఖాముఖి

ఏలూరు (టూటౌన్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూరజ్ ప్రోగ్రాంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 510 జిల్లాలకు చెందిన వివిధ పథకాల లబ్ధిదారులతో బుధవారం దూరదర్శన్‌లో వర్చువల్ విధానంలో ముఖాముఖిగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.కుముదిని సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణ కోసం డిప్యూటీ సెక్రటరీ రాజేష్ కుమార్ మక్కర్, ఎన్ఎస్ఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ డేవిడ్ హ్యాంగ్రేట్‌లను కేంద్ర ప్రభుత్వం నియమించినట్టు పేర్కొన్నారు.

'పది' పరీక్షలవ్వకుండా ఇంటర్ ప్రవేశాలు చేపడితే చర్యలు

- ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి సౌరభ్ గౌర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తి కాకుండానే 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలు చేపట్టిన ప్రైవేటు జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి సౌరభ్ గౌర్ హెచ్చరించారు. కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తుందని, దాని ప్రకారమే ప్రవేశాలు చేపట్టాలని సూచించారు. అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు కల్పించి, వసూలు చేసిన ఫీజును ఆయ కళాశాలలు వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. ఏదైనా జూనియర్ కళాశాల అడ్మిషన్ నోటిఫికేషన్‌కు ముందే ప్రవేశాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందితే ఆ జూనియర్ కళాశాల గుర్తింపును రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సౌరభ్ గౌర్ హెచ్చరించారు.

విశాఖ ఎంపీ సీటుపై

వదిన–మరిది డ్రామా!

రెండేళ్లుగా అక్కడ పనిచేస్తున్న జీవీఎల్‌కు పురందేశ్వరి చెక్..

- పూర్వపు టీడీపీ నేత సీఎం రమేష్ కోసం పట్టుబడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు
- తనకు సీటు రాకపోతే తీవ్ర పరిణామాలుంటాయని లోకేశ్ తోడల్లుడు భరత్ హెచ్చరిక
- చివరకు రమేష్ కోసం అనకాపల్లి ఎంపీ సీటు ఇప్పించేందుకు కసరత్తు
- వెనుకనుండి చక్రం తిప్పుతున్న చంద్రబాబు • బీజేపీ సీట్ల కేటాయింపు తీరుపై కమల దళంలో తీవ్ర అసంతృప్తి • పురంధేశ్వరి వ్యవహార సరళిపైనా విమర్శలు
- అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్న శ్రేణులు.. నడ్డాకు లేఖ



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : విశాఖ ఎంపీ సీటు విషయంలో అటు టీడీపీ ఇటు బీజేపీ పెద్ద డ్రామానే నడిపిస్తున్నాయి. పొత్తులు కడుతూనే వెనకాల నుంచి ఏ పార్టీ నుంచి ఎవరు పోటీ చేయాలో నిర్ణయిస్తూ చక్రం తిప్పుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి తమ పార్టీకి వెన్నుపోటు పొడుస్తున్నారని బీజేపీ నేతలు వాపోతున్నారు. అలాగే, విశాఖ ఎంపీ సీటు కోసం గత రెండేళ్లుగా పనిచేస్తున్న జీవీఎల్‌కు చెక్ పెడుతూ పూర్వాశ్రమంలో టీడీపీలో పనిచేసిన సీఎం రమేష్‌కు ఆ స్థానం కేటాయించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పట్టుబట్టడం ఆ పార్టీలో చర్చనీయాంశమవుతోంది. మరోవైపు.. చంద్రబాబు కుటుంబానికే చెందిన భరత్ కాస్తా తనకు సీటు ఇవ్వకపోతే ఏమైనా చేసుకుంటానని.. దానికి మీదే బాధ్యత అని హెచ్చరించడంతో సీఎం రమేష్‌కు అనకాపల్లి సీటును కేటాయించేలా పురందేశ్వరి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో గతంలో టీడీపీలో కీలకంగా వ్యవహరించి అప్పట్లో తనకు అనుకూలంగా ఉన్న వారికే ఇప్పుడు బీజేపీ సీట్లను కేటాయించేలా చక్రం తిప్పడంలో వదినకు మరిది (చంద్రబాబు) కూడా మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. తనకు విశాఖ ఎంపీ సీటు కేటాయించకపోతే ఏ అఘాయిత్యానికి పాల్పడినా అందుకు మీరే బాధ్యులవుతారంటూ టీడీపీ నేత, లోకేశ్ తోడల్లుడు భరత్ స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో అనకాపల్లి ఎంపీ సీటును సీఎం రమేష్‌కు కేటాయించేందుకు వీలుగా.. అందుకు జనసేన త్యాగం చేసేలా వదిన, మరిది చక్రం తిప్పుతున్నట్లు బీజేపీ శ్రేణులే అనుమానిస్తున్నాయి. మరోవైపు.. జనసేన నేతలు కూడా తమ పార్టీకి మొదట్లో ఇచ్చిన అరకొర సీట్లను సైతం అధినేత పవన్ వదులుకోవడాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు.

మళ్లీ పాత రోజులే!

మరోవైపు.. బీజేపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గతంలో పార్టీలో ఉన్న ఒక వృద్ధ నేత రాజకీయాలకు దూరంగా ఉండడంతో రాష్ట్రంలో బీజేపీ స్వయంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని భావించామని.. కానీ, ఇప్పుడు పురందేశ్వరి రూపంలో మళ్లీ పార్టీని బొందలో పెట్టే కార్యక్రమం నడుస్తోందని ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగానే పార్టీ కార్యాలయంలో వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా వలస నేతలకు సీట్లను కేటాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి చెప్పేందుకు కొద్దిమంది సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ వ్యవహారాలను అలాంటి వారికి అప్పగిస్తే తిరిగి పార్టీని నామరూపాలు లేకుండా చేస్తారనే విషయాన్ని వివరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు వీరు పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాకు లేఖ కూడా రాశారు.

జీవీఎల్‌కు పురందేశ్వరి చెక్!

ఇక విశాఖపట్నం ఎంపీ సీటు కోసం రెండేళ్లుగా జీవీఎల్ ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఇక్కడ పలు కార్యక్రమాలు చేపట్టారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం తన వంతు యత్నించారు. స్థానికంగా ఆయా వర్గాల్లో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పరచుకునే ప్రయత్నం చేశారు. ఒక వైపు స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్రం ముందడుగులు వేస్తుంటే.. కార్మికుల్లో వ్యతిరేకత రాకుండా వారితో చర్చలు జరిపి.. మధ్యేమార్గాలను సూచించాలంటూ సమావేశాలను నిర్వహించారు. ఈ పరిస్థితుల్లో జీవీఎల్‌కు సీటు రాకుండా పురందేశ్వరి చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. వెనుకనుండి కథ మొత్తం చంద్రబాబు నడిపించారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొన్నటివరకు జీవీఎల్ వైజాగ్‌లో ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా తమ అనుకూల మీడియాలో రాకుండా టీడీపీ నేతలు జాగ్రత్తపడ్డారు. అంతేకాక.. జీవీఎల్‌కు వ్యతిరేకంగా కథనాలను కూడా ప్రచురించారు. ఇప్పుడు ఏకంగా సీటు రాకుండా చేయడంతో జీవీఎల్ వర్గం కూడా మండిపడుతోంది.

ఏపీ విద్యుత్ సంస్థకు గోల్డెన్ పీకాక్ అవార్డు

అబుదాబిలో అవార్డు అందుకున్న ట్రాన్స్‌కో జేఎండీ చక్రధర్‌బాబు



అవార్డు సాధించిన ఏపీ ట్రాన్స్ కో అధికారులను అభినందిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసే డిమాండ్ ఫోర్‌కాస్టింగ్ మోడల్‌ను రూపొందించడంలో చేసిన వినూత్న కృషికి ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీట్రాన్స్ కో) ప్రతిష్టాత్మకమైన 'గోల్డెన్ పీకాక్ అవార్డు'ను కైవసం చేసుకుంది. ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్ కో సీఎండీ కే విజయానంద్, ఏపీ ట్రాన్స్ కో జేఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసి అవార్డు గురించి వివరించారు. సీఎం, ఇంధన శాఖ మంత్రి నిరంతర మార్గదర్శకత్వం వల్లనే ఈ ఘనత సాధ్యమైందని విజయానంద్ తెలిపారు. గత నాలుగేళ్లలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులను గెలుచుకోవడంలో విద్యుత్ సంస్థలు చేసిన కృషిని ముఖ్యమంత్రి జగన్, మంత్రి పెద్దిరెడ్డి అభినందించారని ఆయన వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిమాండ్ అంచనా నమూనా అమలుతో, ఏపీ ట్రాన్స్‌కో గత రెండేళ్లలో మార్కెట్లలో విద్యుత్ కొనుగోళ్లలో రూ.985 కోట్లను ఆదా చేయగలిగామని చక్రధర్‌బాబు తెలిపారు. ఈ నెల 5 నుంచి 8 వరకు అబుదాబి (యూఏఈ)లో గ్లోబల్ కన్వెన్షన్-2024 కార్యక్రమాన్ని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) నిర్వహించిందని చెప్పారు. ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన యూఏఈ ప్రభుత్వ మంత్రి హిస్ హైనెస్ షేక్ నహాయాన్ బిన్ మబారక్ అల్ నహాయన్, గౌరవ అతిథి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో భారత రాయబారి హెచ్‌ఈ సంజయ్ సుధీర్ సమక్షంలో అవార్డును అందుకున్నట్లు వివరించారు.

ఏపీ ఈఏపీ సెట్-2024 షెడ్యూల్ విడుదల



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్-2024 దరఖాస్తుల స్వీకరణ మంగళవారం ప్రారంభమైనట్లు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు చెప్పారు. దరఖాస్తులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 15 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.600, బీసీ రూ.550, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 30 వరకూ, రూ.1,000 ఫైన్‌తో మే 5 వరకూ, రూ.5 వేల ఫైన్‌తో మే 10 వరకూ, రూ.10 వేల ఫైన్‌తో మే 12వ తేదీ సాయంత్రం వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మే 13-16 వరకూ, అగ్రికల్చర్, ఫార్మసీకి మే 17-19 వరకూ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఏపీలో 47, హైదరాబాద్‌లో 1, సికింద్రాబాద్‌లో 1 చొప్పున ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. మే 7 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షకు ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వివరాలకు 0884-2359599, 0884-2342499 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

- పార్టీ ఫిరాయించిన వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యపై చర్య
- సమగ్ర విచారణ నిర్వహించి అనర్హత వేటు వేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీలుగా గెలిచి పార్టీ ఫిరాయించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, సి.రామచంద్రయ్యలపై అనర్హత వేటు వేసినట్లు శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా గెలిచిన వంశీకృష్ణ యాదవ్ జనసేనలో, అలాగే వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన సి.రామచంద్రయ్య తెలుగుదేశం పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసన మండలిలో చీఫ్ విప్ మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిలు మండలి కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీనిపై శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు స్పందిస్తూ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ ఆ ఇద్దరు ఎమ్మెల్సీలకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఆధారంగా వారి నుంచి మండలి చైర్మన్ వివరణ తీసుకున్నారు. సమగ్ర విచారణ అనంతరం ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, సి.రామచంద్రయ్యలపై మండలి చైర్మన్ మోషేన్ రాజు అనర్హత వేటు వేశారు.

ప్రభుత్వ విప్‌గా వరుదు కళ్యాణి



సాక్షి, అమరావతి: శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా మండలి సభ్యురాలు వరుదు కళ్యాణిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ప్రభుత్వ విప్‌గా పనిచేసిన జంగా కృష్ణమూర్తి పార్టీ ఫిరాయించడంతో ఆయన స్థానంలో కళ్యాణిని నియమించారు.

చివరి విడతలో ఎన్నికలు పెట్టేలా మేం ఆదేశాలివ్వలేం

- కేఏ పాల్ అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు
- పాల్ వినతి పత్రంపై నిర్ణయం వెలువరించండి
- కేంద్ర ఎన్నికల సంఘానికి ధర్మాసనం స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఏపీలో సార్వత్రిక ఎన్నికలను చివరి విడత కింద నిర్వహించి, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు జరిపేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాంటి ఆదేశాలను తాము జారీ చేయలేమని తేల్చి చెబుతూ అది పూర్తిగా ఎన్నికల సంఘం పరిధిలోని వ్యవహారమని స్పష్టం చేసింది. అందులో తాము ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అయితే ఈ అంశంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏల్ పాల్ ఇచ్చిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, దానిపై నిర్ణయం వెలువరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. ఏపీలో సార్వత్రిక ఎన్నికలను చివరి విడత కింద నిర్వహించి, ఆ వెంటనే ఓట్ల లెక్కింపు జరిపాలని, తద్వారా ఈవీఎంల ట్యాంపరింగ్‌ను అరికట్టవచ్చునని, ఈ దిశగా తగిన చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కేఏ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేయగా..దానిపై మంగళవారం జస్టిస్ నరేందర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పాల్ స్వయంగా వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో చివరి విడత కింద ఎన్నికలు నిర్వహించాలని తాను సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. వచ్చే వారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని, అందువల్ల ఈ లోపు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తాను ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగానే ఈ వ్యాజ్యం దాఖలు చేశానన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న పతంజలి శాస్త్రి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ తెలుగు కథ, నవలా రచయిత తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. 2023వ సంవత్సరానికి గానూ గతేడాది డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా 24 భాషల్లో రాసిన రచనలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ప్రకటించగా అందులో పతంజలి రచించిన 'రామేశ్వరం కాకులు.. మరికొన్ని కథలు' అనే లఘు కథల పుస్తకానికి ఈ పురస్కారం దక్కింది. 5 భాషల్లో చిన్న కథలు అవార్డులు గెలుచుకోగా వాటిలో ఒకటి తెలుగు కథ కావడం విశేషం. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పతంజలి శాస్త్రికి కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ సాహిత్య పురస్కారాన్ని అందించారు. 1945లో పిఠాపురంలో జన్మించిన పతంజలి శాస్త్రి విద్యాభ్యాసం అంతా ఒంగోలులో జరిగింది. ఎస్వీ వర్సిటీలో ఎంఏ, పూణె నుంచి ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేశారు. అమలాపురం కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా పనిచేశారు. 1960 నుంచి కథలు రాయడం ప్రారంభించారు. 'వడ్ల చిలుకలు', 'పతంజలి శాస్త్రి కథలు', 'నలుపెరుపు', 'రామేశ్వరం కాకులు' వంటి కథా సంపుటాలను రచించారు. 'హోరు', 'దేవర కోటేశు', 'గేద మీద పిట్ట' అనే నవలలు కూడా రాశారు.

వ్యక్తిత్వ హననానికి బాబే ఆద్యుడు

- ఐటీడీపీ సోషల్ మీడియాకు ఎందరో స్త్రీలు బలి
- ఎల్లో, సైకో ఫ్యాన్స్ ట్రోల్స్‌కు భయపడొద్దు
- ఆత్మస్థైర్యంతో ఎదురుదాడి చేయాలి
- చంద్రబాబును విమర్శిస్తే మోదీ కుటుంబాన్ని సైతం తిట్టాడు
- బీజేపీ టీడీపీతో పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటు
- ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో బూతు పదజాలం, వ్యక్తిత్వ హననం వంటి వికృత చర్యలకు టీడీపీ అధినేత చంద్రబాబే ఆద్యుడని ఏపీ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మండిపడ్డారు. డబ్బు మదంతో బాబు ఐటీడీపీ సోషల్ మీడియాను నడిపిస్తూ ఎంతోమంది మహిళల వ్యక్తిత్వంపై దారుణంగా దాడిచేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోల్స్ కారణంగానే గీతాంజలి బలైపోయిందన్నారు. సాక్షి టీవీ చానెల్ చర్చాగోష్టిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గీతాంజలి వంటి సామాన్య మహిళనే కాకుండా ప్రధాని మోదీని సైతం గతంలో చంద్రబాబు తూలనాడారని గుర్తుచేశారు. పోసాని ఇంకా ఏమన్నారంటే..

'చంద్రబాబు అవినీతిపరుడంటూ గతంలో మోదీ విమర్శించారు. పోలవరాన్ని ఏటీఎంలా వాడుకుంటున్నారని బహిరంగ సభలో ఆరోపించారు. అంతే.. వెంటనే చంద్రబాబు మోదీ కుటుంబంపై దాడికి దిగారు. మోదీ భార్యను వదిలేశారని, కొడుకులు లేరని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. అవినీతికి.. మోదీ కుటుంబానికి ఏం సంబంధం? చంద్రబాబును ఎవరైనా విమర్శిస్తే వెంటనే వాళ్ల కుటుంబ సభ్యులపై వ్యక్తిగత హననం జరుగుతుంది. గీతాంజలి వంటి ఎందరో మహిళలు ఎల్లో సోషల్ మీడియాకు బలైపోయారు. మరెందరో జీవచ్ఛవాల్లా మారిపోయారు. ఎల్లో, సైకో అభిమానుల సోషల్ మీడియా మెసేజ్‌లకు మహిళలు భయపడాల్సిన అవసరంలేదు. ఆత్మస్థైర్యంతో ఎదురుదాడి చేస్తే వాళ్లకే కన్నీళ్లు వస్తాయి. వలంటీర్లు మానవ అక్రమ రవాణా చేస్తున్నారని చెప్పిన నీచులపై సమాజం తిరగబడాలి. బ్రాహ్మణి, భువనేశ్వరిలకు తమ భర్తలు చేస్తున్న నీచత్వాన్ని గురించి మహిళలే రోడ్లపైకి వచ్చి చెప్పాలి.

బీజేపీ పొత్తు సిగ్గుచేటు..

చంద్రబాబు అక్రమంగా సంపాదించిన డబ్బులతోనే ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పదవి నుంచి కూలదోశారు. ఆ డబ్బులతోనే ప్రజానాయకుడిగా ఎదుగుతున్న జగన్‌ను జైలులో పెట్టించారు. ఆ తర్వాత 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనేశారు. అక్రమాలు బయటపడకుండా 18 కేసుల్లో స్టేలు తెచ్చుకోవడంతో పాటు స్కిల్ స్కాంలో జైలు నుంచి బయటపడేందుకూ రూ.కోట్లు కుమ్మరించారు. డబ్బు మదంతోనే గతంలో మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో కలిసి ప్రచారం చేశారు. అలాంటి మేకవన్నె పులి చంద్రబాబుతో కేవలం 6 ఎంపీ సీట్ల కోసం బీజేపీ పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటు. ప్రధాని మోదీని దూషించి, అమిత్ షాపై రాళ్ల దాడి చేయించిన చంద్రబాబుతో కలిసి ఎన్నికలకు వెళ్లడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఇక ప్రశ్నిస్తానంటూ పార్టీ పెట్టిన పవన్‌కళ్యాణ్ కేవలం ప్యాకేజీ కోసం చంద్రబాబు పంచన చేరి సీఎం జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకోవడం దారుణం.

టీడీపీ-బీజేపీ కూటమికి

మైనారిటీలు, దళితులు ఓట్లు వేయరు

▶ మొదటి పేజీ తరువాయి

కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన విమర్శలు, ఆరోపణలను గుర్తుచేశారు. చంద్రబాబు అప్పట్లో మోదీని ఉగ్రవాది అని విమర్శించాడని, అలాంటి వారికి ఇప్పుడు టీ అందిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీతో చంద్రబాబు ఎలా పొత్తుపెట్టుకుంటారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు బీజేపీకి ఎందుకు మద్దతిచ్చారో, మళ్లీ ఎందుకు కూటమి నుంచి బయటకు వచ్చారో తనకు అర్థం కాలేదని పేర్కొన్నారు. ఏపీలో ఉన్న మైనారిటీలు, ఆదివాసీలు, దళితులు, క్రిస్టియన్లు.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓటు వేయరని ఒవైసీ తేల్చి చెప్పారు. ఈ నాలుగు సామాజిక వర్గాల ఓటు బ్యాంకు నిర్ణయాత్మక శక్తిగా మారిందని, అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగలుగుతుందని పేర్కొన్నారు. ఏపీలో పోటీచేసే విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఒవైసీ స్పష్టం చేశారు.

సీఏఏకు వ్యతిరేకమే..

సీఏఏ అమలును అసదుద్దీన్ తీవ్రంగా వ్యతిరేకించారు. గతంలో తెలంగాణ అసెంబ్లీ సైతం సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యతిరేకిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సీఏఏపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని. ఇప్పుడు సీఏఏ ఆ తర్వాత ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీ అమలు కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ముస్లిం సమాజాన్ని టార్గెట్ చేయడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. సీఏఏ ద్వారా మత ధ్రువీకరణ రాజకీయాలు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా బీజేపీని ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.



వృద్ధాప్యం వస్తుంది. అనారోగ్యం వస్తుంది. మరణం కచ్చితంగా వస్తుంది. ఇవి తప్పనిసరి అని తెలిసినప్పుడు వాటికోసం సిద్ధపడాలి. ఇవి తథ్యమని తెలుసున్నప్పుడు, జీవితాన్ని ఎలా జీవిస్తున్నామో చూసుకోవాలి.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 13 మార్చి 2024

మళ్లీ సీఏఏ రంగప్రవేశం!


రేపో మాపో లోక్‌సభ ఎన్నికల నగారా మోగబోతున్న తరుణంలో... ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆరునూరైనా ఈనెల 15కల్లా బహిరంగపరచాలని సుప్రీంకోర్టు విస్పష్టంగా చెప్పిన కొన్ని గంటల్లో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) నిబంధనలపై సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదలైంది. అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలుగా వేధింపులకు లోనవుతూ మన దేశానికి వలసవచ్చిన హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ మతస్థులకు త్వరితగతిన భారత పౌరసత్వం ఇవ్వటం సీఏఏ ప్రధాన ఉద్దేశమని పార్లమెంటులో బిల్లు పెట్టిన సందర్భంగా కేంద్రం ప్రకటించింది. ఇప్పుడు మరోసారి ఆమాటే చెప్పింది. ఈ మతస్థులు వరసగా అయిదేళ్లపాటు ఈ దేశంలో నివసిస్తే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 1955 నాటి పౌరసత్వ చట్టానికి ఈ సవరణలు తీసుకొచ్చారు. చట్టంలో ముస్లింలను మినహాయించినట్టు బాహాటంగానే కనబడుతోంది. కానీ శ్రీలంకలో మైనారిటీలైన హిందూ తమిళులనూ, మయన్మార్‌లోని మైనారిటీలు రోహింగ్యాలనూ, ఇంకా... హజరా, అహ్మదీయ వంటి ముస్లిం మైనారిటీ తెగలనూ సీఏఏ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ తెగలు కూడా భారత పౌరసత్వం కోసం ఎప్పటిలా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే కనీసం వారు పదకొండేళ్లపాటు ఈ దేశంలో నివసించాలి. ఆచరణలో పౌరసత్వం రావటానికి దశాబ్దాలు పడుతుందని వేరే చెప్పనవసరం లేదు. ముస్లిం దేశాల్లోని హిందువుల స్థితిగతులపై వున్న ఆరాటం లంక తమిళుల విషయంలో ఎందుకు లేకుండా పోయింది? అక్కడ వారు ఎదుర్కొంటున్న వివక్ష, హింస తక్కువేమీ కాదు.

చట్టం ముందు అందరూ సమానులేనని మన రాజ్యాంగం చెబుతోంది. రాజ్యం ఎవరికీ సమానత్వాన్ని నిరాకరించకూడదనీ, పౌరులందరికీ చట్టాలు సమంగా రక్షణ కల్పించాలనీ రాజ్యాంగంలోని 14వ అధికరణ చాటుతోంది. పౌరసత్వానికి దరఖాస్తు చేసుకున్నవారి విషయంలో ఆ స్ఫూర్తే కొనసాగాలి. కానీ సీఏఏ అందుకు విరుద్ధంగా కొన్ని మతాలవారిని ఉదారంగా చూడటం, మరికొందరిని దూరం పెట్టడం ఎంతవరకూ సమంజసం? ఈ చట్టాన్ని సవాలు చేస్తూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) 2020లో పిటిషన్ దాఖలు చేసింది. కాలక్రమంలో మరో 200 పిటిషన్లు దానికి జత కలిశాయి. ఇందులో అస్సాంకు చెందిన అసోం గణపరిషత్, డీఎంకే, అస్సాం పీసీసీ మొదలుకొని అసదుద్దీన్ ఒవైసీ, మహువా మొయిత్రా, జైరాం రమేష్ వంటి నాయకులు కూడా వున్నారు. బిల్లు చట్టంగా మారాక దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో, విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు మిన్నంటాయి. ఢిల్లీలోని జామియా మిలియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వంటిచోట్ల హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల్లో వందమంది వరకూ మరణించగా, అనేకులు గాయపడ్డారు. వందలాదిమందిపై ఇప్పటికీ కేసులు కొనసాగుతున్నాయి. సోమవారం నోటిఫికేషన్ విడుదలయ్యాక ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, త్రిపురల్లో ఆందోళనలు చెలరేగాయి. ఈ ఉద్యమాల వెనకున్న ఉద్దేశం వేరు. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ వంటివి పరాయి దేశాల మైనారిటీలకు మనమెందుకు పౌరసత్వం ఇవ్వాలని ప్రశ్నిస్తున్నాయి. ఈ భారం తమపైనే పడుతుందని ఆందోళన పడుతున్నాయి. మరోపక్క సీఏఏ నోటిఫికేషన్ రాకపై గత కొన్ని నెలలుగా మీడియాలో కథనాలు వస్తూనే వున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీని ఎదుర్కొనటానికి ఇది బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతుందనీ, లేకుంటే దెబ్బతింటామనీ ఆ రాష్ట్ర బీజేపీ నేతలు చెబుతూ వస్తున్నారు. బెంగాల్‌లోని నాదియా, 24 పరగణాలు, తూర్పు బర్ద్వాన్, ఉత్తర బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు 1971లో బంగ్లా విముక్తి యుద్ధ సమయంలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మతువా తెగ ప్రజలు హిందువులు. పౌరసత్వ చట్టానికి 2003లో చేసిన సవరణ కింద వారంతా శరణార్థులుగా కొనసాగుతున్నారు. ఓటుహక్కు వగైరాలున్నాయి. మొదట్లో సీపీఎంకూ, తర్వాత తృణమూల్‌కూ, ఇప్పుడు బీజేపీకీ వోటు బ్యాంకుగా వీరు ఉపయోగపడుతున్నారు. అస్సాంలోనూ బీజేపీకి అటువంటి ప్రయోజనాలే వున్నాయి. రామమందిరం, పౌరసత్వ సవరణ చట్టంవంటివి మాత్రమే ఎన్నికల్లో గట్టెక్కిస్తాయని నిజంగా బీజేపీ భావిస్తే అది ఆ పార్టీ బలహీనతను సూచిస్తుందే తప్ప బలాన్ని కాదు.

పొరుగు దేశాల బాధిత మైనారిటీల విషయంలో అనుసరించాల్సిన విధానాలను మాత్రమే సీఏఏ నిర్ధారించిందని, మైనారిటీల పౌరసత్వానికి దానివల్ల వచ్చే నష్టంలేదని, వారు భయపడాల్సిన పని లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నారు. సీఏఏ దానికదే సమస్యాత్మకం కాకపోవచ్చు. కానీ జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)ను దాంతో అనుసంధానిస్తే ఉత్పన్నమయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కాదని నిపుణులంటున్న మాట. అస్సాంలో ఎన్ఆర్‌సీ అమలయ్యాక ఏమైందో చూస్తే ఇది అర్థమవుతుంది. ఆ రాష్ట్రంలో దాదాపు 20 లక్షలమంది పౌరసత్వానికి అనర్హులయ్యారు. ఇందులో ముస్లింలతోపాటు హిందువులు కూడా వున్నారు. ఎన్ఆర్‌సీని ఏదోమేరకు అంగీకరించిన అస్సాంలో సీఏఏపై వ్యతిరేకత వుండటాన్ని, లంక తమిళులకు చట్టంలో చోటీయక పోవటంపై వున్న అసంతృప్తిని కేంద్రం పరిగణనలోకి తీసుకున్నట్టులేదు. చట్టం తీసుకురావటానికి ముందు అన్ని వర్గాలతోనూ చర్చించలేదు. ఉద్యమాల సమయంలో చర్చలకు సిద్ధమని ప్రకటించినా అవేమీ జరగలేదు. కనీసం నోటిఫికేషన్ విడుదలకు ముందైనా సందేహాలు పోగొట్టాల్సిన అవసరం గుర్తించకపోతే ఎలా? అసలు ఎన్నికలు ముంగిట పెట్టుకుని సమస్యాత్మకమైన ఈ తేనెతుట్టెను ఎందుకు కదిపినట్టు?

ఆంధ్రలో ‘చంద్ర’ కళాప్రదర్శన

అభిప్రాయం



టంకశాల అశోక్

చంద్రబాబు చూపుతున్న ధీమా నిజమే అయితే, ఒంటరిగా పోరాడి అధికారానికి రాగలనని నమ్మాలి. ఎవరితోనూ పొత్తు అవసరం లేదని భావించాలి. కానీ జరుగుతున్నదేమిటి? స్వయంగా చంద్రబాబే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారు. 2014 నాటి స్వల్ప మెజారిటీ భయం, 2019 నాటి ఘోర పరాజయ భయం చంద్రబాబు మానసిక స్థితిని, ఆలోచనలను ప్రభావితం చేయటం మొదలుపెట్టాయి. వయసురీత్యా బహుశా ఇవి ఆయనకు చివరి ఎన్నికలు కావచ్చు. తన వారసుడు సమర్థుడనే నమ్మకం టీడీపీ వాదులకే కలగటం లేదు. ఈసారి గెలవనట్లయితే అది పార్టీ పునాదుల కింద భూకంపం కాగలదు. ఏమి చేసైనా గెలవటమన్నది చంద్రబాబుకు జీవన్మరణ ప్రశ్నగా మారింది. మనకు కన్పిస్తున్నదంతా ఆ ప్రయత్నాలలో భాగమే.

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని దృఢమైన స్వరంలో ప్రకటిస్తూ వస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఒంటరిగా పోటీ చేసే ఆత్మవిశ్వాసం లేక బీజేపీ, జనసేనలతోపొత్తు కుదుర్చుకున్నారు. జనసేనతో పొత్తు కొంతకాలంగా ఉన్నదే కాగా, అది సరిపోదన్నట్లు ఇప్పుడు అకస్మాత్తుగా బీజేపీతోనూ అంగీకారం కుదిరింది. అందుకోసం పవన్ కల్యాణ్ ద్వారా నానా ప్రయత్నాలు చేశారు. జగన్ ప్రభుత్వంపై అంత వ్యతిరేకత ఉంటే చంద్రబాబుకు ఇన్నిన్ని పొత్తులు ఎందుకనేది ఎవరికైనా వెంటనే మనసుకు వచ్చే సందేహం.

2014లో రాష్ట్రం విడిపోయినపుడు వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ చేయగా, ఒంటరిగా తలపడే ధైర్యం టీడీపీకి అప్పుడే లేకపోయింది. బీజేపీ మద్దతు కోరింది. పరోక్షంగా పవన్ మద్దతు తీసుకుంది. కొద్ది తేడాతో గెలిచి అధికారానికి వచ్చి ఎన్డీఏలో చేరింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు తన ఘనమైన పరిపాలనానుభవంతో మరెంతో ఘనంగా కొత్త రాష్ట్రాన్ని పాలించి, సర్వతోముఖాభివృద్ధి సాధించినట్లు టీడీపీ చెప్పుకొన్నది. అంతలో 2019 ఎన్నికలు రాగా, ఈ రికార్డులన్నింటి వల్ల ఈసారి చాలా పెద్ద మెజారిటీతో తిరిగి అధికారానికి రానున్నట్లు ప్రకటించింది. తీరా ఫలితాలు వెలువడినపుడు అంతా తలకిందులైంది. చాలా పెద్ద మెజారిటీ వైఎస్సార్‌సీపీకి రాగా, టీడీపీ చిత్తుగా ఓడింది. 2014లో మద్దతు ప్రకటించిన బీజేపీ 2019 వచ్చేసరికి దూరమైంది. 2019 ఓటమితో తమ వాస్తవ పరిస్థితి ఏమిటో బోధపడిన చంద్రబాబు కొంతకాలం కమ్యూనిస్టులతో, పవన్ కల్యాణ్‌తో దోబూచులాడి చివరకు పవన్ కల్యాణ్‌తో మైత్రిని స్థిరపరచుకున్నారు. కమ్యూనిస్టులతో మైత్రి అటూ ఇటూ సాగుతూ వస్తున్నది. ఇటీవలికి వచ్చేసరికి లెక్కలన్నీ వేసుకుని మరొకమారు ఎన్డీఏలో చేరుతున్నారు.

పొత్తులు సరే, కానీ పొత్తు ఏ విధంగా జరుగుతుందనే దానిని బట్టి ప్రజలు తమ అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. 2014లో బీజేపీ మద్దతు తీసుకున్న చంద్రబాబు అధికారానికైతే వచ్చారుగానీ, ఆ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీ చాలా స్వల్పం కావటంతోనే ఆయనకు అపుడే ఒరిజినల్ భయం మొదలైందనుకోవాలి. బీజేపీ మద్దతు కారణంగా ఎన్డీఏలో చేరి, ఆ ప్రాతిపదికపై మోదీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో సహా కొన్ని సాధించగలనని ఆశించారు. కానీ వివిధ కారణాల వల్ల అది అంతగా సిద్ధించకపోగా రాష్ట్రంలో తీవ్ర నిరాశ ఏర్పడి విమర్శలు రాగా, వాటిని తట్టుకోలేక ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. అన్నింటికన్నా ముఖ్యంగా తన పరిపాలన అస్తవ్యస్తంగా సాగి, అభివృద్ధి సంక్షేమాలు కన్పించక పోవటంతో ప్రజలలో వ్యతిరేకత తీవ్రంగా పెరగ సాగింది. 2014 గెలుపే స్వల్ప ఆధిక్యతతో కాగా, వ్యతిరేకత వల్ల ఓటర్లతో దూరం అప్పటి భయాన్ని అనేక రెట్లు పెంచింది. అయినా మళ్లీ బీజేపీకి దగ్గరయే



అవకాశం లేకుండా పోయింది. ఆ పార్టీని, మోదీని నానా మాటలతో దూషించారు గనుక. తానంటే నమ్మకం కుదరని కమ్యూనిస్టులు, జనసేన వేరే కూటమి పెట్టుకున్నాయి. అమరావతి కోసం భూసేకరణతో పాటు తన పరిపాలనా చర్యలనేకం ఎదురు తిరగగా 2019లో దారుణ పరాజయం ఎదురైంది. తన ఘనమైన సుదీర్ఘ పాలనానుభవం, మేధాశక్తి, రాజకీయ చాతుర్యం ఏవీ ఉపయోగపడలేదు.

ఆ విధంగా 2014 నాటి స్వల్ప మెజారిటీ భయం, 2019 నాటి ఘోర పరాజయ భయం కలిసి ఈ 2024 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబు మానసిక స్థితిని, ఆలోచనలను ప్రభావితం చేయటం మొదలుపెట్టాయి. వయసురీత్యా బహుశా ఇవి ఆయనకు చివరి ఎన్నికలు కావచ్చు. తన వారసుడు సమర్థుడనే నమ్మకం టీడీపీ వాదులకే కలగటం లేదు. అటువంటి స్థితిలో ఈసారి గెలవనట్లయితే అది పార్టీ పునాదుల కింద భూకంపం కాగలదు. ఆ బృహత్ ప్రమాదం దృష్ట్యా ఏమి చేసైనా సరే గెలవటమన్నది చంద్రబాబుకు జీవన్మరణ ప్రశ్నగా మారింది. మనకు కన్పిస్తున్నదంతా ఆ ప్రయత్నాలలో భాగమే.

తన ప్రయత్నాలలో మొట్టమొదటిది జగన్ పాలనపై ఎడతెరిపి లేని తీవ్ర విమర్శలు. అది కూడా తీవ్రాతి తీవ్ర స్వరంతో. ఈ విమర్శలు, ఆరోపణలలోని నిజానిజాలు చంద్రబాబుకైనా తెలుసునో లేదో చెప్పలేము. ఈ సంకుల అధికార సమరంలో అటువంటి విచక్షణకు ఎంతమాత్రం తావు లేదు. కానీ తార్కికంగా ఆలోచించినపుడు ఒకటి అనిపిస్తుంది. ఉదాహరణకు, జగన్ పాలన అసమర్థమైనదని చంద్రబాబు చేస్తున్న ప్రసంగాల పట్ల స్వయంగా ఆయనకు నమ్మకం ఉన్నట్లయితే, రాబోయే ఎన్నికల విషయమై పూర్తి ధీమా ఏర్పడాలి. తాను ఒంటరిగా పోరాడి గొప్ప మెజారిటీతో గెలిచి అధికారానికి రాగలనని తిరుగులేని విధంగా నమ్మాలి. ఎవరితోనూ పొత్తు అవసరం లేదని భావించాలి. ఇతరులే తనతో పొత్తు కోసం ప్రయత్నించే స్థితి ఏర్పడాలి. అట్లా ఎవరైనా అడిగినా, వారి కోసం కొన్ని సీట్లు వదులు కోవటం ఎందుకని వారిని తిరస్కరించాలి.

కానీ జరుగుతున్నదేమిటి? స్వయంగా చంద్రబాబే ఇతరులతో పొత్తు కోసం కొంత కాలం నుంచే వెంపర్లాడుతున్నారు. జనసేనతో ఏమి జరుగుతూ వస్తున్నదో చూస్తున్నాము. కమ్యూనిస్టులతో సఖ్యత కోసం కూడా ప్రయత్నాలు సాగాయి. అంతటితో ఆగితే అందుకొక అర్థం ఉండేదేమో. అప్పటికైనా ఆయన బలహీనత తెలిసి వచ్చేదే గానీ కనీసం అది రాష్ట్ర స్థాయి రాజకీయంగా ఉండిపోయేది. కానీ, ఆ పొత్తులైనా తన విజయానికి సరిపోగలవన్న నమ్మకం చంద్రబాబుకు కలిగినట్లు లేదు. ఆ స్థితిలో ఇక మిగిలింది బీజేపీ అనే జాతీయ పార్టీ. 2014–19 మధ్య తన ఆశలను అడియాస చేసి, తన వైపు నుంచి తాను ఎన్నెన్నో కఠినమైన విమర్శలు సాగించి, సెక్యులరిజం, మతతత్త్వం వంటి పదాలను యథేచ్ఛగా దొర్లించి దాడులు చేసి, ఎన్డీఏ నుంచి ఈ కారణాల పరంపరతో నిష్క్రమించిన పార్టీ టీడీపీ. అయితేనేమిగాక. ప్రస్తుతం వరదలో కొట్టుకుపోతూ దారి తెన్ను కన్పించక, భవిష్యత్తు అంధకార బంధురంగా తోస్తున్న తనకు ఈ గత చరిత్ర గురించిన శషభిషలు అవివేకమవుతాయి. కనుక ‘పవన రాయబారం’ సాగించి నేటికి కృతకృత్యులయ్యారు. అయినప్పటికీ ఫలం సిద్ధిస్తుందా అంటే ఎవరూ చెప్పలేరు.

దానినట్లుంచితే, బీజేపీతో సంబంధాల విషయమై ఇంతలోనే ఈ మార్పు ఏమిటి? అని ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నలు ఎదురు కాగలవన్నది చంద్రబాబు ఊహించలేని విషయం కాదు. అందుకు వివరణలను ముందే సిద్ధం చేసి ఉంచుకున్నట్లు కనిపిస్తున్నది. వాటిని ఆయన స్వయంగా వివరించిన దానిని బట్టి మూడు మాటలు కన్పిస్తున్నాయి. ఒకటి, ఏపీ ప్రయోజనాలను కాపాడేందుకు కలిసి పని చేయాలనుకోవటం. రెండు, ఒకవేళ టీడీపీ అధికారానికి వచ్చినా కేంద్ర సహాయం లేకుండా రాష్ట్రాభివృద్ధికి సాధ్యం కాదు గనుక బీజేపీతో కలవాలనుకోవటం, మూడు, ఎన్డీఏ సమావేశంలో పాల్గొనవలసిందిగా ఇతర మాజీ మిత్ర పక్షాలతో పాటు టీడీపీకి కూడా ఆహ్వానం అందినందున ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలనుకోవటం. ఈ వివరణలోని నిజాయితీ ఏమిటో, పొత్తులోని అసలు ఉద్దేశం ఏమై ఉంటుందో ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు.

ఈ వివిధ పరిణామాలన్నింటి వెనుక స్పష్టంగా కనిపిస్తున్నది మాత్రం ఒకటే. జగన్‌పై చంద్రబాబు విమర్శలు, ఆరోపణలైతే యథేచ్ఛగా సాగిస్తున్నారు గానీ, వచ్చే ఎన్నికలలో విజయావకాశాలపై నమ్మకం కలగటం లేదు. ఆ కారణంగా తన రాజకీయ కళలన్నీ ప్రదర్శిస్తున్నారు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

మీరు గుర్తించరా?



‘జంగ్నన్ ప్రాంతం చైనాకు చెందినది. సోకాల్డ్ అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ఎప్పుడూ గుర్తించ లేదు’ అని చైనా ప్రతినిధి వ్యాఖ్యానించారు. భారత్–చైనా సంబంధాలు ‘సాధారణం’గా ఉండకపోవడానికి ఉన్న ఎన్నో కారణాల్లో ఇదీ ఒకటి. రానున్న కాలంలోనూ సాధారణం అయ్యే అవకాశం లేదు. దానికి బాధ్యత చైనా మీదే ఉంటుంది.

– సనా హాష్మీ, ఫెలో

ఇంత దారుణమా?



సంబంధాలు ఘోరంగా క్షీణిస్తున్నాయి. కుటుంబంలో తోబుట్టువుల మధ్య ఆస్తి తగాదాలు. ఇరు పక్షాల నుంచి పెట్టుకున్న కేసులు చూడండి: అత్యాచారం, దొంగతనం, నేరపూరిత కుట్ర, గృహ హింస, సీఆర్‌పీసీ 125(మనోవర్తి), హింస, ఉల్లంఘన, ఇంకా పది కేసులు!

– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

అలా జరుగుతోందా?



సీఏఏను వ్యతిరేకిస్తున్నవాళ్లు జవాబివ్వాల్సిన ప్రశ్న ఇది: పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్– ఈ మూడు దేశాల్లో ముస్లింలు కూడా మతపీడనకు గురవుతున్నారా? తమ దేశంలోనే ముస్లింలను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్తాన్ పీడిస్తోందా? వాళ్లకు కూడా ఇండియా ఆశ్రయం ఇవ్వాలా?

– మోహన్‌దాస్ పాయ్, వ్యాపారవేత్త

ఎలా జరిగింది?



ఎల్‌సీఏ తేజస్ కూలిపోవడం విషాదకరం. దాని సేవలు మొదలైన 23 ఏళ్లలో ఇదే మొదటి ప్రమాదం. పైలట్ సురక్షితంగా ఉన్నాడని తెలియడం సంతోషం. దీనికి కారణాలు ఏమిటో త్వరలోనే తెలుసుకుని, వాటిని సరిచేసుకుంటామని ఆశ.

– యూసుఫ్ ఉంర్ఘువాలా, విశ్లేషకుడు

అందరి అంశం



ప్రజారోగ్యం అనేది వైద్యులందరూ పట్టించుకోవాల్సిన అంశం కావాలి; ఏదో కొద్దిమంది దాన్ని ప్రత్యేకంగా చదివేవాళ్లకు అది పరిమితం కావొద్దు.

– టిమ్ కెల్లీ, వైద్యుడు

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలి ‘మహిళా’ డాక్టర్

పాశ్చాత్య ప్రపంచంలో డాక్టర్ అంటే మొదట్లో పురుషుడే! అయితే ఈ వైద్యుల మహిళా కుటుంబ సభ్యులు సహాయకులుగా ఉండేవాళ్ళు. మహిళా రోగులు స్త్రీల ద్వారానే వైద్యం పొందితే బావుండనే పరిస్థితి ఉండేది. 1800లో ఇంగ్లాండులో ‘రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్’ సంస్థ ఏర్పడి, లైసెన్స్ ఇస్తూ నకిలీ డాక్టర్ల బెడదను తగ్గించడానికి కృషి చేసింది. అయితే, వైద్య విద్యను పొందడానికి గానీ, వైద్య వృత్తిని పాటించడానికి గానీ అక్కడ మహిళలకు అవకాశం లేదు. కనుకనే ‘ఉమెన్స్ హెల్త్ మూవ్‌మెంట్’ వచ్చింది.



డా॥ జేమ్స్ మిరెండా స్టువర్ట్ బ్యారీ

ఆ చరిత్ర పుటలను తిరగేస్తే తారసపడే తొలి మహిళా డాక్టరు బ్రిటిష్ ఆర్మీలో పనిచేసిన డాక్టర్ జేమ్స్ మిరెండా స్టువర్ట్ బ్యారీ. ఈమె అసలు పేరు మార్గరెట్ యాన్ బల్క్ లే. ఈమె తన జీవిత పర్యంతం పురుషుడిగానే చలామణీ అయింది. పురుషుడుగానే ఆమె ఎడింబరో యూనివర్సిటీలో 1809లో అడ్మిషన్ పొంది, అలానే 1812లో డాక్టర్ కోర్సు డిగ్రీ ఎమ్‌డీని పొందారు. ఐర్లాండ్‌లోని కోర్క్ నగరంలో 1789లో జన్మించారు.

దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌తో పాటు బ్రిటిష్ సామ్రాజ్యంలోని చాలా ప్రాంతాల్లో దాదాపు 50 ఏళ్లకు పైగా వైద్య వృత్తిని విజయవంతంగా నిర్వహించారు. ఆఫ్రికాలో సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించి, తల్లి బిడ్డ క్షేమంగా ఉండేట్టు విజయం సాధించిన తొలి యూరోపియన్ డాక్టర్‌గా నమోదు అయ్యారు. బ్రిటిష్ ఆర్మీలో రెండవ అతి పెద్ద ఉన్నత పదవి ‘ఇన్‌స్పెక్టర్ జనరల్ ఇన్‌ఛార్జ్ ఆఫ్ మిలిటరీ హాస్పిటల్స్’ స్థాయికి వెళ్లిన తొలి వ్యక్తి కూడా!


ఈమె తండ్రి జెరేమియా బల్క్ లే, తల్లి మేరీ యాన్ బల్క్ లే. జెరేమియా అప్పుల్లో కూరుకునిపోయి చివరకు జైలు పాలయ్యాడు. దాంతో గత్యంతరం లేని ముగ్గురు పిల్లల తల్లి 15 సంవత్సరాల మన భావి డాక్టర్‌తో ఐర్లాండ్ నుంచి లండన్‌కు వెళ్లింది. మరుసటి సంవత్సరమే అక్కడ ఉన్న ఆమె సోదరుడు కన్నుమూయడంతో ఆయన ఆస్తి వీరికి దక్కడం ఒక ఆశ్చర్యకరమైన మలుపు. ఈ దశలో మేరీ యాన్ బల్క్ లే, ఆమె సోదరుని సన్నిహిత, ఉదారవాద వాద మిత్రులు కొందరు సంయుక్తంగా చర్చించి ఒక ప్రణాళిక వేశారు. కనుకనే 1809 నవంబర్లో యూనివర్సిటీ వైద్య శాస్త్రం చదువుకు పురుషునిగా అడ్మిషన్ పొందింది. అప్పటి నుంచీ పురుష దుస్తుల్లో కనిపిస్తూ బాహ్య ప్రపంచానికి ‘అతడు’గా మారిపోయింది.

చదువు పూర్తి చేసిన తర్వాత బ్రిటిష్ ఆర్మీలో హాస్పిటల్ అసిస్టెంట్‌గా 1813 జూలైలో ఉద్యోగం పొంది, శిక్షణ పొందిన తర్వాత 1816లో దక్షిణాఫ్రికా లోని కేప్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. అక్కడ గవర్నర్ లార్డ్ చార్లెస్ సోమర్ సెట్ కూతురు ఒకరు అనారోగ్యంతో ఉండడంతో డా॥ జేమ్స్ బ్యారీ ఆ కుటుంబ సభ్యులుగా మారిపో(యింది)యారు. మారిషస్, వెస్టిండీస్, మాల్టా, కెనడా వంటి చోట్ల ఆమె పనిచేశారు. 1865 జూలై 25న డాక్టర్ జేమ్స్ బ్యారీ కన్ను మూశారు. మరణం తర్వాత డాక్టరు పురుషుడు కాదని, స్త్రీ అని బయట ప్రపంచానికి బోధపడింది. అప్పట్లో అది సంచలనమైంది.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

తండ్రి ఆశయం... తనయుడి సాకారం

అభిప్రాయం



లింగమనేని శివరామ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్ కడప జిల్లా, నెల్లూరు జిల్లా, చిత్తూరు జిల్లా, ప్రకాశం జిల్లా, కర్నూలు జిల్లాలలోని నల్లమల అడవులలో వ్యాపించి ఉన్న కొండల వరుసను వెలుగొండలు అంటారు. ఈ కొండల శ్రేణిలో మధ్య ఖాళీ స్థలంలో వున్న సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల అనే మూడు గ్రామాల దగ్గర గోడలలాగ ఆనకట్టలు కట్టి సుమారు 20 కి.మీ. పొడవైన సహజమైన ‘నల్లమల సాగర్ రిజర్వాయర్’ నిర్మించి, కృష్ణా నదిలో 43.5 టీఎమ్‌సీ వరద నీటిని కొల్లంవాగు సమీపంలోని శ్రీశైలం రిజర్వాయర్ నుండి తరలించి నల్లమల సాగర్ రిజర్వాయర్‌లో నిల్వ చేయాలని ప్రతిపాదించారు. తొలుత ఈ ప్రాజెక్టును ‘వెలిగొండ ప్రాజెక్టు’ అని పిలిచారు. జలయజ్ఞంలో భాగంగా 2004 అక్టోబరు 27న మార్కాపురానికి 15 కి.మీ. దూరంలో గొట్టిపడియ దగ్గర నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా దోర్నాల సమీపంలోని కొత్తూరు నుంచి నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ప్రాజెక్ట్ ఎగువ భాగంలోని ‘కొల్లం వాగు’ వరకు రెండు టన్నెల్స్ తవ్వకం పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జల వనరుల శాఖ చేపట్టింది. 1994 డీపీఆర్‌పై ఆధారపడిన మొదటి దశ ప్రతిపాదనలో 10.7 టీఎమ్‌సీ నీటిని 45 రోజులలో 7 మీటర్ల వ్యాసం, 85 క్యుమెక్స్ సామర్థ్యం గల సొరంగం కాలువ ద్వారా తరలించాలని తలపెట్టారు. రెండవ దశ పనులలో భాగంగా 9.2 మీటర్ల వ్యాసం, 243 క్యుమెక్స్ సామర్థ్యం గల రెండవ సొరంగ కాలువ జతచేయబడటం వలన 30 రోజుల వరద నీటితోనే జలాశయం నిండే అవకాశం ఏర్పడింది.

మార్కాపురం, యర్రగొండ పాలెంల నుంచి పలు సార్లు శాసనసభ్యునిగా గెలిచి ప్రకాశం జిల్లాతో పాటు మరికొన్ని కరువు ప్రాంతాలకు సాగు నీరు, త్రాగునీరు అందించడానికి పోరాటం చేసిన పూల సుబ్బయ్య పేరు మీద ఈ ప్రాజెక్టుకు ‘పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు’ అనే పేరు పెట్టారు.

వైఎస్సార్ వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. పనులను పరుగులెత్తించారు. 2020లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత తన తండ్రి ప్రారంభించిన ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి కంకణం కట్టుకొని పూర్తి చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్ట్ తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడమే కాక, కొండంత అవినీతి జరిగింది. వెలిగొండ మొదటి సొరంగంలో ఈపీపీ పద్ధతిలో అప్పగించిన పనులను ఆలస్యంగా చేస్తున్నారనే నెపంతో 2018 ఆగస్టులో 3.6 కి.మీ. పనులను ఎల్ఎస్ (లంప్సమ్ ఓపెన్) విధానంలో కొత్త కాంట్రాక్టరుకు అప్పగించడం వలన రూ. 49.49 కోట్లు దుర్వినియోగం కాగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహించిన రివర్స్ టెండరింగ్ వలన ప్రభుత్వ ఖజానాకు రూ. 61.67 కోట్లు మిగిలిందని కాగ్ నివేదిక పేర్కొంది. ఐదేళ్ల చంద్రబాబు నాయుడు పాలనలో 6.686 కి.మీ (మొదటి సొరంగం 4.331 కి.మీ. రెండవ సొరంగం 2.355 కి.మీ.) తవ్వకం పని మాత్రమే జరిగింది. కాగా వైఎస్సార్, జగన్‌ల పాలనా కాలంలో 31 కిలోమీటర్ల దూరం తవ్వకం జరగడం గమనార్హం. టీడీపీ ప్రభుత్వం అంచనా వ్యయాన్ని పెంచి కొత్త కాంట్రాక్టరుకు పనులు అప్పగించినా కాంట్రాకరుకు లబ్ధి, ఖజానాపై భారం పడిందే కానీ పని వేగం మాత్రం పెరగలేదనేది కాదనలేని సత్యం.

ఈ ప్రాజెక్టు వల్ల ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంతో పాటు, నెల్లూరు, కడప జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. నల్లమల సాగర్ నుంచి ఐదు కాలువల ద్వారా నీటిని నెల్లూరు జిల్లా ఉదయగిరి, కడప జిల్లా బద్వేల్, ప్రకాశం జిల్లాలో కరవు ప్రాంతాలకు మొత్తం 30 మండలాలలోని 15.25 లక్షల మందికి తాగునీరు, 4,49,000 ఎకరాలకు సాగు నీరు అందించాలన్న స్వర్గీయ డా॥ వైఎస్ఆర్ లక్ష్యం నెరవేరుతుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రకాశం జిల్లాలోని 23 మండలాలకు చెందిన 3.36 లక్షల ఎకరాలకూ, నెల్లూరు జిల్లాలోని 5 మండలాలకు చెందిన 84 వేల ఎకరాలకూ, కడప జిల్లాలోని రెండు మండలాలకు చెందిన 29 వేల ఎకరాలకూ ఆయకట్టుకు సాగు నీరు, 30 మండలాల్లోని కరవు పీడిత ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటి సౌకర్యం లభిస్తుంది.

తండ్రి ఆశయాలను సాకారం చేసిన తనయునిగా, కరవు ప్రాంతాలకు నీరు అందించిన భగీరథునిగా జగన్ ప్రజల మన్ననలు పొందేందుకు మార్చి 5వ తేదీన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేయడం మలి అడుగుగా భావించాలి.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు
మొబైల్: 79813 20543

ఎవరి నుంచైనా...

సూఫీ జ్ఞానులలో ఒకరు హసన్. ఆయన ఓమారు ఒక ఊరికి వెళ్ళారు. అక్కడ ఓ చిన్నారి వెలుగుతున్న కొవ్వొత్తిని పట్టుకుని పోతుండటాన్ని చూశారు. చిన్నారే కదా అని పిలిచి, ‘కొవ్వొత్తి వెలుగు ఎక్కడి నుంచి వస్తోందో నీకు తెలుసా’ అని అడిగారు. ఆ చిన్నారిగానీ చెప్పకుంటే తాను చెప్పాలనుకున్నారు హసన్. ఆ చిన్నారి ఏమాత్రం తడబాటు లేకుండా, వెలుగుతున్న కొవ్వొత్తిని ఉఫ్ అని ఊది ఆర్పేసి, ‘ఇప్పుడు వెలుగు ఎక్కడికి పోయిందో మీకు తెలుసా’ అని అడిగింది. ఇంతసేపూ వెలిగిన వెలుగు ఎక్కడికి పోయిందో మీరు చెప్తే వెలుగు ఎక్కడి నుంచి వచ్చిందో తాను చెప్తానని అంది. ఆ చిన్నారి అమాయకురాలని అంచనా వేసి తానేంటో చెప్పుకోవాలనుకున్న హసన్ అహం అణగారిపోయింది ఆ క్షణంలో. ఆ చిన్నారి కూడా తనకు గురువే అని ఆయన చెప్పుకున్నారు. ఎవరు ఏ క్షణంలో ఏ విధంగా కళ్ళు తెరిపిస్తారో చెప్పడం ఊహకందని విషయమన్నది హసన్ అభిప్రాయం.



జ్యోతిర్మయం

ఇతరులను చూసి ఎల్లప్పుడూ ఆనందంగా ఉండడం ఎలాగో గ్రహించారు మరో గురువు. ‘మీరీ చివరి క్షణాల్లోనూ ఎలా నవ్వుతూ ఉండగలుగుతున్నార’ని అడిగారు. అప్పుడాయన ‘మీ వయస్సులో ఉన్నప్పుడు నేనొక వృద్ధ సాధువును కలిశాను. ఎప్పుడూ ఎందుకు నవ్వుతూ ఉంటారని అడిగాను. అప్పుడాయన తాను మొదట్లో ఎప్పుడూ చిటపటలాడుతూ ఉండేవాడిననీ, తన చిరాకుని చూసి ఎవరూ తనతో మాట్లాడటానికి ఇష్టపడేవారు కాదనీ, చెప్పారు. తనను తాను ఆ రోజు తనకు ఏం కావాలో ప్రశ్నించుకున్నాడాయన. ఆనందం అని మనసు జవాబు చెప్పడంతో ఎప్పుడూ నవ్వుతూ ఉండడం అలవాటు చేసుకున్నానని చెప్పారు. అది నాకూ నచ్చింది’ అన్నారు గురువుగారు. శిష్యులు తామూ అలాగే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎవరి నుంచైనా మంచిని నేర్చుకొని ఆచరించడానికి సిద్ధమయ్యారు.

– యామిజాల జగదీశ్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.తదియ ఉ.8.39 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** అశ్వని రా.11.12 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.27 నుండి 8.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.46 నుండి 12.34 వరకు, **అమృత ఘడియలు:** సా.4.30 నుండి 6.01 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 6.05.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మాకు ఎంతో మేలు జరిగింది



మాది వ్యవసాయ కుటుంబం. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామంలో నాకున్న కొద్దిపాటి భూమిలో పంటలు పండించుకుంటూ కష్టనష్టాలకు ఓర్చి ఇద్దరు ఆడపిల్లలను చదివించుకున్నా. పంట పండనప్పుడు నష్టాలు చవిచూసేవాడ్ని. కానీ ఏ ప్రభుత్వం ఆదుకోలేదు. మా పిల్లలకు ఉద్యోగాలు కూడా రాలేదు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. నా కుమార్తెలు లలిత, స్వాతిలకు సచివాలయాల్లో మహిళా పోలీసులుగా ఉద్యోగాలు వచ్చాయి. నాకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున అందుతోంది. దీనివల్ల వ్యవసాయానికి అప్పు చేయాల్సిన అవసరం తప్పింది. నా భార్యకు వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.22 వేలు జమయ్యింది. గ్రామంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఎరువులు, విత్తనాలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. దానివల్ల సమయం ఆదా అయింది. అదనపు ఖర్చు తప్పింది. గతంలో ఎరువులు, విత్తనాలకు 20 కిలోమీటర్లు దూరం వెళ్లేవాడిని. ఇప్పుడు ఆ బాధ లేదు. నాకున్న సొంత స్థలంలో ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షల సాయంతో సొంతంగా ఇల్లు నిర్మించుకున్నా. అన్ని వర్గాల వారికి మేలు జరిగిన ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– బూడి గణపతి, గడసాం
(సుంకరి తిరుపతిరావు, విలేకరి, దత్తిరాజేరు)

నిరంతర విద్యుత్ ఆదుకుంటోంది



నేను చిన్నకారు రైతును. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం గురండి గ్రామంలో నాకున్న రెండెకరాల భూమితో పాటు, మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విద్యుత్తు పథకంతో వ్యవసాయ బోరు వేసుకుని పంటలు పండిస్తున్నాను. గత ప్రభుత్వం వల్ల రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 అందుతోంది. దీనికి తోడు 9 గంటలపాటు నిరంతర ఉచిత విద్యుత్తుతో రెండు పంటలు సాగు చేస్తున్నా. ప్రస్తుతం రబీ వరి పంట వేశా. నాకు వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతి నెలా ఒకటో తేదీనే అందుతోంది. నా భార్య గువ్వాడ నర్సమ్మకు వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ 18,750 అందుతుండడంతో ఆ మొత్తం కుటుంబ పోషణకు వినియోగిస్తున్నాం. మా పిల్లల్లో రాంప్రసాద్ బీ.టెక్, కుమార్తె సంగీత బి.పార్మసీ, రఘురాం బీ.టెక్ చదువుతున్నారు. ముగ్గురికీ జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అందడంతో వారి చదువులు పైసా ఖర్చు లేకుండా సాగిపోతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సాయం వల్లే మేము ఈ రోజు హాయిగా జీవిస్తున్నాం. సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గువ్వాడ మిన్నారావు, గురండి
(టంకాల మోహనరావు, విలేకరి, భామిని)

సొంతింటి కల నిజం చేశారు



మేము బతికుండగా సొంతింటిలో జీవిస్తామని ఏనాడు అనుకోలేదు. అటువంటి మా చిరకాల స్వప్నాన్ని ఈ ప్రభుత్వం నిజం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మాది బాపట్ల జిల్లాలోని కొల్లూరు గ్రామం. నా భర్త ముక్కాముల వేంకటేశ్వరరావు అర్చకత్వం చేస్తారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి పంపాం. మేమిద్దరమే ఇంట్లో ఉంటాం. మా వారికి 60 సంవత్సరాలు రావడంతో వయోభారం వల్ల అర్చన చేసేందుకు వెళ్లలేకపోతున్నారు. కుటుంబ అవసరాల కోసం నేనే ఇంటి వద్ద పిల్లలకు ట్యూషన్లు చెబుతూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో బతుకుతున్నాం. గత 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే కాలం గడుపుతున్న మాకు ఎప్పటికైనా సొంత ఇల్లు కట్టుకోవాలనేది కల. అందుకు ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో ఆ కోరిక తీరదేమోనని బాధ పడేవాళ్లం. ఈ ప్రభుత్వం మా ఊరి చివర్లో ఎంతో విలువైన లే అవుట్‌లో మాకు స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం చేసింది. దీనికి మరికొంత డబ్బు కలుపుకొని సొంత ఇంటిని నిర్మించుకున్నాం. మాకు ఏ దిగులూ లేదు. దశాబ్దాల నాటి చిరకాల వాంఛను నిజం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. మా ఆయనకు పెన్షన్ కూడా వస్తోంది. నాకు ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున మూడేళ్లుగా అందుతుండటంతో కుటుంబ అవసరాలకు ఇబ్బందులు పడడం లేదు. గత ప్రభుత్వంలో జరగని మేలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరగడం ఎంతో ఆనందంగా ఉంది.

– ముక్కామల సాయికుమారి, కొల్లూరు
(కె.శ్రీనివాసరావు, విలేకరి, గుంటూరు ఎడ్యుకేషన్)

అప్పుడు బీజేపీ.. ఇప్పుడు జనసేన

చంద్రబాబు విష కౌగిలిలో మిత్రపక్షాలు గిలగిల.. 2014లో బీజేపీకి ఇచ్చిన సీట్లలో కోత పెట్టిన బాబు



సాక్షి, అమరావతి: చంద్రబాబుతో పొత్తు అంటే విష కౌగిలిలో చిక్కుకున్నట్లే. చంద్రబాబుతో ఒకసారి పొత్తు పెట్టుకున్నాక ఆయన ఇచ్చే షాక్‌లతో మిత్రపక్షాలకు బుర్ర తిరగాల్సిందే. గతంలో ఈ దెబ్బ బీజేపీకి గట్టిగానే తగిలింది. ఇప్పుడు జనసేన వంతు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయి. లోపాయికారీ వ్యవహారంలో భాగంగా జనసేన ఎన్నికల నుంచి దూరంగా ఉంది. టీడీపీ – బీజేపీ కూటమికి మద్దతు తెలిపింది. అప్పట్లో టీడీపీ – బీజేపీ పొత్తు కుదిరిన రోజున బీజేపీకి 5 లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ఆ తర్వాత వెంటనే ఒక అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానం తగ్గించేశారు. బీజేపీ 14 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాక వారు బలమైన అభ్యర్థులు కాదంటూ ఓ కారణం చూపించి, మరో అసెంబ్లీ స్థానంలో టీడీపీనే పోటీ చేస్తుందని అప్పటి బీజేపీ రాష్ట్ర నాయకులను బాబు ఒప్పించారు. ఆ తర్వాత బీజేపీకి మిగిలిన 13 స్థానాల్లో సంతనూతలపాడు, గుంతకల్లు, కడప అసెంబ్లీ నియోజకవర్గాల్లో చంద్రబాబు టీడీపీ నాయకులకు అధికారికంగా బీ ఫారాలు ఇచ్చారు. దీంతో ఆ మూడు చోట్లా రెండు పార్టీల అభ్యర్థులు పోటీ చేశారు. బీజేపీ జాతీయ నాయకత్వం జోక్యం చేసుకున్నా చంద్రబాబు వెనక్కి తగ్గలేదు. ఇలా చివరకు బీజేపీకి 10 అసెంబ్లీ స్థానాలనే మిగిల్చారు.

రాష్ట్ర విభజనకు ముందు 2009 ఎన్నికల్లో టీఆర్‌ఎస్, ఉభయ కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు.. టీఆర్‌ఎస్‌కు ఇచ్చిన పలు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు ఇచ్చి పోటీ చేయించారు. దీంతో ఓట్ల లెక్కింపునకు ముందే టీఆర్‌ఎస్ ఆ కూటమి నుంచి తప్పుకొంది.

జనసేనకు 20 అయినా మిగులుతాయా అని నేతల ఆందోళన..

ఈసారి పొత్తులో జనసేనకు ఇచ్చిందే 24 అసెంబ్లీ స్థానాలు. ఇంత తక్కువ సీట్లు ఇవ్వడాన్ని జనసేన అభిమానులు, నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా సోమవారం జరిగిన చర్చల్లో చంద్రబాబు జనసేనకు ఇచ్చే సీట్లలో 3 అసెంబ్లీ, 1 లోక్‌సభ స్థానానికి కోత పెట్టేశారు. జనసేనకు మిగిలింది 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు. నామినేషన్ల సమయానికి ఇంకెన్ని కోత పడతాయో తెలియదు. ఇంతలోనే భీమవరం జనసేన అభ్యర్థిగా టీడీపీ నేత పులివర్తి రామాంజనేయులు రంగప్రవేశం చేశారు. ఆయనకు ఆయనే భీమవరం జనసేన అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. అంటే ఒక స్థానంలో చంద్రబాబు అభ్యర్థి జనసేన టిక్కెట్టు దక్కించుకున్నట్టే. జనసేనకు మిగిలింది 20 అసెంబ్లీ స్థానాలే. మిగిలిన స్థానాల్లో జనసేన అభ్యర్థుల ప్రకటన పూర్తయినా, వాటిలో సైతం టీడీపీ అధికారికంగానో లేదంటే రెబల్ అభ్యర్థుల రూపంలోనో లేక తన అభ్యర్థులనే వ్యూహాత్మకంగా జనసేనలోకి పంపి పోటీ చేయించడమో చేస్తూనే ఉంటుందని, ఇక అసలైన జనసేన నేతలకు ఎన్ని మిగులుతాయో తెలీదని మదనపడుతున్నారు. మొదటి నుంచి జనసేనకు పనిచేస్తున్న వారిని కాదని, టీడీపీ పంపిన వారిని పోటీకి దింపితే మరింత గందరగోళం ఏర్పడుతుందని అంటున్నారు.

జనసేనలోకి బాబు అభ్యర్థి!

పొత్తుల్లో భీమవరం అసెంబ్లీ స్థానం జనసేనకే వచ్చింది. కానీ, గత ఎన్నికల్లో అక్కడ పవన్‌కళ్యాణ్ పైనే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పులవర్తి రామాంజనేయులే ఇప్పుడూ అక్కడే పోటీ చేస్తున్నారు. ఇదెలా అంటారా..? సింపుల్.. 2014, 2019 రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, నిన్నటి వరకు అదే పార్టీలో చురుగ్గా పనిచేసిన రామాంజనేయులు జనసేనలోకి జంప్ అయ్యారు. ఈసారి జనసేన అభ్యర్థిగా తెరమీదకు వస్తున్నారు. మంగళవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. భీమవరానికి ఆయన్ని అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించకపోయినా, తానే అక్కడి పోటీ చేయబోతున్నట్లు ప్రకటించుకున్నారు. 'చంద్రబాబుతో పొత్తు అంటే ఇలాగే ఉంటుంది. పవన్ కూడా ఆయన చెప్పినట్లే ఆడుతున్నారు' అంటూ జనసేన నేతలు తీవ్రంగా మథన పడుతున్నారు. చంద్రబాబు ఓ ప్రణాళిక ప్రకారం ఒక్కొక్క నేతను జనసేనలోకి పంపుతారని, ఇది ఆంజనేయులుతో మొదలైందని తెలిపారు. కానీ, ఏకంగా తమ అధినేత పవన్‌పై పోటీ చేసిన నేతనే జనసేనలో చేర్పించి అదే స్థానం నుంచి పోటీ చేయిస్తారని కలలో కూడా ఊహించలేదని అంటున్నారు.

జనసేనకు దక్కిన సీట్లు తక్కువ ఎక్కువ అన్నది మరిచిపొండి

175 స్థానాల్లో జనసేనే పోటీ చేస్తోందనుకోండి

పార్టీ శ్రేణులకు జనసేన అధినేత పవన్ సూచన

సాక్షి, అమరావతి: 'పొత్తులో జనసేనకు దక్కిన సీట్లు తక్కువ ఎక్కువ అన్నది మర్చిపొండి. పార్టీ నాయకులు, శ్రేణులందరూ 175 స్థానాల్లో జనసేనే పోటీ చేస్తోందని అనుకోవాలి. 175 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తోందని, 175 స్థానాల్లోనూ టీడీపీ పోటీ చేస్తోందని భావించాలి' అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. 'గత ఎన్నికల్లో నా ఒక్క సీటు కనుక గెలిచి ఉంటే పరిస్థితి వేరేగా ఉండేది. గతంలో చేసిన తప్పులు వెంటాడతాయంటారు. ముందు వాళ్లు చేసిన తప్పులు వెంటాడుతున్నాయి. నేను వాటన్నింటికీ పరిహారం కట్టాను' అంటూ వ్యాఖ్యానించారు. మంగళవారం మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు చేరిన సందర్భంగా పవన్ ప్రసంగించారు. 'భీమవరంలో నేను ఓడిపోయినప్పుడు రామాంజనేయులు చాలా బాధపడ్డారు. మీరు పోటీ చేస్తారని ముందే తెలిసి ఉంటే నేను పోటీ చేయకుండా ఉండేవాడినని ఆయన అప్పట్లో చెప్పారు. గత ఎన్నికల్లో భీమవరంలో ఓటమికంటే, పులివెందులలో జగన్‌మోహన్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయుంటే సంతోషించేవాడిని. నన్ను భీమవరంలో పూర్తి స్థాయిలో యుద్ధం చేయనివ్వకుండా బంధుత్వం పేరుతో సంకెళ్లు కట్టారు. ఈసారి భీమవరం నుంచి గ్రంధి శ్రీనివాస్‌ను తరిమికొట్టాలి. కాపు కులస్తుడని ఆయన ఏం చేసినా కాపులందరూ వెనకేసుకొస్తే, అది కాపు సామాజికవర్గం అందరిపై పడుతుంది. ఈసారి భీమవరం జనసేన కొట్టి తీరాలి. ఇది మీరు ప్రిస్టేజ్‌గా తీసుకోండి. నేను తాడేపల్లిగూడెం సభలో యుద్ధాన్నే ప్రకటించా. యుద్ధం తాలూకు అంతిమ లక్ష్యం ప్రభుత్వం మారడం. జగన్‌కు యుద్ధాన్ని ఇద్దాం. జగన్ తాలూకు జలగలను తీసిపారేద్దాం. సరిగ్గా మే 15 కల్లా వైఎస్సార్‌సీపీ విముక్త ఆంధ్ర జరుగుతుంది. ఆంధ్రను కాపాడుకునే వాళ్లం భీమవరం కాపాడుకోలేమా? వ్యూహం, టైమింగ్ నాకు వదిలేయండి' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

చీపురుపల్లి నుంచి పోటీ చేయను!

చంద్రబాబుకు స్పష్టం చేసిన గంటా శ్రీనివాస్



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు సూచించిన మేరకు తాను చీపురుపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసేది లేదని గంటా శ్రీనివాసరావు తెగేసి చెబుతున్నారు. చీపురుపల్లి నుంచి పోటీకి దిగితే బొత్స సత్యనారాయణ చేతిలో చావు దెబ్బ తప్పదని తెలియడంతో అక్కడి నుంచి బరిలో ఉండకూడదని గంటా నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని నేరుగా చంద్రబాబుకు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ అక్కడి నుంచే బరిలో ఉండాలని బాబు కూడా అంతే స్పష్టంగా గంటాకు సూచించినట్టు తెలుస్తోంది. దీంతో విజయనగరం జిల్లాలో టీడీపీ నుంచి పెద్ద నేతలు లేరని.. అక్కడకు వెళ్లి పార్టీ వ్యవహారాలు చూడాలంటూ టీడీపీ ఎన్నికల వ్యూహకర్త రాబిన్‌శర్మ బృందం గంటాకు సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. తనను బలి పశువు చేసేందుకే ఇటువంటి వాదనలు తెరమీదకు తెస్తున్నారని గంటా భావిస్తున్నారు. తనకు విశాఖ జిల్లాలోని భీమిలి సీటు ఇవ్వాలని గంటా కోరగా.. ఆ సీటు ఇవ్వడం కుదరదని కూడా బాబు తెగేసి చెప్పినట్టు సమాచారం. పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని జనసేనకు ఇవ్వాల్సివుందని పేర్కొన్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయ మార్గాలపై గంటా దృష్టిసారించినట్టు ప్రచారం.

నేతలు లేరంటూ..!

ప్రతి ఎన్నికలో నియోజకవర్గాలను మారుస్తూ పోటీ చేయడం గంటాకు పరిపాటి. 2014 ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేసిన ఆయన 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గానికి మారిపోయారు. ఈసారి ఏకంగా జిల్లా దాటించాలని బాబు నిర్ణయించారు. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం నుంచి మంత్రి బొత్సకు పోటీగా నామినేషన్ వేయాలని బాబు సూచించారు. విజయనగరం జిల్లాలో పార్టీకి ఇన్నిరోజులుగా పెద్ద దిక్కుగా ఉన్న అశోక్ గజపతిరాజు ఈ ఎన్నికల్లో పోటీలో ఉండటం లేదు. ఆయనకు వారసురాలిగా కూతురిని బరిలో నిలుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీని జిల్లాలో నడిపించే నాయకత్వం అవసరమని.. అందుకోసం విజయనగరం జిల్లాకు వలస వెళ్లాలని గంటాకు సూచించినట్టు సమాచారం. అయితే, ఇదంతా తనను బలిపశువు చేసేందుకేనని గంటా భావిస్తున్నారు. ఒకవేళ అలా అనుకుంటే బాబు కూడా పులివెందుల నుంచి పోటీలో ఉండొచ్చు కదా అనే వాదనను రాబిన్ శర్మ టీం ఎదుట గంటా వర్గీయులు ఉంచినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో చిర్రెత్తుకొచ్చిన బాబు చీపురుపల్లి నుంచి బరిలో ఉండాల్సిందేనని.. భీమిలి సీటు ఇచ్చేది లేదని తేల్చిచెప్పినట్టు సమాచారం. టీడీపీ ఓడిపోయినప్పటి నుంచీ గంటాకు చంద్రబాబుకు మధ్య దూరం పెరిగింది. బాబు విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు తనకు మద్దతు పలకలేదన్న విషయాన్ని బాబు గుర్తుంచుకున్నారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

టీడీపీకి మాజీ ఎమ్మెల్యే శివరామరాజు గుడ్‌బై



శివ కార్యాలయం వద్ద తొలగిస్తున్న టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. భీమవరంలోని తన కార్యాలయం వద్ద గల టీడీపీ, జనసేన ఉమ్మడి ఫ్లెక్సీలను మంగళవారం ఆయన అనుచరులు తొలగించారు. ఉండి నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన కలవపూడి శివ ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలో నిలవాలని భావించారు. సీటు దక్కకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కొద్దిరోజులుగా అధిష్టానంతో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆయన తన అనుచరులతో కార్యాలయం వద్ద గల టీడీపీ, జనసేన ఫ్లెక్సీలను తొలగించారు. ఆ స్థానంలో శివ స్వచ్ఛంద సంస్థ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లెక్సీల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే శివను సంప్రదించగా త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.



వైఎస్సార్‌సీపీ 'పసిడి జెండా'..



వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జెండాను బంగారంతో రూపొందించి అబ్బురపరిచాడు శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి. గుండు సూదిపై నిలిచేలా కేవలం 10 మిల్లీ గ్రాముల బంగారం ఉపయోగించి రెండు గంటలు శ్రమించి ఈ సూక్ష్మ రూపాన్ని తయారు చేశారు. –కాశీబుగ్గ

సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నూర్‌బాషా సామాజిక వర్గాన్ని కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకునేలా చట్టం చేసిన సందర్భంగా సీఎం జగన్ రుణం తీర్చుకోలేదని నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ అన్నారు. మంగళవారం ఏలూరులో సయ్యద్ బాజీ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎంతోమంది సీఎంల వద్ద మొరపెట్టుకున్నా తమ గోడును ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ సీఎం జగన్‌కు తమ సమస్య తెలిపిన వెంటనే జీఓ జారీ చేసి తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు.

పొత్తు రాజకీయాలతో జనసేనలో అయోమయం

- విశాఖ స్టీల్ పట్ల మీ వైఖరి ఏంటి?
- విభజన హామీలపై ఏం సమాధానం చెబుతారు!
- టీడీపీ, జనసేన పార్టీలను ప్రశ్నించిన మంత్రి గుడివాడ



రాజానగరం: పొత్తు రాజకీయాలు జనసేన పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్లలో సుమారు రూ.60 కోట్లతో 104 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎన్నికల పోరాటానికి సిద్ధమంటుంటే.. టీడీపీ, జనసేన అధినేతలు మాత్రం అమిత్‌షా ఇంటిచుట్టూ తిరుగుతూ పొత్తులకు సిద్ధమంటూ ప్రాధేయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని సీట్లు ఇచ్చినా.. ఇచ్చిన వాటిని తగ్గించుకోవాల్సి వచ్చినా.. రాష్ట్ర ప్రజలను, పార్టీని వదిలేసి వారితో కాపురం చేయడానికి సిద్ధమంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సరైన గుర్తింపు, ఆదరణ లేని బీజేపీని ఇంత బలవంతంగా అడుక్కోవాల్సిన పరిస్థితి చంద్రబాబు, పవన్‌కు ఎందుకు వచ్చిందో వారే సమాధానం చెప్పాలన్నారు. జనసేన పార్టీకి 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు సీట్లు ఇస్తే వాటిలో కూడా మరో మూడు అసెంబ్లీ సీట్లు తగ్గించేశారని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌ను అమాయకుణ్ణి చేసి పక్కన ఉంటున్న నాదెండ్ల మనోహర్ కూడా ఆడుకుంటున్నాడని అన్నారు. అందుకే సొంత అన్నకు కూడా పార్టీ టికెట్ ఇచ్చుకోలేని దుస్థితిలో పవన్ కళ్యాణ్ ఉన్నారన్నారు. దీనిపై పవన్ తన కార్యకర్తలకు, నాయకులకు ఏ సమాధానం చెబుతారో చూడాలన్నారు.

విశాఖ స్టీల్‌పై ఏం సమాధానం చెబుతారు?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటీకరిస్తామంటోందని.. దానికి చంద్రబాబు, పవన్ ఏం సమాధానం చెబుతారని మంత్రి అమర్‌నాథ్ ప్రశ్నించారు. దీనికి సమ్మతం అంటారా.. స్వాగతిస్తామంటారా.. మీ ఇష్టం వచ్చినట్టు చేసేయండి అంటారా.. అవసరమైతే ఈ రాష్ట్రాన్ని కూడా అమ్మేయండి అంటారా అని నిలదీశారు. విశాఖ స్టీల్‌తోపాటు విభజన చట్టంలోని అనేక అంశాలపై కూడా వారిద్దరూ సమాధానం చెప్పి ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. మంత్రి వెంట రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఉన్నారు.

గిరిజన వికాసానికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ



గుండా సురేంద్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గిరిజన వికాసానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో అనేక విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) సంస్థ చైర్మన్ గుండా సురేంద్ర మంగళవారం చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా అనేక కార్యక్రమాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా గిరిజన కుటుంబాలకు నూరు శాతం సంక్షేమ పథకాలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.12,900.41 కోట్లు, పరోక్ష పద్ధతి ద్వారా రూ.5,409.93 కోట్లను ప్రభుత్వం అందించిందని వివరించారు. గిరిజన యువత ఉపాధి కోసం రేషన్ సరుకులు పంపిణీ చేసేలా 701 మినీ ట్రక్కులను 90% సబ్సిడీపై ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు.

సీఎం జగన్‌కు ప్రజలందరూ ఆశీస్సులివ్వాలి

ఆయన సృష్టించిన చరిత్రను చెరిపేయడం ఎవరి తరం కాదు

ఎమ్మెల్సీ, 'మండలి' చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సృష్టించిన చరిత్రని చెరిపేయటం ఎవరి తరం కాదని ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టంచేశారు. ప్రజల అవసరాలే తన ఎజెండా అని చెప్పిన ఏకైక నాయకుడు ఆయనేనని కొనియాడారు. ఇలాంటి నాయకుడికి ప్రజలందరి ఆశీస్సులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించి భారీ కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చంద్రబాబుకు అధికారం మీద మాత్రమే ప్రేమ అని.. ప్రజలు, వారి అవసరాల మీద ఏమాత్రం లేదన్నారు. ఈ ఐదేళ్లలో నేను మంచి చేశాననిపిస్తేనే ఓటెయ్యమని సీఎం జగన్ అంటున్నారని.. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఇలాంటి నాయకుడ్ని చూడలేదని ఉమ్మారెడ్డి అన్నారు.

అన్నిచోట్లా వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్..

గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ముగ్గురు కాదు 30 మంది కలిసొచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని స్పష్టం చేశారు. 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్‌సీపీ స్వీప్ చేయబోతోందన్నారు. వైఎస్ జగన్ లాంటి సీఎం మాకు కూడా ఉంటే బాగుంటుందని ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా కోరుకుంటున్నారన్నారు. చరిత్ర సృష్టించటం సీఎం జగన్‌కే సాధ్యమని.. కుప్పంలో చంద్రబాబుని, మంగళగిరిలో లోకేశ్‌ని ఓడించి తీరుతామని మంత్రి ధీమా వ్యక్తంచేశారు. గుంట నక్కలు, తోడుదొంగలు చేసే నీచ రాజకీయాలను ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని జోగి రమేష్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 'మండలి'లో విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ అంటేనే విశ్వసనీయతకు మారుపేరని.. ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోను అమలుచేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

అన్ని వర్గాలకూ అండగా సీఎం జగన్..

ఇక వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. 13 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి వైఎస్ జగన్ అని తెలిపారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత.. ఇలా అన్ని వర్గాలకు ఆయన అండగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. సీఎం జగన్ ఉంటేనే అందరికీ మేలు జరుగుతుందని స్పష్టంచేశారు. ఆయన్ని అణచివేయాలని ఎంతోమంది చూశారని.. కానీ, ఎన్ని కుట్రలు పన్నినా ఎదుర్కొని సీఎం జగన్ విజేతగా నిలిచారన్నారు.

ఐదేళ్లలో హామీలన్నీ నెరవేర్చారు..

ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. పార్టీ పెట్టినప్పటి నుండి సీఎం జగన్ పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావని.. వాటన్నింటినీ ఎదుర్కొని, తట్టుకుని అధికారం సాధించారన్నారు. ఈ ఐదేళ్లలో ఆయన చెప్పిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తుచేశారు. ఇక చంద్రబాబు ఢిల్లీలో బీజేపీ నేతల ఇళ్ల ముందు పడిగాపులు కాశారని.. ఇలాంటి వారు ప్రజలకు ఏం చేస్తారని సురేశ్ ప్రశ్నించారు. మోసాలలో పుట్టి మోసాలు చేసే చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో ప్రజలందరికీ తెలుసునన్నారు. అంతకుముందు.. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత పానుగంటి చైతన్య నాయకత్వంలో విద్యార్థులు, యువజనులు జైజై నినాదాలతో భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు సలహాదారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే, పార్టీ 14వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల సేవా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

'జగన్ అనే నేను'..

ఇదిలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద డిజిటల్ బోర్డు ఏర్పాటుచేశారు. మంత్రి జోగి రమేష్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు 'జగన్ అనే నేను..' ఈ కౌంట్‌డౌన్ బోర్డును ఆవిష్కరించారు. 73 రోజుల్లో జగన్ మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారని చెప్పేందుకు చిహ్నంగా ఈ బోర్డు పెట్టినట్లు పార్టీ నేతలు తెలిపారు.



మరోసారి గొప్ప విజయం సాధించేందుకు మీరంతా సిద్ధమా?

వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీఎం జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: 'నేడు మన వైఎస్సార్‌సీపీ 14వ వ్యవస్థాపక దినోత్సవం. ఆనాడు వందమంది ఏకమై మనపై యుద్ధానికి వస్తే.. అప్పుడు నాకు రక్షణగా నిలిచిన ప్రజల కోసం ప్రారంభమైన పార్టీ మన వైఎస్సార్‌సీపీ. ఇన్నాళ్లూ నా ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన ప్రతి ఒక్క కార్యకర్తకు, అభిమానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అంటూ ఎక్స్‌లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ మంగళవారం పోస్ట్ చేశారు. ప్రజాక్షేత్రంలో మరోసారి మనం గొప్ప విజయం సాధించేందుకు మీరంతా సిద్ధమా? అంటూ కార్యకర్తలు, అభిమానులను ఉద్దేశించి పేర్కొన్నారు.

రైలు పట్టాలపై జీవితం ఆరంభించా

రైల్వే శాఖ కష్టాలు, ప్రయాణికుల ఇబ్బందులు నాకు తెలుసు

- తద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులోకి వచ్చాయి
- గుజరాత్‌లో ప్రధాని మోదీ
- రూ.1,06,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం..
- 10 నూతన వందేభారత్ రైళ్లకు పచ్చజెండా

అహ్మదాబాద్/పోఖ్రాన్: రైలు పట్టాలపైనే తన జీవితాన్ని ప్రారంభించానని, రైల్వే శాఖకు సంబంధించిన కష్టాలు, ప్రయాణికుల ఇబ్బందులన్నీ తనకు తెలుసని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. నరకం లాంటి పరిస్థితి నుంచి రైల్వేలను బయటకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైల్వే రంగం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత అప్పటి ప్రభుత్వాలు రైల్వేశాఖ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని, సొంత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చాయని విమర్శించారు. 21వ శతాబ్దంలో రైల్వేల ప్రగతిని దృష్టిని పెట్టుకొని రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశామని వెల్లడించారు. తద్వారా రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పర్యటించారు. సబర్మతి ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.1,06,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.85,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు ఉన్నాయి. పది నూతన వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో సికింద్రాబాద్–విశాఖపట్నం, పూరీ–విశాఖపట్నం వందేభారత్ రైళ్లు కూడా ఉన్నాయి. తిరుపతి–కొల్లాం స్టేషన్ల మధ్య కొత్త రైలుకు పచ్చజెండా ఊపారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసం కాదు

2004–2014తో పోలిస్తే గత పదేళ్లలో తమ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధికి 6 రెట్లు అధికంగా ఖర్చు చేసిందని ప్రధానమంత్రి అన్నారు. గతంలో రైళ్లు ఆలస్యంగా నడవడం అనేది సాధారణ వ్యవహారంగా ఉండేదన్నారు. 2014 వరకు దేశంలో కేవలం 35 శాతం రైల్వే లైన్లు విద్యుదీకరణకు నోచుకున్నాయని గుర్తుచేశారు. రైళ్లలో ప్రయాణానికి రిజర్వేషన్ దొరకడం చాలా కష్టంగా ఉండేదని, టికెట్ల కోసం ప్రయాణికులు గంటల తరబడి క్యూలో నిల్చునేవారని, ఏజెంట్లు కమీషన్లు వసూలు చేసేవారని చెప్పారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. దేశ ప్రగతి అనే మిషన్‌లో భాగంగానే అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు చేపడుతున్నామని, అంతేతప్ప కొందరు ఆరోపిస్తున్నట్లు ఎన్నికల్లో లబ్ధి కోసం ఎంతమాత్రం కాదని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

సొంత వారసత్వ సంపదను కాపాడుకోని దేశానికి భవిష్యత్తు ఉండదని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. మన దేశ వారసత్వ సంపదను కాపాడే విషయంలో గత ప్రభుత్వాలు ఏమాత్రం నిబద్ధత చూపలేదని విమర్శించారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలో దండి యాత్ర వార్షికోత్సవంలో మోదీ పాల్గొన్నారు. రూ.1,200 కోట్లతో అమలు చేయనున్న గాంధీ ఆశ్రమ్ మెమోరియల్ మాస్టర్‌ప్లాన్‌ను ప్రారంభించారు. ఆధునీకరించిన కోచ్రాబ్ ఆశ్రమాన్ని ప్రారంభించారు. మహాత్మాగాంధీ ఆరంభించిన సబర్మతి ఆశ్రమం కేవలం మన దేశానికే కాదు, మొత్తం మానవాళికే వారసత్వ సంపద అని తెల్చిచెప్పారు.


విన్యాసాలను తిలకిస్తున్న ప్రధాని మోదీ


పోఖ్రాన్‌లో అబ్బురపర్చిన 'భారత్ శక్తి'

భారతదేశ ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవానికి పోఖ్రాన్ ఒక ఘనమైన సాక్షి అని ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యానించారు. రాజస్తాన్ రాష్ట్రం పోఖ్రాన్‌లోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో మంగళవారం భారత త్రివిధ దళాలు 'భారత్ శక్తి' పేరిట సైనిక విన్యాసాలు నిర్వహించారు. దాదాపు 50 నిమిషాల పాటు జరిగిన ఈ విన్యాసాలను మోదీ ప్రత్యక్షంగా తిలకించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాలు, రక్షణ పరికరాల విన్యాసాలు చూపరులను అబ్బురపర్చాయి. తేజస్, ఏఎల్ఎస్ ఎంకే–4 యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు అర్జున్, కె–9 వజ్ర, ధనుష్ వంటివి ఆకట్టుకున్నాయి. పినాకా ఉపగ్రహ వ్యవస్థతోపాటు డ్రోన్ల విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఆకాశంలో మన యుద్ధ విమానాల గర్జనలు, నేలపై మన జవాన్ల సాహసాలు నవ భారత్(న్యూ ఇండియా)కు ఆహ్వానం పలుకుతున్నామని మోదీ పేర్కొన్నారు.

సీఏఏపై ముస్లింలకు ఆందోళన అక్కర్లేదు

కేంద్ర హోం శాఖ భరోసా

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టంపై భారత ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర హోంశాఖ సూచించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చట్టం వల్ల వారి పౌరసత్వంపై ఎలాంటి ప్రభావం ఉండబోదని భరోసా ఇచ్చింది. దేశంలోని హిందువులతో సమానంగా హక్కులు అనుభవించవచ్చని పేర్కొంది. సీఏఏ వల్ల ముస్లింలపై ఎలాంటి వివక్ష ఉండదని, వారి హక్కులకు భంగం కలగదని తేల్చిచెప్పింది. పౌరసత్వం నిరూపించుకోవడానికి ధ్రువ పత్రాలు సమర్పించాలంటూ ఏ ఒక్క భారతీయ పౌరుడినీ అడిగే అవకాశమే లేదని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. దేశంలోని 18 కోట్ల మంది ముస్లింలు నిశ్చింతగా ఉండొచ్చని సూచించింది. ఎవరూ దేశం విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని వివరించింది. కొన్ని ముస్లిం దేశాల్లో మైనార్టీలపై వేధింపుల కారణంగా ఇస్లాం మతానికి చెడ్డపేరు వస్తోందని పేర్కొంది.


ఖట్టర్

ఖట్టర్ రాజీనామా

హరియాణా కొత్త సీఎంగా సైనీ ప్రమాణం ● సీట్ల సర్దుబాటులో జేజేపీతో విభేదాలు


సైనీ

చండీగఢ్: హరియాణాలో రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి బీజేపీ సీనియర్ నేత మనోహర్‌లాల్ ఖట్టర్ రాజీనామా చేయడం మొదలు ఓబీసీ నేత నాయబ్ సైనీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం దాకా మంగళవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో దుష్యంత్ చౌతాలా సారథ్యంలోని జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)తో విభేదాలు ముదరడంతో ఖట్టర్ సీఎం పదవిని వదులుకోవాల్సి వచ్చిందని వార్తలొచ్చాయి. అయితే ఖట్టర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో బరిలో నిలిపేందుకే బీజేపీ ఆయనను సీఎం పీఠం నుంచి దింపేసిందని మరో వాదన వినిపించింది. హరియాణాలో లోక్‌సభ సీట్ల సర్దుబాటు విషయంలో జేజేపీతో బీజేపీకి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తెగదెంపులు చేసుకోవాల్సి వచ్చిందని సమాచారం. దీంతో చివరకు సీఎం ఖట్టర్, 13 మంది మంత్రులు రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు. రాజీనామాలను గవర్నర్ ఆమోదించారు. ఆ తర్వాత బీజేపీ ఎమ్మెల్యేలు హరియాణా నివాస్‌లో కలిసి 54 ఏళ్ల సైనీని తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలంటూ సైనీ గవర్నర్‌ను కలిసి కోరారు. ఇందుకు గవర్నర్ ఒప్పుకోవడంతో హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ మంత్రులుగా మరో ఐదుగురు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం చకచకా జరిగిపోయాయి. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఖట్టర్ హాజరయ్యారు.

జేజేపీతో పొసగని పొత్తు

సార్వత్రిక ఎన్నికల వేళ రాష్ట్రంలో బీజేపీ–జేజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయి. హరియాణాలోని మొత్తం 10 లోక్‌సభ స్థానాల్లోనూ పోటీచేస్తామని జేజేపీ పార్టీ పట్టుబట్టడంతో పార్టీతో పొత్తుకు బీజేపీ ఫుల్‌స్టాప్ పెట్టిందని తెలుస్తోంది. ఖట్టర్ రాజీనామా తర్వాత డెప్యూటీ సీఎం పదవి నుంచి జేజేపీ నేత దుష్యంత్ తప్పుకోవాల్సి వచ్చింది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 10 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఈసారీ గెలుపు ఖాయమని భావిస్తోంది. అందుకే గెలవబోయే స్థానంలో ఖట్టర్‌ను నిలపాలని బీజేపీ భావిస్తోంది. కులగణన డిమాండ్‌ను కాంగ్రెస్ తెరమీదకు తెచ్చిన నేపథ్యంలో జనాభాలో 30 శాతమున్న ఓబీసీ వర్గానికి చెందిన సైనీని సీఎంగా చేసింది. 2014లో తొలిసారి ఎంపీ అయిన ఖట్టర్‌ను సీఎంగా ఎంచుకున్నట్లే తొలిసారి ఎంపీ అయిన నాయబ్‌నూ సీఎంగా కమలదళం ఎన్నుకుంది. ప్రస్తుత హరియాణా శాసనసభ కాలపరిమితి అక్టోబర్‌తో ముగియనుంది. ఈలోపు ఓబీసీ నేతతో సీఎం పదవిని భర్తీచేసి ఓబీసీలను తమవైపు తిప్పుకోవాలని పార్టీ భావిస్తోంది.

బలపరీక్షకు అవకాశమివ్వండి

తమ ప్రభుత్వానికి 48 మంది ఎమ్మెల్యేల మద్దతుందని, బలనిరూపణకు బుధవారం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ నూతన సీఎం సైనా గవర్నర్‌కు లేఖ రాశారు. 90 మంది సభ్యులున్న అసెంబ్లీలో 41 మంది బీజేపీ సభ్యులున్నారు. తమకు ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు, ఒక హరియాణా లోఖిత్ పార్టీ ఎమ్మెల్యే మద్దతు ఉందని బీజేపీ చెబుతోంది. జేజేపీకి 10 మంది, కాంగ్రెస్‌కు 30 మంది, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు.

కూలిన తేజస్ యుద్ధ విమానం

జైసల్మేర్: భారత వైమానిక దళానికి చెందిన తేలికపాటి యుద్ధ విమానం(ఎల్‌సీఏ) తేజస్ మంగళవారం రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో కుప్పకూలింది. శిక్షణ సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. దేశీయంగా రూపుదిద్దుకున్న ఈ రకం విమానం ప్రమాదానికి గురి కావడం ఇదే మొదటిసారి. అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధార్ ఎడారిలోని పోఖ్రాన్‌లో ప్రధాని మోదీ, సైనిక ఉన్నతాధికారుల సమక్షంలో 'భారత్ శక్తి' పేరుతో జరుగుతున్న భారీ యుద్ధ విన్యాసాల్లో పాల్గొని వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. నంబర్–18 స్క్వాడ్రన్‌కు చెందిన ఈ సింగిల్ ఇంజిన్ ఎల్‌సీఏ 2001 నుంచి సేవలందిస్తోందని ఐఏఎఫ్ పేర్కొంది. విన్యాసాల్లో పాల్గొన్న ఈ రకం మూడు విమానాల్లో ఇదీ ఒకటని వివరించింది. ఘటనపై కోర్టు ఆఫ్ ఎంక్వయిరీకి ఆదేశించినట్లు ఐఏఎఫ్ వెల్లడించింది. ఇలా ఉండగా, జైసల్మేర్‌లోని కల్లా, జవాహర్ నివాస ప్రాంతంలోని ఓ హాస్టల్ భవనంపై తేజస్ విమానం కుప్పకూలిందని అదనపు ఎస్పీ మహేందర్ సింగ్ చెప్పారు. ఆ సమయంలో భవనంతోపాటు చుట్టుపక్కల కూడా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. విమానం నేలను తాకిన వెంటనే పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయన్నారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారని చెప్పారు. విమానం కూలడానికి కొద్ది క్షణాల ముందు అందులో ఉన్న ఏకైక పైలట్ బయటపడ్డాడన్నారు. 40 వరకు తేలికపాటి యుద్ధ విమానాలు భారత వైమానిక దళంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఎట్టకేలకు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు

ఎన్నికల సంఘానికి సమర్పించిన ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) మంగళవారం సాయంత్రం ఎన్నికల సంఘానికి సమర్పించింది. ఈ బాండ్ల వివరాలను మంగళవారం సాయంత్రానికల్లా ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం ఎస్‌బీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రకారం.. ఎస్‌బీఐ ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎన్నికల సంఘం ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకల్లా తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

రూ.480 కోట్ల డ్రగ్స్‌తో పాక్ బోట్ పట్టివేత

అహ్మదాబాద్: భారత తీర రక్షక దళం(ఐసీజీ) సారథ్యంలో అరేబియా సముద్రంలో జరిగిన ఆపరేషన్‌లో రూ.480 కోట్ల విలువైన డ్రగ్స్‌తో కూడిన పాకిస్తాన్ బోటు పట్టుబడింది. ఐసీజీ ఆధ్వర్యంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ), గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) సోమవారం అర్ధరాత్రి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఆరుగురు పాకిస్తానీయులు కూడా పట్టుబడినట్లు రక్షణ శాఖ మంగళవారం తెలిపింది. విశ్వసనీయ నిఘా సమాచారం మేరకు..ఈ నెల 11న పోరుబందర్‌కు 350 కిలోమీటర్ల దూరంలోని సముద్రజలాల్లో ఐసీజీ నౌకలను మోహరించింది. డోర్నియర్ విమానంతో గస్తీ చేపట్టింది. అర్ధరాత్రి సమయంలో చీకటి మాటున ఓ బోటు అనుమానాస్పద కదలికలను పసిగట్టి, సిబ్బందిని అప్రమత్తం చేసింది. తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆ బోటును వెంటాడి దిగ్బంధించింది. తనిఖీలు జరపగా అందులో సుమారు రూ.480 కోట్ల విలువైన 60 ప్యాకెట్లతో ఉన్న 80 కిలోల నిషేధిత డ్రగ్స్ ఉన్నట్లు తేలింది. బోటులోని ఆరుగురిని అదుపులోకి తీసుకుని, డ్రగ్స్ సహా పోరుబందర్ తీరానికి తరలించినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఇది గత మూడేళ్లలో ఐసీజీ, గుజరాత్ ఏటీఎస్, ఎన్‌సీబీలతో కలిసి చేపట్టిన పదో ఆపరేషన్ అని, మొత్తం రూ.3,135 కోట్ల విలువైన 517 కిలోల డ్రగ్స్‌ను పట్టుకుందని తెలిపింది. అరేబియా సముద్రంలో నెల రోజుల వ్యవధిలో విజయవంతంగా నిర్వహించిన రెండో ఆపరేషన్ అని రక్షణ శాఖ వివరించింది. ఫిబ్రవరి 26న పోరుబందర్ సమీపంలో ఓ బోటులో తరలిస్తున్న చరస్ తదితర 3,300 కిలోల డ్రగ్స్‌ను పట్టుకుని, ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది.

హైతీ ప్రధాని రాజీనామా

పోర్టు ఆవ్ ప్రిన్స్: కరేబియన్ దేశం హైతీ ప్రధానమంత్రి ఆరియల్ హెన్రీ ఎట్టకేలకు పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. రాజధానిలోని 80శాతం పైగా సాయుధ ముఠాల చేతుల్లోకి వెళ్లిపోవడం, పలు ప్రభుత్వ కార్యాలయాలను ముఠాలు ఆక్రమించడం, అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగడంతో హెన్రీ ఈ మేరకు నిర్ణయించినట్లుగా భావిస్తున్నారు. హెన్రీ ప్రస్తుతం పొరుగుదేశం పోర్టోరికోలో ఉన్నారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం పోర్టు ఆవ్ ప్రిన్స్‌లోని విమానాశ్రయంలో ల్యాండయ్యేందుకు సాయుధ ముఠాలు అంగీకరించకపోవడంతో దేశం వెలుపలే ఉండిపోయారు. 2021లో అప్పటి అధ్యక్షుడు జొవెనెల్‌ను సాయుధులు ఇంట్లో ఉండగా చంపారు. అప్పటి నుంచి హెన్రీ ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రిషి సునాక్‌కు ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూకే ప్రధానమంత్రి రిషి సునాక్‌తో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) త్వరగా అమల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో పురోగతిని ఇరువురు నేతలు స్వాగతించారు. భారత్–యూకే మధ్య వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. రిషి సునాక్‌తో ఫలవంతమైన సంభాషణ జరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఒక్కటైన గ్యాంగ్‌స్టర్, రివాల్వర్ రాణి


'రివాల్వర్ రాణి', 'మేడమ్ మింజ్'గా పేరొందిన 39 ఏళ్ల అనురాధాను 2020 సంవత్సరం నుంచి 40 ఏళ్ల సందీప్ ప్రేమిస్తున్నాడు.

న్యూఢిల్లీ: సమాజంలో ప్రముఖ వ్యక్తుల పెళ్లిళ్లు జరిగినపుడు భారీ బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రత కనిపించడం సహజం. కానీ కరడుగట్టిన నేరగాడి పెళ్లి తంతును పోలీసులే దగ్గరుండి జరిపించిన ఘటనకు దేశ రాజధాని వేదికైంది. పెరోల్‌పై తిహార్ జైలు నుంచి బయటికొచ్చిన గ్యాంగ్‌స్టర్ సందీప్ అలియాస్ కాలా జఠేడీ వివాహ వేడుక విశేషమిది. వివరాల్లోకి వెళ్తే సందీప్ డజనుకుపైగా హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసుల్లో నిందితుడు. గ్యాంగ్‌స్టర్ అయిన సందీప్ నాలుగేళ్లుగా లేడీ డాన్‌గా పేరుబడ్డ అనురాధాతో ప్రేమాయణం నడుపుతున్నాడు. మరో గ్యాంగ్‌స్టర్ ఆనంద్‌పాల్‌సింగ్ ముఠా సభ్యురాలైన అనురాధాపై మనీ లాండరింగ్, బెదిరింపు వసూళ్ల వంటి అరడజనుదాకా కేసులు ఉన్నాయి. బెయిల్ మీద ఇప్పటికే అనురాధా విడుదల కాగా సందీప్‌కు కేవలం ఆరు గంటల పెరోల్ లభించింది. ఈ సమయంలోనే పెళ్లాడాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఢిల్లీ ద్వారకా సెక్టార్–3లోని సంతోష్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌ను బుక్‌చేశారు. సందీప్ న్యాయవాది రూ.51,000కు ఈ ఫంక్షన్‌ను బుక్‌చేశారు. సందీప్, అనురాధాలు వేర్వేరు నేరముఠాలకు చెందిన వ్యక్తులు కావడంతో పెళ్లివేడుకలో గ్యాంగ్ వార్ జరిగే ఆస్కారముందని పోలీసులు భావించారు.

నాలుగు అంచెల రక్షణ

ఢిల్లీ, హరియాణా పోలీసులు ఫంక్షన్ హాల్‌ను శత్రుదుర్భేద్యంగా మార్చేశారు. ప్రవేశద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లు, కీలక ప్రాంతాల్లో సీసీకెమెరాలు అమర్చారు. డ్రోన్‌లను రంగంలోకి దింపారు. ఫంక్షన్ హాల్ పరిసరాల్లో 250కిపైగా పోలీసులు మొహరించారు. పెళ్లిరోజు రానే వచ్చింది. హరియాణాలోని సోనీపట్ నుంచి బ్లాక్ ఎస్‌యూవీ వాహనంలో వధువు అనురాధా, పోలీసు బందోబస్తు నడుమ వరుడు సందీప్ పెళ్లిమండపానికి చేరుకున్న విధానం అచ్చం ఓటీటీ థ్రిల్లర్‌ను తలపించింది. కవరేజీ కోసం చేరుకున్న మీడియా ప్రతినిధులు, రక్షణగా చుట్టుముట్టిన పోలీసులు, వధూవరుల తరఫున హాజరైన కొందరు నేరగాళ్ల సమక్షంలో మంగళవారం వివాహం ఆడంబరంగా జరిగింది. వివాహం తర్వాత సందీప్‌ను పోలీసులు మళ్లీ తిహార్ చెరసాలకు తీసుకెళ్లారు. పెళ్లి వేడుకలో నాలుగు అంచెల భద్రతా వలయాన్ని పోలీసులు సృష్టించారు. బంధువులు వస్తే వెంట గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి. వారి పేర్లు పోలీసుల వద్ద ఉన్న జాబితాతో సరిపోలాలి. ఆ తర్వాత వేడుకలో పాల్గొననిస్తారు. సెల్‌ఫోన్లను మండపంలోకి పోలీసులు అనుమతించలేదు. స్పెషల్ సెల్, క్రైమ్ బ్రాంచ్, హరియాణా క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఢిల్లీ స్పెషల్ వెపన్స్ టెక్నిక్స్ విభాగాల పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. 'రివాల్వర్ రాణి', 'మేడమ్ మింజ్'గా పేరొందిన 39 ఏళ్ల అనురాధాను 2020 సంవత్సరం నుంచి 40 ఏళ్ల సందీప్ ప్రేమిస్తున్నాడు. జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు ఇతను సన్నిహితుడు. అతడి తలపై రూ.7 లక్షల రివార్డ్ ఉంది. 2021లో పోలీసులు అతడిని అరెస్ట్‌చేశారు. గతంలో కస్టడీ నుంచి ఒకసారి సందీప్ తప్పించుకున్నాడు. అది పునరావృతం కాకూడదనే పెరోల్‌పై బయట ఉన్నంతసేపు సందీప్‌పై పోలీసులు ఓ కన్నేసి ఉంచారు. గ్యాంగ్ వార్‌ను ఎదుర్కొనేందుకు మండపంలో పోలీసులు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించారు. కేసుల బాధ నుంచి విముక్తి పొందాక సాధారణ జీవితం గడపాలని ఇద్దరం భావిస్తున్నట్లు అనురాధా చెప్పారు.

200 రోజుల తర్వాత..

ఫ్లోరిడా: దాదాపు ఆరు నెలలపాటు అంతరిక్షంలో గడిపిన నలుగురు వ్యోమగాములు సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు. ఈబృందం గత ఏడాది ఆగస్ట్ 26న కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ ఎక్స్ అంతరిక్ష నౌక డ్రాగన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేరుకుంది. అక్కడ ఐఎస్ఎస్‌లో ఉంటూ 200 రోజుల్లో భూమిని వీరు 3,184 సార్లు చుట్టి వచ్చారు.

పాస్ చేయండి లేదంటే పెళ్లి చేస్తారు

● జవాబుపత్రంలో పదో తరగతి విద్యార్థిని వేడుకోలు ● బిహార్‌లో ఘటన

పట్నా: ఎలాగోలా పాస్ చేయండని, లేదంటే నాకు మా నాన్న పెళ్లి చేసేస్తాడని పదో తరగతి విద్యార్థిని ఒకరు జవాబుపత్రంలో వేడుకున్న ఘటన ఒకటి బిహార్‌లో జరిగింది. సంబంధిత టెన్త్ క్లాస్ ఆన్సర్ షీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. గత నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన పదో తరగతి పరీక్షల జవాబుపత్రాలను తాజాగా ఉపాధ్యాయులు దిద్దుతుండగా ఈ విన్నపం విషయం బయటపడింది. కొందరు కవిత్వాలు, మరికొందరు ఉద్వేగంతో కూడిన వాక్యాలు, ప్రార్థనలు రాశారు. అయితే ఆరాహ్ మోడల్ స్కూల్‌కు చెందిన ఒకమ్మాయి మాత్రం తన ఇంట్లో చదువుకునే అమ్మాయిల దుస్థితిని విన్నవించుకుంది. 'మా నాన్న ఒక పేద రైతు. చదువులకయ్యే ఖర్చులను భరించలేని కుటుంబం మాది. అందుకే మేం చదువుకోవడం మా వాళ్లకు ఇష్టంలేదు. మంచి మార్కులు సాధించలేకపోతే చదువు కొనసాగించలేము. వెంటనే పెళ్లి చేసేస్తారు. పెళ్లి చేసుకోవడం మాకు అస్సలు ఇష్టంలేదు. మమ్మల్ని కాపాడండి. నిరుపేదరాలిగా వేడుకుంటున్నా. నన్ను పాస్ చేయండి' అని అమ్మాయి రాసింది.

ఎన్నార్సీని తెచ్చేందుకే ఈ చట్టం

కేంద్రం కుట్రపన్నుతోందన్న మమతా బెనర్జీ

బరాసత్: లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం(సీఏఏ)–2019ను అమల్లోకి తేవడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. సీఏఏలోని నిబంధనలను అస్పష్టం, రాజ్యాంగ విరుద్ధం, వివక్షాపూరితమని ఆమె అభివర్ణించారు. మంగళవారం ఉత్తర 24 పరగణాల జిల్లా హబ్రాలో జరిగిన కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. జాతీయ పౌర రిజిస్టర్(ఎన్నార్సీ)ని అమలు చేసే ఎత్తుగడల్లో భాగంగానే మోదీ ప్రభుత్వం సీఏఏను ముందుగా తీసుకొచ్చిందని ఆరోపించారు. 2014కు ముందు దేశంలోకి వచ్చిన వారికి పౌరసత్వం కల్పిస్తే, 2015 ఆ తర్వాత వచ్చిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో బీజేపీ తప్పుడు హామీలిస్తోందన్నారు. అటువంటి పార్టీకి అధికారం అప్పగించరాదన్నారు. బెంగాల్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నార్సీని అమలు కానీయబోనని స్పష్టం చేశారు. క్రైస్తవ, ముస్లిం తదితరుల హక్కుల లాగేసుకోవాలనే కుట్రతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.

మేం అమలు చేయం: స్టాలిన్

చెన్నై: పౌరసత్వ సవరణ చట్టాన్ని తమిళనాడులో అమలు చేయబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. ప్రజల మధ్య విభజనలను తీసుకువచ్చే ఈ చట్టంతో ఎలాంటి ఉపయోగం లేదని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హడావుడిగా ఈ చట్టాన్ని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. ఈ చట్టంలోని నిబంధనలను రాజ్యాంగం మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని స్టాలిన్ అన్నారు.

సీఏఏ దరఖాస్తుల కోసం కొత్త పోర్టల్

న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ)చట్టం, 2019 కింద భారత పౌరసత్వం పొందాలని భావించే పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ కాందిశీకుల కోసం భారత సర్కార్ ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను మంగళవారం ప్రారంభించింది. అర్హులైన శరణార్థులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర హోం శాఖ తెలిపింది. సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ సంబంధిత నిబంధనలను నోటిఫై చేసిన మరుసటి రోజే ఇలా శరణార్థులకు సాయపడేలా indiancitizenshiponline.nic.in పేరిట నూతన పోర్టల్‌ను మోదీ సర్కార్ తీసుకు రావడం విశేషం. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31వ తేదీలోపు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌ల నుంచి భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థులు భారత పౌరసత్వం పొందేందుకు అర్హులు. ఈ దేశాల నుంచి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 2014లోపే భారత్‌కు వచ్చినట్లు నిర్ధారించే ఆధారాలను దరఖాస్తుదారులు ప్రభుత్వానికి చూపాల్సి ఉంటుంది.

అమలు నిలిపివేయండి: సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలును నిలిపివేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2019 నాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తయ్యి తీర్పు వచ్చేదాకా ఈ చట్టాన్ని అమలును నిలిపివేయాలని కోరుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్) మంగళవారం ఈ వ్యాజ్యం దాఖలు చేసింది. సీఏఏ అమలుపై స్టే విధించాలని విజ్ఞప్తి చేస్తూ అలాగే డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఛింద్వారా నుంచి నకుల్‌నాథ్

కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమరంలో నిలిచే పార్టీ అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం విడుదలచేసింది. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్‌ను ఆ రాష్ట్రంలోని ఛింద్వారా స్థానం నుంచే మళ్లీ బరిలో నిలపనుంది. మొత్తం 43 మంది పేర్లతో రెండో జాబితాను పార్టీ విడుదలచేసింది. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ కుమారుడు వైభవ్ ఈసారి జాలోర్ ఎంపీ స్థానం నుంచి పోటీచేస్తారు. లోక్‌సభలో ఉపనేత గౌరవ్ గొగోయ్ ఈసారి అస్సాంలోని జోర్హాట్ నుంచి, ప్రద్యుత్ బోర్దోలోయ్ నగావ్ నుంచి ఎన్నికల్లో నిలబడనున్నారు. రెండ్రోజుల క్రితమే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రాహుల్ కస్వాన్‌ను రాజస్థాన్‌లోని అదే చురు స్థానం నుంచి కాంగ్రెస్ పోటీకి దింపుతోంది. మాజీ డీజీపీ హరీశ్ చంద్రమీనాను రాజస్థాన్‌లోని టోంక్–సవాయ్ నుంచి పోటీచేస్తారు. మంగళవారం విడుదలైన జాబితాలో 76.7 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులే ఉన్నారు. 43 మంది ఉన్న జాబితాలో నలుగురు మహిళలు ఉన్నారు.

భారత ప్రాదేశిక జలాల సమీపానికి చైనా పరిశోధక నౌక

విశాఖ సిటీ: చైనాకు చెందిన ఓ పరిశోధన నౌక భారత ప్రాదేశిక జలాల సమీపంలోకి రావడం కలకలం రేపింది. చైనాకు చెందిన జియాన్ యాంగ్ హోంగ్ 01 నౌక ఏపీలోని విశాఖ తీరానికి 480 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో లంగరు వేసింది. కొంత కాలంగా హిందూ మహా సముద్రం, బంగాళాఖాతంలో చైనా నౌకల రాకపోకలు పెరిగాయి. చైనా పరిశోధక నౌకల పేరిట భారత్‌పై నిఘా పెడుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా అగ్ని–5 క్షిపణి ప్రయోగం చేపట్టే సమయంలోనే చైనా నౌక భారత తీరానికి చేరువలోకి రావడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరిస్తోంది. ఈ నౌక మలక్కా జలసంధి దాటి దిశ మార్చుకుని బంగాళాఖాతంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. సముద్ర గర్భంలో 10 వేల అడుగుల లోతులోనూ పరిశోధించ గల అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు ఈ నౌకలో ఉన్నట్టు భారత నేవీ అనుమానిస్తోంది. భారత్ కు చెందిన మూడు అణు బాలిస్టిక్ మిస్సైల్ సహిత జలాంతర్గాములు, పలు కీలక ఆయుధ వ్యవస్థలకు స్థావరంగా ఉన్న విశాఖ నౌకాస్థావరం సమీపానికి చైనా నౌక రావడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది.

బీజేపీలో ఏఐఎస్ఎంకే విలీనం

చెన్నై: లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ తమిళ నటుడు ఆర్.శరత్ కుమార్(69) తన అఖిల ఇండియా సమత్తువ మక్కల్ కట్చి(ఏఐఎస్ఎంకే)పార్టీని బీజేపీలో కలిపేశారు. మంగళవారం జరిగిన ఏఐఎస్ఎంకే కార్యవర్గం సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై సమక్షంలో ఆయన విలీనం నిర్ణయాన్ని ప్రకటించారు. ఏఐఎస్ఎంకే సభ్యులను అన్నామలై బీజేపీ కుటుంబంలోకి ఆహ్వానించారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా శరత్ కుమార్ పిలుపునిచ్చారు.

జేకేఎన్ఎఫ్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: కశ్మీర్‌కు చెందిన వేర్పాటువాద రాజకీయ వేదిక హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన జమ్మూకశ్మీర్ నేషనల్ ఫ్రంట్ (జేకేఎన్ఎఫ్)పై ప్రభుత్వం మంగళవారం అయిదేళ్ల నిషేధం విధించింది. నయీమ్ అహ్మద్ ఖాన్ సారథ్యంలోని జేకేఎన్ఎఫ్ దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం కలిగించడంతోపాటు ప్రజల మధ్య విద్వేష బీజాలు నాటుతున్నందున కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నివారణ)చట్టం కింద ఈ మేరకు చర్య తీసుకున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. ఉగ్ర నిధుల కేసులో 2017లో ఎన్ఐఏ అదుపులోకి తీసుకున్న వేర్పాటు నేతల్లో నయీమ్ అహ్మద్ ఖాన్ ఒకడు. ఇతడు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.

పాక్‌లో భవనం కుప్పకూలి..9 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో భవనం కుప్పకూలిన ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముల్తాన్ నగరంలోని హరాంగేట్ ప్రాంతంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి, ఆ తీవ్రతకు మూడంతస్తుల భవనం శిథిలాల దిబ్బగా మారిపోయింది. ఆ సమయంలో భవనంలో ఉన్న మొత్తం 11 మందిలో 9 మంది శిథిలాల కింద చిక్కుకుని చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా, వీరిలో అయిదుగురు టీనేజర్లని అధికారులు తెలిపారు.

ఉద్యోగుల ఆటల పోటీలు



మైసూరు: ఉద్యోగులు ప్రతిభను చూపేందుకు ఆటల పోటీలు మంచి సందర్భమని, క్రీడా స్ఫూర్తి అనేది అందరికీ ముఖ్యమని కలెక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని చాముండి విహార క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా స్థాయి ఉద్యోగుల క్రీడలను ప్రారంభించారు. ఉద్యోగ విధుల్లో ఒత్తిడిలో ఉంటారని, ఇలాంటి క్రీడల వల్ల వారి ఒత్తిడి తగ్గిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జట్ల మధ్య ఆటల పోటీలు సాగాయి.

న్యూస్‌రీల్

కిలేడీ దొంగల అరెస్టు

- ఇళ్లలో పనివారుగా చేరి చోరీలు



నిందితులు మంజుల, మహదేవమ్మ



నగలు, సొత్తు

బనశంకరి: ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ మునికృష్ణప్ప ఇంట్లో నర్సింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ నగలు దోచుకెళ్లిన ఇద్దరు మహిళలను మంగళవారం జేపీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. కొప్పళకు చెందిన మంజుళ ఉజరత్, కనకపుర మహిళ మహదేవమ్మలను అరెస్ట్‌చేసి వీరి వద్ద నుంచి రూ.28 లక్షల విలువచేసే 414 గ్రాములు బంగారు నగలు, 104 గ్రాముల వెండి సొత్తు, 4 విదేశీ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మునికృష్ణప్ప ఇంట్లో 31 గ్రాముల బంగారు ఆభరణాలు, 4 వాచ్‌లను ఎత్తుకెళ్లారు. జేపీ.నగర పోలీసులు దర్యాప్తు చేపట్టి ఖతర్నాక్ మహిళలను అరెస్టు చేశారు. ఇళ్లలో పని మనుషులుగా, రోగులకు సహాయకులుగా చేరి బంగారు నగలను తస్కరించేవారు. పలు ఇళ్లల్లో ఇదే రీతిలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు సాధకులు కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గౌరిబిదనూరు: మహిళలు తమపై దాడులు జరిగినప్పుడు భయపడకుండా సమర్థంగా ఎదుర్కొనాలని రూట్స్ ఫర్ ఫ్రీడం సంస్థ సంచాలకులు కల్యాణకుమార్ తెలిపారు. మంగళవారం అంబేడ్కర్ భవనంలో మహిళా దినాచరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని మన పురాణాలు చెబుతున్నాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు సాధకులుగా గుర్తించబడాలి అన్నారు. తాలూకా మహిళా సంచాలకురాలు కవిత ప్రసంగిస్తూ బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఆన్‌లైన్లో రూ.6 లక్షలకు పైగా మోసం

దొడ్డబళ్లాపురం: ఆన్‌లైన్ వంచకుల చేతిలో యువకుడు రూ.6.62 లక్షలను పోగొట్టుకున్న సంఘటన మాగడి తాలూకా హుల్లేనహల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. బర్కతుల్లాఖాన్ అనే యువకుని మొబైల్‌కు ఇంట్లో ఉంటూనే వేల రూపాయలు సంపాదించవచ్చని మేసేజ్ వచ్చింది. నమ్మిన యువకుడు లింక్ ద్వారా టెలిగ్రాం గ్రూప్‌లో చేరాడు. ప్రముఖ హోటళ్లకు గూగుల్‌లో 5 స్టార్ రేటింగ్ ఇస్తే డబ్బులు వేస్తామని నమ్మించారు. ఆ ప్రకారం మొదట కొన్ని టాస్కులు ఇచ్చి అతని ఖాతాలోకి కొంత డబ్బు పంపడంతో నిజమేనని నమ్మాడు. ఇక తమ వద్ద పెట్టుబడి పెడితే అచిరకాలంలోనే దండిగా లాభాలు వస్తాయని అతన్ని ఒత్తిడి చేశారు. సరేనని బాధితుడు పలు దఫాలుగా రూ.6.62 లక్షలను సమర్పించుకున్నాడు. ఆ తరువాత అవతలి వైపు నుండి ఎటువంటి స్పందన లేదు. దీంతో మోసపోయానని తెలుసుకున్న యువకుడు రామనగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారులో రియల్టర్ హత్య

- యలహంక పరిధిలో ఘటన





కారును పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) క్రిష్ణయాదవ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రియల్ ఎస్టేట్ వ్యాపారిని దుండగులు కారులో హత్య చేసిన సంఘటన బెంగళూరులో బాగలూరు క్రాస్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. యలహంకలోని మారుతి నగరలో నివసిస్తున్న క్రిష్ణ యాదవ్ సోమవారం సాయంత్రం స్విఫ్ట్ కారులో బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం బాగలూరు క్రాస్ వద్ద ఫుట్‌పాత్ పక్కన నిలిచి ఉన్న కారులో స్థానికులు తొంగి చూడగా లోపల మృతదేహం కనిపించింది. యలహంక పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. రియల్టర్ క్రిష్ణ యాదవ్‌గా గుర్తించారు. దుండగులు కారులోనే కత్తితో పొడిచి చంపారు. హతుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఆర్థిక వ్యవహారాలే హత్యకు కారణమై ఉంటాయని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

బ్యాడిగిలో తగ్గని ఉద్రిక్తత ఘాటు

- ఏపీఎంసీ మార్కెట్ మూసివేత
- ఆవరణలోనే మిర్చి రైతులు
- మోసకారి దళారులపై చర్యలు తీసుకోవాలని పట్టు
- భారీగా పోలీసుల మోహరింపు



కారును ధ్వంసం చేస్తున్న దృశ్యం



ఎన్నికల ముందు మిర్చి గొడవ

సాక్షి, బళ్లారి: హావేరి జిల్లా బ్యాడిగి ఏపీఎంసీ మార్కెట్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. హఠాత్తుగా మిర్చి ధరలను తగ్గించడంతో సోమవారం మధ్యాహ్నం రైతులు అగ్రహోదగ్రులై విధ్వంసానికి పాల్పడడం తెలిసిందే. ఫైరింజన్, కార్లు, మార్కెట్‌లో ఆఫీసులకు నిప్పంటించి దాడులకు దిగారు. పోలీసులు, దళారులను తరిమికొట్టడం తదితర సంఘటనలు జరిగాయి. దీంతో అక్కడ యుద్ధ వాతావరణం అలముకొంది. ఈ సంఘటన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో మంగళవారం బ్యాడిగి ఏపీఎంసీ మూతపడింది. వందలాది రైతులు ఏపీఎంసీ లోపల ఉంటూ నిరసన తెలిపారు. రైతులందరూ ఒక్కతాటిపై నిలబడి దమ్ముంటే ఎవరైనా తమ కేసులు పెట్టాలని సవాల్ చేయడం గమనార్హం.

ధర కాదు.. దగా చేస్తున్నారు

ఆరుగాలం కష్టపడి పనిచేసి, లక్షలాది రూపాయలు అప్పులు చేసి మిర్చి పంట పండించి ఎంతో దూరం నుంచి లారీలు బాడుగలు తీసుకుని వచ్చి ఇక్కడికి వస్తే అందరూ కుమ్మక్కై తమను మోసం చేస్తున్నారని కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులు ధ్వజమెత్తారు. బళ్లారి, రాయచూరు, హావేరి తదితర జిల్లాలతో పాటు పొరుగున ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన రైతులు పెద్దఎత్తున ప్రతి రోజు మిర్చి బస్తాలను తీసుకొచ్చామని తెలిపారు. ఒక క్వింటాలుకు దాదాపు రూ.5 వేలు మోసం చేస్తూ ధరలు తగ్గించేస్తున్నారని, తమ గ్రామాల్లోనే క్వింటాలు మిర్చి రూ.15 నుంచి రూ.20 వేలు దాకా వ్యాపారులు అడుగుతున్నారని పలువురు రైతులు చెప్పారు. బ్యాడిగిలో ఎక్కువ రేటు వస్తుందని ఎంతో ఆశతో వస్తే దళారులు, అధికారులు కలిసి మోసం చేస్తూ క్వింటాలు మిర్చి రూ.8 వేల లోపు అడుగుతున్నారని ఆరోపించారు.

దళారులను అరికట్టాలి

బ్యాడిగిలో దళారులదే రాజ్యం అని మండిపడ్డారు. రైతులను మోసం చేస్తున్న దళారులు, అధికారులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దళారులు, అధికారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తారు. క్వింటాలుపై రూ.5వేలు అమాంతంగా తగ్గించి, ఆ డబ్బును పంచుకుంటారని ఆరోపించారు. ఈ విషయం తెలిసినా పాలకులు పట్టించుకోవడం లేదని, బ్యాడిగి ఏపీఎంసీ మోసాలకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎంసీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులందరూ తమ తమ మిర్చి సంచుల ముందే కూర్చొని నిరసన తెలిపారు. మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారం కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతన్నలు కోరారు. తమపై కేసులు పెట్టి వేధిస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

80 మంది రైతుల అరెస్టు

మంగళవారం సాయంత్రం వందలాది మంది పోలీసులు మార్కెట్‌లోకి వెళ్లారు. అడ్డుకున్న రైతులను పక్కకు తోసేశారు. గొడవల వీడియోలు, ఫోటోల్లో ఉన్నవారిని గుర్తించి 80 మంది వరకూ రైతులను అరెస్టు చేయడంతో కలకలం చెలరేగింది. వాహనాలలో వారిని తరలించారు. ఇందులో కన్నడ రైతులే కాకుండా అనంతపురం, కర్నూలు జిల్లావాసులూ ఉన్నట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో మరింత మందిని అరెస్టు చేసే అవకాశముంది. అల్లర్లు, అరెస్టుల భయంతో పెద్దసంఖ్యలో రైతులు తమ మిర్చి సంచులను వదిలేసి వెళ్లిపోయారు. అధికారులు బుధవారం నుంచి మార్కెట్‌ను తెరవాలని నిర్ణయించారు.



మార్కెట్‌లో గుమిగూడిన రైతులు

నీటి కొరతపై విపక్షం ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

యశవంతపుర: రాష్ట్రంలో ఏర్పడిన కరవు, నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు మంగళవారం బెంగళూరులో ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఫ్రీడంపార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీలు పీసీ మోహన్, తేజస్వీసూర్య, ఎమ్మెల్యేలు రవి సుబ్రమణ్య, రామమూర్తితో పాటు అనేక మంది బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఖాళీ బిందెలు పట్టుకుని మహిళ కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. గుర్రం, గాడిదలను కూడా తోలుకువచ్చారు. నీరు లేదు..నీరు లేదు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు అని నినాదాలు చేశారు. బెంగళూరు మహనగర పాలికె ముందు కూడా ధర్నా చేశారు. ప్రజల సమస్యలపై మంత్రులు స్పందించడం లేదని, కేడీపీ సమావేశాలను నిర్వహించటం లేదని దుయ్యబట్టారు.



సీఎం, డీసీఎం మాస్కులతో నిరసన

రెండు రోజుల్లో బీజేపీ జాబితా

యశవంతపుర: రెండు రోజుల్లో 28 మంది ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఎన్నికల సమితి సమావేశంలో పాల్గొని అనంతరం విజయేంద్ర విలేకర్లతో మాట్లాడారు. మొదటి విడత ఎంతమంది అభ్యర్థులను ప్రకటిస్తారని విలేకర్లు ప్రశ్నించగా 28 మంది అభ్యర్థుల విషయంపై చర్చ జరిగిందన్నారు. జేడీఎస్ పార్టీ ఎన్ని సీట్లు కేటాయించారని అడిగిన ప్రశ్నకు అధిష్టానం చూసుకుంటుందన్నారు. సిట్టింగ్ ఎంపీలకు ఎంతమందికి ఇస్తారో కూడా హైకమాండ్ నిర్ణయమన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- డీఏ 3.75 శాతం పెంపు

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల డీఏను 38.75 నుండి 42.50 శాతానికి పెంచుతూ ఉత్తర్వులిచ్చింది. తద్వారా 3.75 శాతం డీఏ పెరిగింది. గత జనవరి 1 నుండి పెంచిన డీఏ వర్తిస్తుంది. పార్లమెంటు ఎన్నికలకు ముందు తాయిలం ఇచ్చింది. డీఏ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.1,702 కోట్ల భారం పడనుంది.

మామిడి తోట ఆహుతి



మంటలకు దగ్ధమైన మామిడి చెట్లు

శ్రీనివాసపురం: పంట బాగుంది, త్వరలో మంచి ప్రతిఫలం వస్తుందనుకున్న రైతు ఆశలు బూడిదయ్యాయి. తాలూకాలోని మల్లెకుప్ప గ్రామంలో మధుబాబు అనే రైతుకు చెందిన మూడు ఎకరాల మామిడి తోటలో మంటలు చెలరేగి 120 మామిడి చెట్లు కాలిపోయాయి. మంగళవారం మంటలు చెలరేగగానే కొందరూ చూసి ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది చేరుకునే సరికి 120 చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. బాగా పూత పూసి మంచి దిగుబడి వస్తుందనే నిరీక్షణలో ఉన్న మధుబాబు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ సీజన్‌లో తోట కోసం దాదాపు 4 లక్షల వరకు ఖర్చు చేశానని చెప్పాడు. పంట చేతికి అంది ఉంటే రూ. 9, 10 లక్షల వరకు లాభం వచ్చి ఉండేదని తెలిపాడు. అనుకోకుండా జరిగిందా, లేక ఎవరైనా కావాలనే నిప్పంటించారా అనేది తేలాల్సి ఉంది.

బంగారప్ప ఇంటి కొడుకుని కాను : శివు

దొడ్డబళ్లాపురం: మాజీ సీఎం బంగారప్ప కుటుంబాన్ని కలపడానికి నేనెవర్ని, నేను కేవలం ఆ ఇంటి అల్లుడిని మాత్రమే, ఇంటి కొడుకుని కాదంటూ హీరో శివరాజ్ కుమార్ అన్నారు. బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆయన పై విధంగా స్పందించారు. శివరాజ్‌కుమార్ భార్య గీతకు ఈసారి శివమొగ్గ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. పదేళ్ల తరువాత మళ్లీ ఆమె ఎన్నికల బరిలో దిగనున్నారు. ఈ నేపథ్యంలో బెళగావిలో మీడియాతో మాట్లాడిన శివరాజ్‌కుమార్ భార్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. అయితే స్టార్ క్యాంపెయినర్లుగా ఎవరినీ పిలిచి ఇబ్బంది పెట్టే ఆలోచన తనకు లేదన్నారు.

బెంగళూరులో కాంగ్రెస్ ఆందోళన

యశవంతపుర: రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బెంగళూరులో కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్ మాట్లాడుతూ... మొదటి నుంచి బీజేపీ రాజ్యాంగంపై అనేక వ్యాఖ్యలు చేస్తోందని మండిపడ్డారు.

ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలన అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. మోదీ సర్వాధికారంతోనే ఎంపీలు ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. హెగ్డే దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధానిలో గట్టి భద్రత: సీపీ

బనశంకరి: సీఏఏ చట్టాన్ని అమలు చేస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నగరంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీఏఏను కొన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నందున నగరవ్యాప్తంగా పటిష్ట భద్రతను కల్పించామన్నారు. ఇప్పటివరకు ధర్నాలు చేస్తామని ఎవరూ అనుమతి కోరలేదన్నారు. డీసీపీలు వారి పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సీఐఎస్ఎఫ్ బలగాలు నగరానికి వచ్చాయన్నారు. సమస్యాత్మక ప్రాంతాలైన డీజే.హళ్లి, కేజీ.హళ్లి, శివాజీనగర, జేజే.నగర, చామరాజపేటే, సుద్దగుంటె పాళ్య, ఆర్‌టీ నగరతో పాటు అనేక ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు.

యదువీర్‌కు టికెట్ ఇచ్చినా ఓకే: సింహా

మైసూరు: మైసూరు రాజవంశీకుడు యదువీర్ ఒడెయార్‌కు స్థానిక ఎంపీ టికెట్ ఇస్తే తప్పకుండా స్వాగతిస్తానని బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ యదువీర్‌ను పోటీ చేయిస్తే ఆయన విజయానికి శ్రమిస్తానని తెలిపారు. అయితే టికెట్ తనకే లభిస్తుందనే ఆశ ఉందని, గత పదేళ్లలో ప్రజలు, కార్యకర్తలతో కలసి మంచి పనులు చేశానని అన్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకున్నా పార్టీ కోసం పాటుపడతానన్నారు.

హుక్కా నిషేధంపై హైకోర్టులో వాదనలు

బనశంకరి: రాష్ట్రంలో అన్ని రకాల హుక్కా ఉత్పత్తుల విక్రయాలు, వినియోగం, సేకరణను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల ఆదేశాలిచ్చింది. దీనిని ప్రశ్నిస్తూ కొందరు హైకోర్టులో వేసిన పిటిషన్ ను మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం విచారించి, తీర్పును రిజర్వులో ఉంచింది. హుక్కా వినియోగాన్ని ప్రభుత్వం ముందుగా పూర్తిగా అరికట్టి ఉండాల్సింది. కొన్ని పాశ్చాత్య దేశాల్లో దీనిపై నిషేధం ఉంది అని పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన జడ్జి తీర్పును రిజర్వులో ఉంచారు.

గురు రాఘవా శరణు

- మంత్రాలయ క్షేత్రంలో పాదుకా పట్టాభిషేకాలు



రథోత్సవంలో సుబుదేంద్ర తీర్థ

రాయచూరు రూరల్: భక్తులకు కామధేనువుగా కోరిన కోర్కెలు తీర్చే మంత్రాలయంలో గురు రాఘవేంద్రుల దేవస్థానం ఉత్సవ శోభతో విలసిల్లుతోంది. పాదుకా పట్టాభిషేక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాఘవేంద్రుల మఠంలో మూల విరాట్‌కు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. గురుసార్వభౌముల 403వ పట్టాభిషేక ఉత్సవాలు, స్వామివారి 429వ వర్ధంతి స్మరణోత్సవాలకు నాంది పలికారు. వందలాది మంది భక్తుల సమక్షంలో వెండి తేరు నిర్వహించారు.

రాష్ట్రానికి 2 వందేభారత్ రైళ్లు

- బెంగళూరు- కలబురగి, చెన్నై మధ్య సర్వీసులు



దొడ్డబళ్లాపురం: రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారంనాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ రైళ్లను ప్రారంభించారు. బెంగళూరు – కలబురిగి మధ్య ఒక రైలు, బెంగళూరు – చెన్నై మధ్య మరో కొత్త రైలు పరుగులు తీస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 5 వందే భారత్ రైళ్లు తిరుగుతున్నాయి. అవి ఇప్పుడు 7కి పెరిగాయి. హుబ్లీ రైల్వేస్టేషన్‌లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ ప్రగతిలో రైళ్లది ముఖ్య పాత్ర అన్నారు. దేశంలో రైల్వే ప్రధాన రవాణాగా ఉందన్నారు. విధానపరిషత్ స్పీకర్ బసవరాజు హొరట్టి, ఎమ్మెల్యే మహేశ్ తెంగినకాయి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బుద్ధిగా ఉండమంటే అంతుచూశాడు

- పాగల్ ప్రేమికుని దురాగతం



నిందితుడు ప్రవీణ్, హత్యకు గురైన సంగనగౌడ (ఫైల్)

యశవంతపుర: బుద్ధిగా నడుచుకోవాలని చెప్పిన ఓ వ్యక్తిని కొడవలితో దారుణంగా హత్య చేసిన ఘటన బాగలకోట తాలూకా భగవతి గ్రామంలో జరిగింది. హతుడు సంగనగౌడ (52), నిందితుడు ప్రవీణ్. వివరాలు... భగవతి గ్రామానికి చెందిన సంగనగౌడ కుమార్తెను ప్రవీణ్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో యువతి తన తండ్రికి విషయం చెప్పడంతో సంగనగౌడ, ప్రవీణ్‌ను పిలిచి బుద్ధిగా నడుచుకోవాలని హెచ్చరికలు చేశాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. దీంతో మరోసారి సంగనగౌడ హెచ్చరించాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రవీణ్ కొడవలితో సంగనగౌడను దారుణంగా నరికి పారిపోయాడు. బాగలకోట గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకోని నిందితుడిని అరెస్ట్ చేశారు.

దొరకని న్యాయం, పోయిన ప్రాణం

- అత్యాచార బాధితురాలి ఆత్మహత్య



యువతి, ఆమె పెళ్లిపత్రిక

మైసూరు: ప్రేమికుల దినోత్సవం రోజునే అత్యాచారానికి గురైన ఒక యువతి తనకు న్యాయం జరగలేదని బాధతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా శ్యానబోగనహళ్లి గ్రామంలో జరిగింది. రంజిత (19) మృతురాలు. వివరాలు.. ఫిబ్రవరి 14న రంజితను అదే గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లల తండ్రి వేణుగోపాల్ (35) తన బొలెరో వాహనంలో కేరళకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ప్రేమ, పెళ్లి అని మాయమాటలు చెప్పి ముఖం చాటేశాడు. యువతి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో యువతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఎస్పీ సూచనల మేరకు బిళికెరె పోలీసులు ఫిబ్రవరి 21న కేసు నమోదు చేశారు. ఇంతలో యువతికి ఫిబ్రవరి 18న వేరే యువకునితో వివాహం నిశ్చయమైంది. ఇక పోలీసులు నెల గడుస్తున్నా వేణుగోపాల్‌ను అరెస్టు చేయలేదు, తనకు న్యాయం జరగలేదని విరక్తి చెందిన యువతి మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ధర్నా చేశారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు..



కాలువలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టిన కారు



మృతదేహం

- యువకుడి మృతి

మండ్య: డ్రైవర్ అదుపుతప్పి కారు విశ్వేశ్వరయ్య కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువకుడు మరణించాడు. మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండ్య తాలూకా అవ్వేరహళ్లి వద్ద జరిగింది. పాండవపుర తాలూకా బ్యాడరహళ్లి గ్రామనికి చెందిన నందీశ్ (18) మృతుడు. యోగానందకు తీవ్రంగా గాయాలయ్యాయి. పాండవపుర నుంచి మండ్యకు వస్తున్న కారు అవ్వేరహళ్లి వద్ద విశ్వేశ్వరయ్య కాలువలోకి దూసుకెళ్లింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కాలువలోకి దిగి కారులో ఇరుక్కున వారిని బయటకు తీవారు. కారు నుజ్జునుజ్జయింది. నందీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాలువలో నీటి ప్రవాహం లేదు. గాయపడిన యోగానందను మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులు క్రితం ఒక కారు వీసీ కాలువలో ఇదేరీతిగా పడిపోయింది. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. పలుమార్లు ఇలాంటి ఘటనలు జరుగుతున్న కాలువకు అడ్డుగోడ కట్టించాలని ఎమ్మెల్యే పుట్టరాజు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కొన్ని చోట్ల గోడ నిర్మించారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు.

18న శివమొగ్గకు ప్రధాని రాక

శివమొగ్గ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శివమొగ్గ పర్యటనకు రానున్నారు. భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. మార్చి 17న జరగాల్సిన పర్యటన 18వ తేదీకి వాయిదా పడింది. శివమొగ్గలో ఎంపీ బీవై రాఘవేంద్ర మాట్లాడుతూ శివమొగ్గ, చిక్కమగళూరు, చిత్రదుర్గ, దావణగెరె, ఉడుపి నియోజకవర్గాలకు సంబంధించి ప్రధాని పర్యటన ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్త హత్య

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ కార్యకర్త దారుణ హత్యకు గురైన సంఘటన గదగ్ జిల్లా ముండరగి తాలూకా డంబళ గ్రామం వద్ద చోటుచేసుకుంది. డోణి గ్రామానికి చెందిన శరణప్ప నందిగౌడ (35) మృతుడిగా గుర్తించారు. హతుడు కాంగ్రెస్ పార్టీకి చెందినవాడు. సోషల్ మీడియలో చురుగ్గా ఉండేవాడు. దుండగులు కళ్లల్లో కారం కొట్టి కత్తులతో పొడిచి హత్య చేసారు. అనంతరం మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసారు.

క్లుప్తంగా

వందే భారత్ రైలుకు స్వాగతం



స్వాగతం పలికిన ఎంపీ అమరేశ్వర నాయక్

రాయచూరు రూరల్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కలబుర్గి– బెంగళూరు మధ్య సంచరించే వందే భారత్ రైలు మంగళవారం కలబుర్గిలో ప్రారంభమైంది. కలబుర్గి లోక్‌సభ సభ్యుడు ఉమేష్ జాధవ్ రైలును ప్రారంభించగా, మధ్యాహ్నం 11.30 గంటలకు రైలు రాయచూరు రైల్వేస్టేషన్‌కు చేరింది. న్యూఢిల్లీ నుంచి వర్చువల్ వీడియో విధానంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రైల్వే శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ రైలుకు శ్రీకారం చుట్టారు. రాయచూరులో లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం సంచాలకురాలు స్మిత, స్వాతంత్ర్య సమర యోధుడు పంపణ్ణ, మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

కంప్లి: తమ గ్రామ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మౌలిక సదుపాయాలు, తగిన సమయంలో చికిత్స లభించడం లేదని ఎమ్మెల్యే డాక్టర్ ఎస్టీ శ్రీనివాస్‌తో ప్రజలు తమ గోడు వినిపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడి లోపదోషాలపై రోగులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూడ్లిగి తాలూకా ఆస్పత్రిలో సిబ్బందిని ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆస్పత్రిలోని రోగులను పలకరించి వారి బాగోగులు తెలుసుకొని ఆరోగ్య సిబ్బంది వారి పనితీరును పరిశీలించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని, త్వరలో ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా కన్నడ సంఘాల ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి శ్రీకారం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: నగరంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్‌ను 15 ఏళ్ల క్రితమే ప్రారంభించాల్సి ఉన్నా కారణాంతరాల వల్ల ఆలస్యం అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర మాట్లాడుతూ తాలూకాలో ప్రభుత్వ గ్యారెంటీ పథకాలను సక్రమంగా అమలు చేస్తున్నారని, పథకాలు అందని వారు తన దృష్టికి తేవాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసన్, ఈఓ శివకుమారి, పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ, జెడ్పీ మాజీ అధ్యక్షుడు తూపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ దుర్మరణం

మైసూరు: ఇంటి కనెక్షన్‌ను సరిచేస్తూ ఓ యువకుడు కరెంటు షాక్‌కు గురై మరణించాడు. శ్రీరంగ పట్టణ తాలూకా మహదేవపుర నివాసి ప్రదీప్ (28) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రాజీవ్ నగరలో వద్ద ఇంటి ముందు విద్యుత్ కనెక్షన్ చెడిపోయింది. ఆ ఇంటివారు ఫోన్ చేయడంతో ప్రదీప్ విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సెస్కాం ఉద్యోగి తాను చేయాల్సిన పనిని ప్రదీప్ చేత చేయించడంతో మరణించాడని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఉందని, ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి పరిహారం ఇచ్చేలా రాజీ ఒప్పందం జరిగినట్లు తెలిసింది.

నిధుల్లేవని ఎమ్మెల్యే ఆవేదన

తుమకూరు: మేమంతా పేపర్ల మీదనే ఎమ్మెల్యేలం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని తుమకూరు గ్రామీణ బీజేపీ ఎమ్మెల్యే సురేశ్ గౌడ వాపోయారు. బెళ్లావిలో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర రైతు మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ చూసినా తాగు నీరు, విద్యుత్ సమస్యలు తాండవం చేస్తున్నాయని, పంటలకు నీరు లేక రైతులు దిగులు పడుతున్నారని చెప్పారు. రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.

కనువిందుగా ఆనెగుంది ఉత్సవం



వివిధ వేషధారణల్లో వేదికపై కళాకారులు




వేదికపై సాముహిక బృంద నృత్యప్రదర్శన

- మిరుమిట్లు గొలిపిన విద్యుద్దీపాలంకరణలు
- ఉత్సవాలకు గతంలో కంటే పోటెత్తిన ప్రజలు



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తదితరులు



వేదికపై సాహసోపేత క్రీడ మల్లకంబ ప్రదర్శన

గంగావతి: తాలూకాలో వెలిసిన అంజనాద్రి బెట్ట అభివృద్ధి కోసం ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిర్ణయించారని కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి పేర్కొన్నారు. ఆయన సోమవారం రాత్రి ఆనెగుంది బైపాస్ రోడ్డులో ఆనెగుంది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రధాన శ్రీరంగదేవరాయల వేదికపై ఆనెగుంది ఉత్సవ కార్యక్రమాలను డోలు వాయించి ప్రారంభించి మాట్లాడారు. కొప్పళ జిల్లా చారిత్రక ప్రదేశాలకు నిలయం అన్నారు. తుంగభద్ర నది ఇక్కడ కొండల మధ్య ప్రవహిస్తూ పచ్చని పంట పొలాలకు నీరందిస్తోందన్నారు. రాయల కాలం నాటి కోట గోడలు, ఆంజనేయ స్వామి జన్మస్థలమైన ఆంజనాద్రి బెట్ట, పంపా సరోవరం, శ్రీదుర్గ, విజయలక్ష్మి దేవస్థానాలు కలిగి రాయల కాలంలో వజ్రవైఢూర్యాలను రాసులుగా పోసి అమ్మిన చరిత్ర కలిగి ప్రపంచ ప్రసిద్ధి గాంచిందన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గాలి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఐపీఎల్ క్రికెట్ ఆటగాడి లాంటివాడినని, తాను ఈ ప్రాంత అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఎంచుకొని పని చేస్తానన్నారు. ఈ ఏడాది 5000 మంది ఒకేసారి భోజనం చేయడానికి వీలుగా భోజనశాల, అంజనాద్రి కొండపై వృద్ధులు, దివ్యాంగులు వెళ్లేందుకు రోప్‌వే నిర్మాణంతో పాటు గంగావతి నుంచి హిట్నాల్ క్రాస్ వరకు ఫోర్‌వే రహదారి నిర్మాణాన్ని త్వరలో చేపడతామని ఆయన వివరించారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, రాజవంశస్తురాలు లలితారాణి శ్రీరంగదేవరాయలు, ఎమ్మెల్యే సతీమణి గాలి లక్ష్మీ అరుణ, కొప్పళ జిల్లాధికారి నళిన్ అతుల్, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాండే, జిల్లా ఎస్పీ యశోద, తహసీల్దార్ విశ్వనాథ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాధికార యంత్రాంగం తరఫున వేదికపై పాల్గొన్న ప్రజాప్రతినిధులను సన్మానించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు హంసలేఖ ఆధ్వర్యంలో వేదికపై మూడు గంటలకు పైగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. సాంస్కృతిక, వ్యక్తిగత నృత్య ప్రదర్శనలు, చిత్రగీతాలాపనలు ప్రేక్షకులను అలరించాయి. పలు రోమాంచకర కలిగించే గీతాలను పాడి ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టారు. అనంతరం సాహసోపేతమైన క్రీడలు, జానపద గీతాలతో రాత్రి నుంచి తెల్లవారే వరకు కొనసాగాయి. కళాకారులకు ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి బహుమతులను, ఇతర సహాయ సహకారాలను వేదికపై అందించారు. కాగా ఉత్సవాలకు మునుపెన్నడూ లేని రీతిలో ప్రజలు పోటెత్తడంతో జనోత్సవంగా ముగిసింది.

రాణాల్లో నీటి సంకటం

బనశంకరి: బెంగళూరు నగరంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. గుక్కెడు నీటికోసం హాహాకారాలు తలెత్తగా పోలీస్‌స్టేషన్లలో కూడా సంకటం నెలకొంది. మంగళవారం పోలీస్ వాహనంలో నీటి క్యాన్లను తరలిస్తున్న దృశ్యాలు కనబడ్డాయి. శివాజీనగర నియోజకవర్గంలోని సంపంగిరామనగర పోలీస్‌స్టేషన్‌లో నీటి కొరత రావడంతో పోలీసులు వాహనంలో క్యాన్లను నింపుకొని పోలీస్‌స్టేషన్ కు తరలించారు. విజయనగర హొసహళ్లిలో నీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వంట చేయడానికి కూడా నీరు లేక అనేక మంది హోటల్ నుంచి ఆహారాన్ని తెచ్చుకున్నారు.



- ఫౌంటెన్ దీనస్థితి

రాజధానిలో నీటి కొరతకు ఈ చిత్రం అద్దం పడుతోంది. చట్టసభ ఆవరణలోని ఫౌంటెన్ చుక్క నీరు లేకుండా ఎండిపోయిన చిత్రం

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చింతామణి: తాలూకాలోని భోడనమరి గ్రామంలో మంగళవారం సెవెన్ హిల్స్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్టు కార్యదర్శి శాంతలా నటరాజ్ మాట్లాడుతూ... వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో రజని భాస్కర్, సుదీక్షా, డాక్టర్ మేఘా, డాక్టర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై దాడి

- 250 సిలిండర్ల స్వాధీనం



సిలిండర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోలారు: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రంపై ఆదివారం రాత్రి దాడి జరిపిన వేమగల్ పోలీసులు రీఫిల్లింగ్ చేయడానికి అక్రమంగా నిల్వ చేసిన 250 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కురుగల్ గ్రామ సమీపంలోని ఓ ఖాళీ కోళ్ల ఫారంలో అక్రమంగా సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి జరిపారు. ఈ సందర్భంగా సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్ చేయడానికి ఉపయోగిస్తున్న తూకం యంత్రాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేఆర్ పురం శఫి, కురగల్ పాపణ్ణలపై కేసు నమోదు చేసిన వేమగల్ పోలీసులు వారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

ప్రభుత్వ పథకాలపై ఫొటో ప్రదర్శన

చిక్కబళ్లాపురం: నగరంలోని కేఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఐదు గ్యారెంటీ పథకాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రదర్శన ఈనెల 14 వరకు జరుగుతుందని, పథకాలు అందని వారు వివరాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, ఆర్టీసీ డీసీ హిమవర్ధన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనను వీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, కలెక్టర్ రవీంద్ర తదితరులు

మహిళల ఆశీస్సులతోనే కాంగ్రెస్‌కు అధికారం

మాలూరు: రాష్ట్రంలో మహిళల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్టీ తెచ్చిన 5 గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే అమలు చేశామని, వీటిని ఎట్టి పరిస్థితిలోను ఆపబోమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. తాలూకాలోని కేజీహళ్లిలో నిర్వహించిన ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ పేదల సంక్షేమం కోసం శ్రమిస్తోందన్నారు. పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ 5 గ్యారెంటీల అమలు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం కూడా గ్యారెంటీ పథకాలను కొనసాగిస్తామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటిన సమయంలో మహిళలకు ఇస్తున్న గృహలక్ష్మి, శక్తి పథకాలు ఎంతో ఊరటనిస్తున్నాయన్నారు. గృహలక్ష్మి నమోదు కౌంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే కేవై నంజేగౌడ, టీపీ ఈఓ వీణ, జెడ్పీ మాజీ అధ్యక్షురాలు రత్నమ్మ పాల్గొన్నారు.



గ్యారెంటీ లబ్ధిదారులకు సౌకర్యాలు అందిస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

జూనియర్ కాలేజీ ప్రారంభించాలని ధర్నా

కేజీఎఫ్: ప్రప్రథమ ముఖ్యమంత్రి కేసీ రెడ్డి స్వగ్రామం క్యాసంబళ్లిలో జూనియర్ కళాశాలను ప్రారంభించాలని కోరుతూ వివిధ సంఘాల కార్యకర్తలు మంగళవారం గ్రామం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సమాచార హక్కు, సామాజిక కార్యకర్తల వేదిక సభ్యుడు రమేష్ కుణిగల్ మాట్లాడుతూ క్యాసంబళ్లిలో ఇంతవరకు జూనియర్ కళాశాలను ప్రారంభించలేదన్నారు. ప్రజాప్రతినిధులు కూడా దీనిపై దృష్టి పెట్టలేదన్నారు. గ్రామంలో కళాశాల కోసం 12 ఎకరాల స్థలాన్ని కేటాయించి యేళ్లు గడుస్తున్నా ఇక్కడ కళాశాల ప్రారంభించకపోవడంతో ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా వెంటనే ఇక్కడ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



ధర్నాలో పాల్గొన్న వివిధ సంఘాల కార్యకర్తలు

కోలారు వార్తలు...

డీఎఫ్ఓపై చర్యల కోసం ధర్నా

కోలారు: అటవీ భూముల ఆక్రమణల పేరుతో రైతుల వేలాది ఎకరాల విస్తీర్ణంలోని మామిడి తోటలను జేసీబీలతో నాశనం చేసిన కోలారు డీఎఫ్ఓ ఏడుకొండలుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త పోరాట సమితి రైతులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది శివప్రకాష్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వమే చట్ట ప్రకారం హక్కు పత్రాలను అందించినా వారి భూములను దౌర్జన్యంగా అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన మామిడి చెట్లను జేసీబీలతో తొలగించి రైతులకు తీరని నష్టం కల్గించారని ఆరోపించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు జిల్లా రైతుల సమస్యలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. రైతులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. చివరికి హైకోర్టు కలుగజేసుకోవాల్సి వచ్చిందన్నారు. కేపీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ అటవీ అధికారి ఏడుకొండలు, పోలీస్ అధికారులు రైతుల 1300 ఎకరాల్లోని 80 వేలకు పైగా మామిడి చెట్లను నాశనం చేయడంతో కోట్లలో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. అనంతరం జిల్లాధికారికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సాహితీవేత్త హరిహర ప్రియ, రైతు నాయకుడు అబ్బణి శివప్ప, టీఎం వెంకటేష్, గణేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

లింగ సమానత మహిళా దినోత్సవ లక్ష్యం

కేజీఎఫ్: సమాజంలో లింగ సమానత, మహిళల సాధనల గుర్తింపు, మహిళలు సమాజానికి అందించిన సేవల స్మరణ కోసం యేటా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆచరిస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర విజ్ఞాన పరిషత్ కార్యదర్శి మంజుల భీమరావ్ తెలిపారు. మంగళవారం నగరంలోని సంభ్రమ్ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక, క్రీడా, రాజకీయ తదితర అన్ని రంగాల్లోను మహిళల సాధన గుర్తింపునకు, సమానత హక్కుల ప్రతిపాదనకు మహిళా దినోత్సవం ఆచరిస్తున్నామన్నారు. మహిళల్లో పొదుపు, ప్రగతి వేగవంతం ప్రస్తుత సంవత్సర మహిళా దినోత్సవ ప్రత్యేకత అన్నారు. 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి గణపతి గురుసిద్ద బాదామి మాట్లాడుతూ ప్రపంచంలో అనేక మంది మహిళలు నిరంతరంగా వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి తమదైన సాధన చేస్తున్నారన్నారు. కఠోరశ్రమ ద్వారా మహిళలు అందరి ప్రశంసలకు పాత్రులు అవుతున్నారన్నారు. నేడు మహిళలు ఆర్థిక సబలీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలను తెచ్చాయన్నారు. వీటితో మహిళలు రక్షణ పొంది సమాజంలో సమానత సాధించాలన్నారు. సీనియర్ న్యాయమూర్తి ముజఫర్ ఎ.మాంజరి, ప్రిన్సిపాల్ ఇందిరా జోసెఫ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

వీఎస్కేయూ వీసీకి సన్మానం

బళ్లారిఅర్బన్: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్కేయూ) కొత్త వీసీగా పదవీ బాధ్యతలను చేపట్టిన ప్రొఫెసర్ కేఎం మైత్రిని రాష్ట్ర అలెమారి, అరె అలెమారి వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలపై అధ్యయనానికి వర్సిటీలో ప్రత్యేక పీఠం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు కేఈబీ బసవరెడ్డి, ప్రముఖులు వెంకటేష్ యాదవ్, రాఘవేంద్ర, హనుమంత సండూరు, చిదానంద పాల్గొన్నారు.



వీసీని సన్మానిస్తున్న అలెమారి సంఘం ప్రముఖులు

కుమార్తెకు బాల్య వివాహం

- నిరాకరించిన భార్యపై భర్త దాడి

దొడ్డబళ్లాపురం: కుమార్తెకు బాల్య వివాహం చేయవద్దన్న భార్యపై భర్త దాడి చేసిన సంఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా హారుగొప్ప గ్రామం లో చోటుచేసుకుంది. భీరప్ప తన భార్య మాయవ్వపై దాడి చేశాడు. ఈ దంపతులకు 13 ఏళ్ల కుమార్తె ఉంది. ఆమెకు వివాహం చేసేందుకు భీరప్ప ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే చిన్న వయసులో కుమార్తెకు వివాహం వద్దని మాయవ్వ ప్రాథేయపడగా భీరప్ప ఆమెపై దాడి చేసాడు. మురగోడ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువతి మృతదేహం లభ్యం

బనశంకరి: ఆనేకల్ తాలూకా చందాపుర హెడ్‌మాస్టర్స్ లేఔట్‌లో కుళ్లిన స్థితిలో యువతి మృతదేహం లభ్యమైంది. ఐదారు రోజుల క్రితం ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. హెడ్ మాస్టర్స్ లేఔట్‌లోని నాలుగో అంతస్తులో ఈ ఘటన వెలుగుచూసింది. హత్యకు గురైన యువతి ఒడిశాకు చెందిన నపస్‌కుమార్‌తో ఉండగా ప్రస్తుతం అతని మొబైల్ స్విచ్ఛాఫ్ ఉంది. యువతిని హత్య చేసి అదృశ్యమైనట్లు అనుమానం వ్యక్తమవుతోంది. శవం పక్కనే మద్యం బాటిల్ లభ్యమైంది. సూర్యనగర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పరీక్షలు వాయిదా

బనశంకరి: 5, 8, 9 తరగతుల పరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఈ తరగతుల పరీక్షలు నిర్వహించడానికి స్టే ఇచ్చిన నేపథ్యంలో ఇప్పటికే నిర్వహిస్తున్న పరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది.

మెట్రో స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి

- అరగంట పాటు రాకపోకలు నిలిపివేత

బనశంకరి: బెంగళూరు నగరంలోని జ్ఞానభారతినమ్మ మెట్రో స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి సంచరించిన నేపథ్యంలో కొద్దిసేపు మెట్రోరైలును నిలిపివేశారు. మంగళవారం జ్ఞానభారతి, పట్టణగెరె మధ్య నడిచే మెట్రోస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి సంచరించడం మెట్రో భద్రతా సిబ్బంది గుర్తించి తక్షణం సీనియర్ అధికారులకు సమాచారం అందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి అధికారులు వెంటనే మెట్రోరైలు పట్టాలపై హైవోల్ట్ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.27 వరకు గ్రీన్ మార్గంలో మెట్రో సంచారం నిలిపివేసిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం నమ్మమెట్రో సంచారం యథా ప్రకారం కొనసాగించామని బీఎంఆర్‌సీఎల్ తెలిపింది.

రూ.3.32 లక్షల వంచన

హుబ్లీ: డబ్బులు పెట్టుబడి పెట్టి స్టాక్ కొనుగోలు చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి నుంచి రూ.3.32 లక్షలను బదలాయించి వంచించిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. భవాని నగర నివాసి విపుల్ సింగ్రే బాధితుడు. టెలిగ్రామ్ యాప్‌లో ట్రేడింగ్ బిజినెస్‌కు సంబంధించి ఓ సందేశం వచ్చింది. ఓ వ్యక్తి గ్లోబ్లా ఇన్వెస్టర్ స్టాక్ ట్రేడర్స్ కంపెనీకి చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఆ మేరకు ప్రారంభంలో లాభాలు ఇచ్చారు. అనంతరం వివిధ లింక్‌లు పంపించి వాటిని డౌన్‌లోడ్ చేసుకోమని దశల వారీగా రూ.3.32 లక్షలను బదలాయించుకొని వంచించినట్లు బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం



లబ్ధిదారులకు యంత్రోపకరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి

కోలారు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం బంగారుపేట తాలూకా హుత్తూరు గ్రామంలో గ్యారెంటీ లబ్ధిదారుల తాలూకా స్థాయి సమావేశంలో లబ్ధిదారులకు పరికరాలు అందించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల అవధిలో చేసింది శూన్యం అన్నారు. ప్రజల కిచ్చిన ఒక్క హామీని కూడా నిలుపుకోలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఇచ్చిన 5 గ్యారెంటీ హామీలను నెరవేర్చామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో సక్రమంగా అందిస్తోందన్నారు. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వస్తువులపైన పన్నులు అధికం చేశారన్నారు. అన్ని వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. కేంద్రం వల్ల పేద ప్రజలు ఎన్నటికీ అభివృద్ధిలోకి రారని అన్నారు. కులాలు, మతాల మధ్య ద్వేషం రగిల్చే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు. ఇదే సమయంలో గ్యారెంటీ పథకాల లబ్ధిదారులకు హక్కు పత్రాలను, వివిధ శాఖల ద్వారా ఎంపికైన వారికి యంత్రోపకరణాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హర్షవర్ధన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ, హుత్తూరు జీపీ అధ్యక్షురాలు వరలక్ష్మి చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దొడ్డ అభివృద్ధికి శాయశక్తులా కృషి


నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటున్న చుంచేగౌడ

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం అభివృద్ధికి తన శాయశక్తులా శ్రమిస్తానని, బీడీఏ మాదిరిగా తాలూకాను అభివృద్ధి పరుస్తానని దొడ్డబళ్లాపురం ప్లానింగ్ అథారిటీ నూతన అధ్యక్షుడు చుంచేగౌడ అన్నారు. నూతనంగా డీపీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన చుంచేగౌడ డీక్రాస్ సమీపంలోని డీపీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీడీఏ మాదిరిగా దొడ్డబళ్లాపురాన్ని డెవలప్ చేస్తామన్నారు. ఇదే సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

75 ఏళ్ల వయసులో కాంస్య పతకం

తుమకూరు: దక్షిణ భారత మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 75 ఏళ్ల వయో పరిమితి విభాగంలో తుమకూరు సీనియర్ క్రీడాకారుడు కాంస్య పతకం పొందారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మగాంధీ క్రీడా మైదానంలో మార్చి 9, 10 తేదీల్లో జరిగిన రెండో దక్షిణ భారత మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆయన ఈ ఘనత సాధించారు. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో విజేతగా నిలిచి జిల్లాకు, రాష్ట్రానికి కీర్తి తెచ్చిపెట్టారు.

నెట్‌బాల్ పోటీలు షురూ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: శ్రీ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ (సాహే)లో తొలిసారి అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలు సిద్ధార్థ వైద్య కళాశాల మైదానంలో జరిగాయి. వర్సిటీ చాన్స్‌లర్, హోం మంత్రి పరమేశ్వర ధ్వజారోహణ చేసి ఈ పోటీలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 53 బృందాలు వచ్చాయి.

మామను చితకబాదిన కోడలు


యశవంతపుర: మామను కోడలు చితకబాదిన ఘటన మంగళూరులో జరిగింది. ఉమాశంకరి అనే మహిళ విద్యుత్‌శాఖ ఉద్యోగిని. భర్త విదేశాలలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 9న మామ పద్మనాభ (87) సోఫాపై అంగీ విప్పి పెట్టాడని ఉమాశంకరి ఆక్రోశంతో మామను ఇష్టం వచ్చినట్లు వాకింగ్ స్టిక్‌తో కొట్టి, తలను మంచానికి వేసి బాదింది. బలమైన గాయాలు కావటంతో ఆస్పత్రిలో పొందుతున్నారు. ఇంటిలో అమర్చిన సీసీ కెమెరాలో ఘటన రికార్డ్ కావటంతో మంగళూరు నగర పోలీసులు పుటేజీలో స్వాధీనం చేసుకుని ఉమాశంకరిని అరెస్ట్ చేశారు.

వినికిడి లోపం పిల్లలకు ఉచిత వైద్యం


చిన్నారితో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మైసూరు: పిల్లల్లో వినికిడి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని వైద్యారోగ్య మంత్రి దినేశ్ గుండూరావు అన్నారు. మంగళవారం మైసూరు అఖిల భారత వాక్, శ్రవణ సంస్థలో ఏర్పాటు చేసిన శ్రవణ సంజీవని, కాక్లియర్ ఇంపాక్ట్ యోజన మరు నామకరణాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మాటలు వినిపించకపోవడం కొందరిలో పుట్టుకతోనే ఉంటుందని, అటువంటి వారికి వినికిడి పరికరాలు అమరిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. లక్షల వ్యయం అయ్యే చికిత్సలు ప్రభుత్వం ఉచితంగా చేస్తుందన్నారు. ఒక్క ఏడాదిలో 353 శస్త్రచికిత్సలు చేసి కర్ణాటక దేశంలోనే అగ్రస్థానంలో ఉందని చెప్పారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే జ్యోతిగణేశ్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్లు, దీంతో పాటు ఖోఖో కోర్టు, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మిటన్ కోర్టులు, క్రికెట్ ఆడేందుకు మైదానాన్ని అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే తరచూ క్రీడల్లో పాల్గొని వారికి తాగునీటి సమస్య ఎదురవుతోందని, దీంతో తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చారిత్రక నిలయం లక్ష్మేశ్వర పట్టణం


లక్ష్మేశ్వరలోని పురాతన సోమేశ్వర ఆలయం


బడేనానా దర్గా


జైన దేవాలయాల్లో ప్రముఖమైనది శంకబసది

- శివుడికి అంకితం చేయబడిన సోమేశ్వర ఆలయం
- ఇస్లామిక్ స్మారక చిహ్నాలు
- జైన మతానికి సుదీర్ఘ చరిత్ర
- గదగ్ జిల్లాలో సంస్కృతి, వారసత్వం కలిగిన ప్రాంతం

బనశంకరి: కర్ణాటకలోని గదగ్ జిల్లాలోని లక్ష్మేశ్వర చారిత్రక పట్టణం. ఇది ఈ ప్రాంతంలో ముఖ్యమైన పట్టణాల్లో ఒకటిగా ఉన్న ప్రారంభ మధ్యయుగ కాలం నాటిది. అనేక శతాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని పాలించిన రాజు లక్ష్మేశ్వర పేరుతో ఈ పట్టణానికి ఆ పేరు వచ్చిందని నమ్ముతారు. చారిత్రక రికార్డుల ప్రకారం ఇక్కడ అనేక దేవాలయాలు ఇతర మతపరమైన ప్రదేశాలను నిర్మించిన అనేక ఇతర రాజవంశాలు దీనిని పాలించాయి. ఇది గతంలో ప్రముఖ జైన కేంద్రంగా కూడా ఉండేది. అందువల్ల ఇది నేడు అనేక జైనబసదీలకు నిలయం. గొప్ప సంస్కృతి, వారసత్వం కలిగిన ప్రదేశం.

సోమేశ్వర దేవస్థానం

లక్ష్మేశ్వరలోని అత్యంత ప్రసిద్ధప్రదేశం సోమేశ్వర ఆలయం శివుడికి అంకితం చేయబడిన పురాతన ఆలయం. ఈ ఆలయం 11వ శతాబ్దంలో నిర్మించబడింది. చుట్టూ ఎత్తైన గోడలతో అనేక ఇతర హిందూ దేవాలయాలు కూడా ఉన్నాయి. ఇది చాళుక్యుల నిర్మాణశైలిలో నిర్మించారు. నంది, శివుడు, పార్వతిదేవి విగ్రహాలకు ప్రసిద్ధి చెందింది. రికార్డుల ప్రకారం ఈ విగ్రహాలను ఒక శివభక్తుడు ఆలయానికి తీసుకువచ్చారు. 8వ శతాబ్దానికి చెందిన అనేక పురాతన శాసనాలను కూడా గుర్తించవచ్చు.

శంక బసది

లక్ష్మేశ్వర ఒకప్పుడు ముఖ్యమైన జైనకేంద్రంగా ఉండేది. ఇది నేడు అనేక జైన దేవాలయాలకు నిలయం. వాటన్నింటిలో శంకబసది చాలా ముఖ్యమైనది, ఈ ఆలయం జైనమతంలో 22వ తీర్థంకరుడైన లార్డ్ నేమినాథ్‌కు అంకితం చేయబడింది. ఈ ఆలయం చాలా కాలంగా అనేక పునర్నిర్మాణాలు జరిగినప్పటికీ పురాతన అందం ఇంకా చెక్కు చెదరలేదు. దేవాలయంలోని అందమైన శిల్పాలు అద్భుతమైన వాస్తుశిల్పం ఇప్పటికీ పర్యాటకులకు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఆలయం చాళుక్యుల శిల్పకళను సూచించింది.

జుమ్మామసీదు

లక్ష్మేశ్వర ముస్లిం మతపరమైన ప్రదేశాలకు నిలయం. అందమైన జుమ్మా మసీదు ఉనికిని రుజువు చేస్తుంది. ఈ మసీదును 17వ శతాబ్దం ప్రారంభంలో అదిల్‌షాహి రాజవంశం కాలంలో నిర్మించబడిందని చెబుతారు. భారీ తలుపులు, అందమైన గోపురాలు, ఎత్తైన మినార్లతో రాష్ట్రంలోని ఇండో-పార్సి వాస్తుశిల్పం యొక్క సుందరమైన ఉదాహరణలతో ఇది ఒకటి. నేడు ఈ మసీదు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉంది. ప్రతి ఏడాది వేలాదిమంది పర్యాటకులు సందర్శిస్తారు.

బడే నానా దర్గా

లక్ష్మేశ్వర, బడే నానా దర్గాలో నిర్మించిన మరో ముస్లిం వాస్తుశిల్పం జుమ్మా మసీదు పరిసరాల్లో ఉన్న ఒక మసీదు ఇది అదిల్‌షాహి రాజవంశం కాలంలో నిర్మించబడిందని చెబుతారు. స్థానిక పురాణాల ప్రకారం జుమ్మా మసీదు బడే నానా దర్గా రెండింటి యొక్క స్మారక చిహ్నాలు ఒకే పాలకుడు అదే కాలంలో నిర్మించబడ్డాయి. ఇది ఇండో-పార్సి నిర్మాణశైలిలో ఉంది.

అనంతనాద బసది

వివిధ మతాలకు చెందిన అనేక పవిత్ర స్థలాలను కనుగొనే లౌకిక పట్టణంగా ప్రసిద్ధిచెందింది. ఒక వైపు హిందూవులు, జైనులు దేవాలయాలను సందర్శించవచ్చు. మరో వైపు మసీదుల అందాలను చూడవచ్చు. అనంతనాథ బసది జైనమతంలోని 14వ తీర్థంకరునికి అంకితం చేయబడిన మరొక జైన దేవాలయం 13వ శతాబ్దం మధ్యలో నిర్మించబడింది. ఈ ఆలయం చాళుక్యుల నిర్మాణశైలిలో నిర్మించగా పట్టణంలో అత్యధికంగా సందర్శించే స్మారక కట్టడాలలో ఒకటి. ఆర్కిటెక్చర్ ఔత్సాహికులు నుంచి చారిత్రక ప్రేమికులు ఫొటోగ్రాఫర్లు వరకు జైన అనుచరులు వరకు ఇది ప్రతి నెలా వేలాది మంది సందర్శకులను ఆకట్టుకుంటోంది.


సోమేశ్వర ఆలయంలో అద్భుతమైన రాతి స్తంభాలు


ఆలయంలో మెట్లబావి


చాళుక్యులు నిర్మించిన సోమేశ్వర ఆలయం

విజృంభిస్తున్న కోతి జ్వరం

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లాలో కోతి జ్వరం విజృంభిస్తోంది. ఇప్పటి వరకు ఈ వ్యాధితో ఐదుగురు మృతి చెందారు. జిల్లా వ్యాప్తంగా 47 మందికి కోతిజ్వరం సోకింది. నెల రోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. సిద్దాపుర తాలూకాకే పరిమితమైన కోతిజ్వరం తాజాగా అంకోలా తాలూకాకు వ్యాపించింది.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

మైసూరు: నగర పాలికె మాజీ సభ్యుడు అయాజ్ సోదరుడు మహ్మద్ అక్మల్ హత్య కేసులో ఉదయగిరి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసును సీసీబీకి బదిలీ చేశారు. షరీఫ్ ఉర్ రెహమాన్, ఇమ్రాన్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. ఈనెల 8న రాత్రి 8.30 గంటలకు రాజీవ్ నగర నిమ్మా మసీదు వద్ద అక్మల్‌ను దుండగులు అడ్డుకుని మారణాయుధాలతో హతమార్చారు. అక్మల్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పురాతన రథానికి నిప్పు..


కాలిపోయిన రథాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

తుమకూరు: గుబ్బి తాలూకా నిట్టూరు హోబళి పుర గ్రామంలో సుమారు 800 ఏళ్ల ప్రాచీన చోళుల కాలం నాటి శ్రీ కల్లేశ్వర స్వామి ఆలయ రథానికి ఓ దుండగుడు నిప్పంటించాడు. ఈ ఆలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉంది. ఆలయం వార్షిక జాతర ఈనెల 20 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. గ్రామ ప్రజలు జాతరకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. అంతలోనే ఈ దుర్ఘటన జరిగింది. నిందితుడిని ఉత్తర భారతానికి చెందిన ఉదారి బిన్ రాధేశామ్‌గా గుర్తించారు. రథం పూర్తిగా కాలిపోయింది. గుబ్బి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ల్యాప్‌టాప్ చోరీలు, ఐదుగురు అరెస్ట్

బనశంకరి: విధులు నిర్వహిస్తున్న కంపెనీల్లో ల్యాప్‌టాప్, క్రోమ్‌బాక్సుల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురిని మంగళవారం కుమారస్వామి లేఔట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.16 లక్షల విలువ చేసే 29 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద తెలిపారు. చోరీ సొత్తును పరిశీలించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దర్శన్, సుజయ్, కార్తీక్, శశికుమార్, నిలేశ్ అనే ఐదుగురు ల్యాప్‌టాప్ చోరీకేసులో నిందితులు. లేఔట్‌లోని న్యూ జైసా టెక్నాలజీస్ కంపెనీలో గత కొద్దిరోజు నుంచి ల్యాప్‌టాప్, క్రోమ్‌బాక్సులు చోరీ అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న కుమారస్వామి లేఔట్ పోలీసులు కంపెనీ సిబ్బందితో సమాచారం సేకరించిన అనంతరం పక్కాసమాచారం ఆధారంగా ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఇద్దరు అదే కంపెనీలో ల్యాప్‌టాప్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండగా మిగిలిన ముగ్గురు అతడి అనుచరులని పోలీసులు దర్యాప్తులో వెలుగుచూసింది.


కుమారస్వామి లేఔట్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు

ఆరుగురు అరెస్ట్

బంగారు గొలుసులు చోరీకి పాల్పడుతున్న ముగ్గురు మహిళలతో పాటు ఆరుగురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 21న కుమారస్వామి లేఔట్‌లోని జ్యువెలరీ షాప్‌లో 10 గ్రాముల బంగారు మాటీలు చోరీ అయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం భరమసాగర ప్యారీ, జైదుంబి, జునేదాతో పాటు ముగ్గురు మహిళలు, చమన్‌సాబ్, సౌకత్, నానావలిలను అరెస్ట్ చేశారు. పట్టుబడినవారందరూ బంధువులే. కుమారస్వామి లేఔట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన 8 చోరీకేసుల్లో వీరంతా నిందితులు. వీరి నుంచి రూ.16 లక్షల విలువైన బంగారుచైన్లు, బంగారుమాంగల్యం చైన్లను స్వాధీనం చేసుకున్నట్లు నగర సీపీ దయానంద తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు పోలీస్ కమిషనర్ సతీశ్‌కుమార్, డీసీపీ శివప్రకాష్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీ– కంపెనీ బస్సు ఢీ



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

- లారీ డ్రైవర్ మృతి, 15 మంది సిబ్బందికి తీవ్ర గాయాలు

కెలమంగలం: రాయకోట సమీపంలో టిప్పర్ లారీ– ప్రైవేట్ కంపెనీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా 15 మందికి పైగా ఉద్యోగులు తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలు.. కెలమంగలం ప్రాంతం నుంచి రాయకోట వైపు కంకర తీసుకొని టిప్పర్ లారీ బయల్దేరింది. నాగమంగలం వద్ద నిర్వహిస్తున్న టాటా ఎలక్ట్రానిక్ పరిశ్రమలో విధులు పూర్తి చేసుకొని సోమవారం రాత్రి 10.30 గంటలకు బస్సులో ఉద్యోగులు ఇళ్లకు బయల్దేరారు. కూతనపల్లి వద్ద టిప్పర్ లారీ– బస్సు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బిహార్ రాష్ట్రానికి చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ లాలూప్రసాద్ (32) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, బస్సులోని 15 మందికి పైగా ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బస్సులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు అంబులెన్సుల్లో హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాయకోట, కెలమంగలం, ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ఈ ప్రమాదంతో కెలమంగలం– రాయకోట రోడ్డుపై సుమారు గంట పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

ఇంట్లో జింక కళేబరం


జింక కళేబరం

మైసూరు: సుమారు ఏడాదిన్నర వయసున్న మగ జింక కళేబరాన్ని ఒక ఇంట్లో గుర్తించారు. ఈ ఘటన హుణసూరు తాలూకా చిక్కహెజ్జూరు హాడి వద్ద జరిగింది. ఊరిబయట జింకను వీధి కుక్కలు వెంటాడి చంపినట్లు అనుమానిస్తున్నారు. దీంతో కొందరు జింక మాంసాన్ని తినేందుకు దాన్ని తీసుకొచ్చారు. అటవీ సిబ్బంది వచ్చి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మూడు ఆలయాల్లో హుండీల చోరీ

జిల్లాలోని సరగూరు తాలూకా హాదనూరు గ్రామంలో ఉండే మూడు దేవాలయాల్లో తలుపులు పగులగొట్టి కానుకలు, బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నారు. చిక్కదేవమ్మన దేవాలయంలో రూ. 30–40 వేలు, ఓంకార సిద్ధేశ్వర ఆలయంలో రూ. 40–50 వేలు, శనేశ్వర దేవస్థానంలో రూ. 15–20 వేల కానుకులను , అలాగే మూడు దేవాలయాల్లో బంగారు, వెండి ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. సరగూరు పోలీసు స్టేషన్‌లో ఆలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.

భర్త కొట్టాడని భార్య ఆత్మహత్య

క్రిష్ణగిరి: దంపతుల మధ్య ఏర్పడిన గొడవల్లో తీవ్ర ఆగ్రహానికి గురైన భర్త భార్యపై దాడి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని కీళ్‌పుదూర్ గ్రామానికి చెందిన శరవణన్ భార్య జయప్రియ (30). వీరికి గత 13 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. రెండు రోజుల క్రితం ఏర్పడిన గొడవల్లో భర్త భార్యపై చేయిచేసుకోవడంతో విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కావేరిపట్టణం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

కెలమంగలం: ద్విచక్ర వాహనంలో వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట జైనగర్‌కు చెందిన క్రిష్ణన్ (28) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం డెంకణీకోట–బాలతోటనపల్లి మార్గంలో వెళ్తుండగా హొసట్టి వద్ద అకస్మాత్తుగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సైకో, తల్లిదండ్రులపై కేసు

మైసూరు: ప్రేమ అంటూ యువతి వెంటపడుతూ వేధిస్తున్న ఒక యువకున్ని మైసూరు విజయనగర పోలీసులు కేసు నమోదు చేశారు. విజయనగర లేఔట్‌కు చెందిన నిఖిల్, అతని తండ్రి సుందర్, తల్లి సరోజ నిందితులు. నిఖిల్ గత మూడేళ్లుగా ఇంటి పక్కనే ఉన్న యువతి వెంట పడుతూ ప్రేమించాలని వేధిస్తున్నాడు. ప్రేమించకపోతే చంపేస్తా అని బెదిరిస్తున్నాడు. యువతికి తల్లిదండ్రులు పెళ్లి ఖాయం చేయగా, ఆ పెళ్లి రద్దు చేసుకోవాలని నిఖిల్ ఒత్తిడి పెంచాడు. యువతి ప్రైవేటు ఫోటోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించసాగాడు. దీంతో భయపడిన యువతి అతనికి రూ. 2 లక్షలను ఇచ్చుకుంది. ఆమె స్కూటర్‌ను కూడా నిఖిల్ తీసుకున్నాడు. తనతో మాట్లాడకపోతే ఇంటి ముందుకు వచ్చి గట్టిగా అరుస్తానని బెదిరించాడు. నిఖిల్ సైకో ప్రవర్తనకు అతని తండ్రి సుందర్, తల్లి సరోజ కూడా వంతపాడారు. దీంతో విసిగిపోయిన యువతి ముగ్గురిపై విజయనగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌కు నిద్ర లేకుండా చేస్తా

యశవంతపుర: నేను ఉన్నంతవరకు కాంగ్రెస్‌కు నిద్ర లేకుండా చేస్తానని ఎంపీ అనంత్ కుమార్ హెగ్డె కాంగ్రెస్‌పై ఎదురు దాడి చేశారు. మంగళవారం కారవార బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులను ఎవరిని అడిగిన నల్లపూసల యజమాని తాను కాదంటున్నారని మొట్టికాయ వేశారు. దేశాన్ని లూటీ చేసిన కాంగ్రెస్, మహిళా విరోధి అంటూ అనంతకుమార్ హెగ్డే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ వారికి నిద్ర లేకుండా చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులకు నీతి నిజాయితీ లేదని అన్నారు. ఇదే సమయంలో అదే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రూపాలి నాయక్ అనంతకుమార్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీగా ఉన్న అనంతకుమార్ ఒకసారి వచ్చి ప్రచారం చేసి ఉంటే తాను ఎన్నికల్లో విజయం సాధించి ఉంటానని రూపాలి ఆవేదన వ్యక్తం చేశారు.

హోసూరు వార్తలు..

సర్కారుకు వ్యతిరేకంగా ధర్నా

హోసూరు, కెలమంగలం: డీఎంకే పార్టీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో గుట్కా, మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా విపరీతంగా పెరిగిపోయిందని, దీని వల్ల పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు యువత దురలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకొంటున్నారని ఆరోపిస్తూ మంగళవారం అన్నాడీఎంకే పార్టీ మానవహారం చేపట్టింది. హోసూరు పట్టణంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయం నుంచి బాగలూరు రోడ్డులోని అన్నాడీఎంకే కార్యాలయం వరకు మానవహారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే పార్టీ తప్పుడు వాగ్దానాలతో అధికారం చేపట్టిందని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే పార్టీకి ప్రజలు గుణపాఠం నేర్పుతారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ శశి వెంకటస్వామి, ఉప చైర్మన్ కే.నారాయణస్వామి, జిల్లా కౌన్సిలర్ ఆర్.కే.రవికుమార్, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. కెలమంగలం, క్రిష్ణగిరి తదితర ప్రాంతాల్లో కూడా నిరసనలు నిర్వహించారు.


అన్నా డీఎంకే ఆందోళన దృశ్యం

రెండు కార్లు, గుట్కా సీజ్

హోసూరు: బెంగళూరు నుంచి తమిళనాడుకు అక్రమంగా గుట్కాను తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని కగ్గనూరు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఓ కారు వేగంగా వెళ్లిపోగా పోలీసులు కారును వెంబడించి పట్టుకొన్నారు. అదే సమయంలో వెళుతున్న మరో కారును కూడా పట్టుకొని పరిశీలించగా భారీ ఎత్తున గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది. రెండు కార్లతో పాటు రూ. 6.6 లక్షల విలువ చేసే 537 కేజీల గుట్కాను స్వాధీనపరుచుకొని నిందితులు రాజస్థాన్‌కు చెందిన రమేష్ (28), ఉమారామ్ (27), లక్ష్మణన్ పూరి (22), దినేష్ (27)లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఒక కారు బోల్తా పడి కొంతమేర ధ్వంసమైంది.


పోలీసులు స్వాధీనపరుచుకొన్న గుట్కాతో పాటు కార్లు

ఓటు హక్కు వినియోగంపై చైతన్య ర్యాలీ

హోసూరు: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తూ మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి మహిళా కళాశాల విద్యార్థినులు చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శరయు ముఖ్య అతిథిగా పాల్గొని చైతన్య ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రంగోలి, క్రీడలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వందనాకార్గ్, తహసీల్దార్ సుబ్రమణి, అధికారులు వెంకటేష్, తవమణి, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.


చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శరయు

చెన్నైకు ఆర్టీసీ బస్సు ప్రారంభం

కెలమంగలం: నియోజకవర్గ కేంద్రం తళి నుంచి చెన్నైకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికుల చిరకాల కోరిక నేటికి నెరవేరింది. డెంకణీకోట తాలూకా తళి ప్రాంతం నుంచి చెన్నైకు మూడు బస్సులు మారి వెళ్లాల్సి ఉందని, తళి నుంచి చెన్నైకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే టి. రామచంద్రన్ రవాణాశాఖ అధికారులతో చర్చించి బస్సు వసతి కల్పించాలని కోరారు. ఆ మేరకు మంగళవారం తళి నుంచి చెన్నైకు ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే టి. రామచంద్రన్ పాల్గొని బస్సును నడిపి ప్రారంభించారు.

నేడు చింతామణికి సీఎం రాక

చింతామణి: ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం చింతామణి పట్టణానికి విచ్చేయనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ పదాధికారులు తెలిపారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2.30 గంటలకు పట్టణంలోని కోలారు రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న వ్యవసాయ స్థలంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. సభను విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉమేష్, నాగరాజు, నాగిరెడ్డి, నారాయణస్వామి, కోదండ, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినా చిత్రవధ..

పచ్చమూక వేధింపులకు బలైపోయిన బీసీ మహిళ

నీచమైన కామెంట్లతో మానసికంగా వేధింపు

మధ్య తరగతి కుటుంబం.. ఎంతో విలువలతో కూడిన జీవితం. అత్తమామల మెప్పు పొందింది. పిల్లల అభిమానాన్ని.. భర్త అనురాగాన్ని చూరగొంది. ప్రభుత్వం చేసిన సాయానికి పొంగిపోయింది. ఓ సాధారణ మహిళగా తన ఆనందాన్ని అందరితోనూ పంచుకుంది. అదే ఆమె పాలిట శాపమైంది. పచ్చ రాబందుల దుష్ట పన్నాగానికి బలైపోయింది. సోషల్ మీడియా వేదికగా చేసిన నీచాతినీచమైన వ్యాఖ్యలకు తల్లడిల్లిపోయింది. ఆమె ఆనందం ఎంతోసేపు నిలవనివ్వని సోషల్ మాఫియా వేధింపులకు మానసికంగా కలత చెందింది. నలుగురికి తన బాధను చెప్పకోలేక రైలుకింద పడి ప్రాణం తీసుకుంది. ఇదీ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బీసీ(విశ్వబ్రాహ్మణ) మహిళ గోల్తి గీతాంజలిది. ఇప్పుడు ఆమె చావుపైనా ఆ 'పచ్చ'మూక తప్పుడు ప్రచారానికి పాల్పడుతోంది. ఆ సంఘటనకు తమకేమాత్రం బాధ్యతలేదని తప్పించుకోజూస్తోంది. కానీ పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి వాస్తవాలు వెలికి తీస్తోంది. ఆ నీచుల భరతం పట్టేందుకు సమాయత్తమవుతోంది.

- ఆత్మహత్య సమయంలో ఎవరో తీసిన వీడియోను ఎడిట్ చేసిన టీడీపీ
- అందులో ఆమె కేరక్టర్‌ను అవమానించేలా కొన్ని వ్యాఖ్యలు జోడింపు
- 'ఎవరో ఇద్దరు తోసేశారట', 'ఎవరా ఇద్దరు' అనే మాటలతో ఎడిట్
- వాటినే పట్టుకుని 'తోసేసింది ఎవరు' అంటూ చెలరేగిపోయిన ముఠాలు
- దాన్నే 'వైసీపీ హత్యారాజకీయాలు' అంటూ ట్వీట్ చేసిన నారా లోకేశ్
- టీడీపీ దిగజారుడుతనంపై నివ్వెరపోయిన జాతీయ మీడియా
- గీతాంజలి కుటుంబానికి రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావం.. ర్యాలీలు
- ఆమె పిల్లలిద్దరికీ తలా రూ.10 లక్షల సాయం ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని వ్యాఖ్యలు
- సోషల్ మీడియా వేధింపులు భరించలేకే ఆత్మహత్య: గీతాంజలి భర్త



గుంటూరు నగరంలో గీతాంజలికి నివాళి అర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు తెనాలికి చెందిన గోల్తి గీతాంజలి కుటుంబానికి చాలావరకూ వర్తించాయి. ఇటీవలే తనకు ఇంటి స్థలం ఇచ్చారని.. తనకు ఎంతో సంతోషంగా ఉందని, అమ్మ ఒడి, పింఛన్, వైఎస్సార్ చేయూత వంటి మరెన్నో పథకాలు వచ్చాయని ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియాతో ఎంతో అమాయకంగా... మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ చెప్పింది. సహజంగానే పచ్చనేతలకు ఆమె చెప్పిన విషయాలు రుచించలేదు. ఆమెపై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సోషల్ మీడియా ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయటం ప్రారంభించారు. ఆ ట్రోలింగ్‌లు చూసి తట్టుకోలేకపోయింది. ఆమె భర్తను దుర్భాషలాడుతూ, అమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టింగులు చూసి విలవిలలాడి పోయింది. అవమానంతో కుంగిపోయింది. కనీసం ఇంట్లో వారితో కూడా తన బాధను పంచుకోలేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది కచ్చితంగా ఆత్మహత్యకాదు... సోషల్ మీడియా చేసిన హత్యేనని కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తున్నారు.

రెచ్చిపోతున్న పచ్చ సోషల్ మూక

సోషల్ మీడియాలో వచ్చే అసభ్యకరమైన పోస్టింగ్‌లపై కేవలం సెక్షన్ 41 నోటీసులు ఇచ్చి వదిలిపెట్టాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో సోషల్ మీడియాలో ఐటీడీపీ, జనసేన సోషల్‌మీడియా రెచ్చిపోతోంది. వారి దాష్టీకంవల్లే ఆ నిండుప్రాణం బలైపోయింది. ఈ దుర్ఘటన యావత్ రాష్ట్రాన్ని కదిలించింది. పచ్చబ్యాచ్ దుర్మార్గాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు జరిగాయి. ఆమె కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. గీతాంజలి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ కూడా చట్టం వదిలిపెట్టబోమని ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ మంగళవారం డీజీపీ రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గీతాంజలి కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ నేతలు వరుదు కళ్యాణి, వాసిరెడ్డి పద్మ, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మహిళా కమిషన్ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది సోషల్‌మీడియా టెర్రరిజమని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విచారణ ముమ్మరం

గీతాంజలి ఆత్మహత్యకు పురిగొల్పినవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. సోషల్ మీడియాలో ఆమెపై అసభ్యంగా ట్రోలింగ్ చేసిన 26 మందిని గుర్తించారు. ప్రైవేటు వ్యక్తులే కాకుండా పార్టీల అఫీషియల్ హ్యాండిల్స్ నుంచి కూడా ఘోరంగా ట్రోల్స్ వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కనీసం విచారం వ్యక్తం చేయని తెలుగుదేశం నేతలు... మరింత బరితెగించి ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది ఏడోతేదీ కాగా, ట్రోలింగ్ ఎనిమిది నుంచి మొదలైందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఆమె వీడియో వైరల్ అయిన ఆరో తేదీనే అజయ్‌చౌదరి సజ్జా, స్వాతీ రెడ్డి మరికొందరు నీచాతినీచంగా ట్రోల్ చేశారు. ఒక్కరోజులోనే వందల సంఖ్యలో ట్రోల్స్ వచ్చాయి. ఆమె చనిపోయిందని తెలిసిన వెంటనే ఆ పోస్టులన్నీ డిలీట్ చేశారు. అయితే అప్పటికే పోలీసులు ఈ పోస్టులను సేకరించారు.

రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం జగన్

గీతాంజలి ఆత్మహత్య ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ఆడపిల్లల గౌరవ ప్రతిష్టలకు, మర్యాదలకు భంగం కలిగించే ఏ ఒక్కరినీ కూడా చట్టం వదిలి పెట్టదని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కారణంగా తన కుటుంబానికి ఎంతో మేలు జరిగిందంటూ గీతాంజలి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూపై ప్రతిపక్షాలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేయడంతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందంటూ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలువురు నేతలు ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు.

సెన్సేషనల్ అంటూ ఫేక్ వీడియో

టీడీపీ, జనసైనికుల సోషల్‌మీడియా ట్రోలింగ్‌లకు బలైన గీతాంజలి విషయంలో తెలుగుదేశం పార్టీ మరోసారి తప్పుడు ప్రచారానికి సిద్ధం అయ్యింది. సెన్సేషనల్ అంటూ ఒక వీడియోను విడుదల చేసింది. అందులో గీతాంజలి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సమయంలో లోకో పైలెట్ ఆమెను రైలులోనే రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చిన దృశ్యాన్ని చూపిస్తూ ఆమెను ఎవరో ఇద్దరు తోసేశారంటగా మావా అంటూ ఇద్దరు మాట్లాడుకుంటున్నట్లు వాయిస్ ఓవర్‌తో ఒక వీడియో విడుదల చేశారు. ఇళ్ల పట్టా వచ్చినందుకు ఆనందంగా మీడియాతో మాట్లాడినందుకే ట్రోల్ చేసిన తెలుగుదేశం సోషల్‌మీడియా ఇప్పుడు ఈ వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుండటంతో దాని నుంచి బయటపడేందుకు గీతాంజలి క్యారెక్టర్‌ను తప్పుగా చూపించేలా ప్రచారం మొదలుపెట్టింది. ఆమె ఎవరో ఇద్దరితో రైల్వే స్టేషన్‌కు వచ్చినట్లు, వారు ఆమెను రైలు కిందకి తోసేసి పారిపోయారన్నట్లుగా వాయిస్‌ఓవర్‌తో ప్రచారం చేస్తోంది. ఆ వీడియో గమనించిన ఎవరికైనా అది ఎడిటింగ్ వీడియో అని స్పష్టంగా అర్థం అవుతోంది. ఈ వ్యవహారం తమ దృష్టికి కూడా వచ్చిందని ఈ వీడియోపై కూడా విచారణ జరుపుతామని పోలీసులు స్పష్టం చేశారు

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు



గీతాంజలిని ట్రోల్ చేసి ఆమెను ఆత్మహత్యకు పురికొల్పిన వారిపై కఠిన చర్యలు తప్పవు. ఇప్పటికే బాధ్యులను గుర్తించాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో ఓవర్‌యాక్షన్ చేసి కొంత మందిని ఇబ్బంది పెట్టిన వారిపై 6,970 సోషల్‌మీడియా బుల్లీయింగ్ షీట్‌లు నమోదు చేశాం. సుమారు 7వేల మందిని అరెస్ట్ చేశాం. సైబర్ క్రైమ్‌కు సంబంధించి 2023 సంవత్సరంలో ఆయా అకౌంట్‌దారులపై 327 కేసులు నమోదు చేశాం. హైకోర్టు జడ్జిని దూషించిన కేసులో 53 మందిపై కేసులు నమోదు చేశాం. దిశ చట్టంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా సైబర్, సోషల్ మీడియా అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసేలా పొందుపరిచి బిల్లు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది.

– పాలరాజ్, ఐజీ, గుంటూరు రేంజ్



టీడీపీ- జనసేన సైకోమూకలపై

జనం కన్నెర్ర

గీతాంజలి మృతిపై రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన ఆగ్రహ జ్వాలలు

ఈ నైచ్యానికి అంతులేదు. ఈ మానవ మృగాలకు బుద్ధి రానే రాదు. ప్రభుత్వ పథకాలు తమ కుటుంబానికి మేలు చేశాయన్నందుకు.. బీసీ మహిళ గీతాంజలిని వీధి కుక్కల్లా వెంటాడారు. వేధించారు. థర్డ్‌డిగ్రీకి పదింతల ఆన్‌లైన్ టార్చర్‌కు గురిచేశారు. తట్టుకోలేక ఆమె రైలు కింద పడి తనువు చాలించినా ఈ దరిద్రులకు సిగ్గురాలేదు. రైల్వే స్టేషన్ దగ్గర ఆమె మృతదేహం పడి ఉండగా, ఎవరో తీసిన రెండు నిమిషాల వీడియోలో మాటల్ని ఎడిట్ చేసి మరీ.. చనిపోయాక కూడా ఆమెను చిత్రవధ చేయడం మొదలెట్టారు. "ఎవరో ఇద్దరు నెట్టేశారంట" అనే మాటల్ని వీడియోకు కొత్తగా జోడించి దాన్ని 'ఎక్స్'లో తెలుగుదేశం పార్టీ అధికారిక హ్యాండిల్‌లోనే పోస్ట్ చేసిందంటే ఏమనుకోవాలి? వీళ్లకసలు సిగ్గూ లజ్జా ఏమైనా ఉన్నాయా? పైపెచ్చు అవే ఎడిటెడ్ మాటల్ని వైరల్ చేస్తూ.. నెట్టేసిన ఇద్దరూ ఎవరు? ఆమెతో ఎందుకు వెళ్లారు? అంటూ టీడీపీ, జనసేన సోషల్ మీడియా మాఫియా పలు పోస్టులు పెడుతూ వ్యక్తిత్వ హననం చేస్తోందంటే ఏమనుకోవాలి? గీతాంజలి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలియగానే.. ఆమెపై చేసిన దారుణమైన వ్యాఖ్యల్ని తమ సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి తొలగించి తప్పించుకోవాలని చూస్తున్న ఈ రాక్షసుల్ని ఏం చేయాలి? వీళ్లదసలు మనిషి పుట్టుకేనా? వీళ్లకు కుటుంబాలున్నాయా?

సర్వత్రా ఆగ్రహం

- టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైకోల కారణంగా మృతి చెందిన గీతాంజలికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, నేతలు నివాళులర్పించారు. ఈ ఘటనను ఖండిస్తూ ర్యాలీలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా పలమనేరు ఎమ్మెల్యే వెంకటేశ్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నెల్లూరు నాయకురాలు మోయిళ్ల గౌరి, విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల నిరసన కార్యక్రమం చేపట్టారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గుంటూరు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు చర్చి సెంటర్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, వైఎస్సార్ సీపీ మహిళా నేతలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. విజయవాడ శిఖామణి సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, మహిళా నేతలు ర్యాలీ నిర్వహించారు.


నెల్లూరులో గీతాంజలికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మహిళలు


విజయవాడలో క్యాండిల్ ర్యాలీ చేస్తున్న మహిళలు


విశాఖలో మహిళల నిరసన

సాక్షి, అమరావతి/రేపల్లె రూరల్/తెనాలి రూరల్/సాక్షి నెట్ వర్క్: 'పురాణాల్లో దుశ్శాసనుడు కూడా ఇంతలా మానవ మృగాల్లా వ్యవహరించి ఉండకపోవచ్చు.. ఇప్పుడు ఆయనే ఉంటే టీడీపీ–జనసేన సైకో మూకల తీరు చూసి సిగ్గు పడేవాడు.. ట్రోలింగ్‌తో వెంటపడి, వేటాడి గీతాంజలి మృతికి కారణమైన ఈ సైకోలందరినీ కఠినంగా శిక్షించాల్సిందే' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సర్వత్రా నిరసన వ్యక్తమైంది. ఆడబిడ్డ అన్యాయంగా చనిపోయిందనే కనికరం కూడా లేని ఆ పార్టీల అధినేతలు.. మహిళా సాధికారత గురించి మాట్లాడుతుండటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలు విశేషంగా ఆకర్షితులవుతుంటే తట్టుకోలేని ఈ మానవ మృగాల టార్గెట్‌తో ఒక నిండు ప్రాణం బలైపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇద్దరు చిన్నారులు తల్లి ప్రేమ కోల్పోయి దిక్కుతోచని వారయ్యారని, ఇందుకు బాధ్యత వహించాల్సింది చంద్రబాబు, పవన్‌లేనని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై జాతీయ మీడియా సైతం స్పందించింది. మితిమీరిన ట్రోలింగ్‌లకు ముకుతాడు వేయాలని వార్తలు ప్రసారం చేసింది.

ఇది టీడీపీ, జనసేన సైకోల హత్య

గీతాంజలిది ఆత్మహత్య కాదు. టీడీపీ, జనసేన సైకోలు చేసిన హత్యగానే పరిగణించాలి. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తూ మానసికంగా వేధించడంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుంది. చనిపోయిన తల్లి పార్థివ దేహం వద్ద ఇద్దరు చిన ఆడబిడ్డలు ఏడుస్తుంటే చూసిన ప్రతీ ఒక్కరూ చలించిపోయారు. తన సొంతింటి కల నెరవేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆమె గుండెల్లో పెట్టుకోవడమే పాపమైపోయిందా? సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటామని చెప్పడమే గీతాంజలి చేసిన తప్పా? టీడీపీ, జనసేన సోషల్ మీడియా యాక్టివిస్టులు మరీ ఇంత ఘోరంగా ప్రవర్తిస్తారా? తల్లిని కోల్పోయిన ఆ ఇద్దరు ఆడబిడ్డల భవిష్యత్తేంటి? మీ సోషల్ మీడియా సైకోలు తల్లి మమకారాన్ని తిరిగి తెస్తాయా? తన భార్య ఎంతో సంతోషంగా ఈ ప్రభుత్వాన్ని మెచ్చుకున్నందునే టీడీపీ, జనసేన సైకోలు సోషల్‌మీడియా ట్రోల్స్‌తో ఆమె తీవ్రంగా మనోవ్యథకు గురైందని.. ఆరోజు రాత్రి, తెల్లవారుజామున కూడా ఆమె ఆ రెండు పార్టీల సోషల్ మీడియా దుర్మార్గులు పెట్టిన కామెంట్లు చదివి బాధ పడిందని గీతాంజలి భర్త చెబుతుంటే బాధేస్తోంది. ఐటీడీపీ నారా లోకేశ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సోషల్ మీడియా సంస్థ. కానీ, దీన్ని ఐటీడీపీ అనేకంటే ఉగ్రవాద సంస్థగా చెప్పాలి.

– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు

మహిళను బలితీసుకునే అధికారం ఎక్కడిది?

టీడీపీ, జనసేన స్వార్థ రాజకీయాల కోసం మహిళను బలితీసుకునే అధికారం ఎవరిచ్చారు? ఆ పార్టీల సోషల్ మీడియా రాబంధుల వికృత చేష్టలతో ఒక మహిళ నిండు ప్రాణాన్ని పొట్టన పెట్టుకున్నారు. టీడీపీ– జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు మనుషులా? మృగాలా? తన కూతురికి అమ్మ ఒడి వచ్చిందని, అత్తకు చేయూత, తన మామకు పింఛన్‌తో కలిపి మొత్తం ఇంటిలో నాలుగు పథకాలు వచ్చాయని చెప్పడంతో పచ్చ మందకు కళ్లు కుట్టాయి. ఇలాంటి ఘటనలతో పైశాచిక ఆనందాన్ని పొందేందుకేనా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు రూ.కోట్లు వెచ్చించి సోషల్ మీడియాను నడుపుతున్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. మహిళల సంక్షేమానికి ఏం చేశారు. ఆయన హయాంలోనే బడుగు బలహీన వర్గాల పిల్లలు అంతర్జాతీయ వేదికల్లో ఇంగ్లిషులో మాట్లాడటాన్ని కూడా తట్టుకోలేక వారిపైనా ట్రోలింగ్‌తో నీచపు రాజకీయం చేశారు.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

కక్షగట్టి ట్రోలింగ్

గీతాంజలి మృతికి కారణమైన బాధ్యులకు శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ ప్రభుత్వం వల్ల తనకు మంచి జరిగిందని గీతాంజలి గట్టిగా చెప్పడం టీడీపీ, జనసేనకు నచ్చలేదు. అందుకే పనిగట్టుకుని, కక్షతో ట్రోలింగ్‌కు గురిచేశారు. మానసిక చిత్రహింస తట్టుకోలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరం. ఒక సామాన్య మహిళపై అసభ్యకరంగా పోస్టులు పెట్టేవారిని సభ్యసమాజంలోని ప్రతి వ్యక్తి ఖండించాలి. తాము పొందిన లబ్ధి గురించి తెలియజేస్తున్న ప్రజల స్వేచ్ఛను హరించేలా టీడీపీ–జనసేనల సామాజిక మాధ్యమాల్లో వికృతంగా వ్యవహరించడం దారుణం.

– మోపిదేవి వెంకట రమణారావు, ఎంపీ

మనిషిని బతికించేలా మాట ఉండాలి

మన నోటి నుంచి వచ్చే ప్రతి మాట మనిషిని బతికించేలా ఉండాలి. టీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌కు బలైన గోల్తి గీతాంజలి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవడం ప్రశంసనీయం. తనకు జరిగిన మేలు చెప్పుకోవడం గీతాంజలి నేరమైంది. సోషల్ మీడియాలో ఇలాంటి అసభ్యకర పదజాలం వాడేవారిని శిక్షించాలి. – జి.శాంతమూర్తి, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు



మానవత్వం లేని నాదెండ్ల

తెనాలి పట్టణం మహబ్‌చౌక్ ఇస్లాంపేటకు వెళ్లే రోడ్డు ప్రారంభంలోనే ఉన్న గీతాంజలి ఇంటి ముందు పెద్ద ఎత్తున జనం గుమిగూడి జరిగిన ఘటన గురించి చర్చించుకుంటున్న తరుణంలో జనసేన నేత నాదెండ్ల తీరు విమర్శలకు దారితీసింది. గీతాంజలి ఇంటికి కూతవేటు దూరంలోనే ఈయన గారు ఎన్నికల ప్రచారం నిర్వహించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం అయింది. 'ఈయనేం లీడర్.. మానవత్వం లేదా?' అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గీతాంజలి కుటుంబాన్ని పరామర్శించడానికి ఎక్కడెక్కడి నుంచో నేతలు తరలి వస్తుంటే.. స్థానికంగా మనోహర్ ఆ ఇంటి వైపు కూడా చూడకుండా చిరునవ్వులు చిందిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

దోషులను వదిలేది లేదు: ఎస్పీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు :సోషల్ మీడియా ట్రోలింగ్ వల్ల ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి కేసు విచారణ వేగవంతం చేశామని, దోషులను వదిలేది లేదని గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ ఉదయం 11 గంటలకు తెనాలికి చెందిన గీతాంజలి(32) ఆత్మహత్యకు ప్రయత్నించిందని, తెనాలి ఐదో నెంబర్ ప్లాట్‌ఫాం సమీపంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద పడే ప్రయత్నం చేసింది. ఆమె 11వ తేదీ ఉదయం రెండు గంటల ప్రాంతంలో చికిత్స పొందుతూ మరణించిందన్న సమాచారం మేరకు తెనాలి రైల్వే పోలీసులు 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును రైల్వే పోలీసుల నుంచి తెనాలి వన్‌టౌన్‌కు బదిలీ చేశారని, రైల్వే పోలీసుల విచారణ నివేదిక ఆధారంగా కేసును సెక్షన్ 174 నుంచి ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు సెక్షన్ 306కి మార్పు చేయడం జరిగిందన్నారు.

కుట్రతోనే వేధింపులు

ప్రభుత్వం చేసిన మంచి ఎవరూ చెప్పకూడదనే ప్రతిపక్షాల కుట్ర

- చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌ల పాత్ర కూడా ఉండొచ్చు
- కారకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- కూటమికి మహిళాలోకం బుద్ధి చెప్పాలి
- కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి రజిని, వైసీపీ నేతలు


గీతాంజలి భర్త బాలచంద్రను అడిగి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి రజిని, సజ్జల భార్గవ, శివకుమార్, వాసిరెడ్డి పద్మ, పోతుల సునీత, వరుదు కళ్యాణి

తెనాలి: ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి సంతోషంగా తన అభిప్రాయాన్ని తెలియజేసిన గొల్తి గీతాంజలిపై సోషల్ మీడియాలో వికృతంగా ట్రోల్ చేసి ఆమె బలవన్మరణానికి కారకులైన ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా మృగాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని హెచ్చరించారు. గీతాంజలి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం వెనుక ప్రభుత్వం చేసిన మంచిని మరెవరూ చెప్పకుండా అణచివేయాలనే పెద్ద కుట్ర ఉందని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనల వెనక నారా లోకేశ్ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. గీతాంజలి మరణించిన తర్వాత కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, వీరికసలు మనసనేది ఉందా అని ఆమె ప్రశ్నించారు. మహిళలంతా వీరి దుశ్చర్యలను గమనించాలని రానున్న ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని ఆమె సూచించారు. గుంటూరు జిల్లా తెనాలి ఇస్లాంపేటలోని గొల్తి గీతాంజలి నివాసానికి మంగళవారం సాయంత్రం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పోతుల సునీత, ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర పరామర్శించారు. గీతాంజలి భర్త బాలచంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమార్తెలు రిషిత, రిషికలను పరామర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనతో తామంతా వచ్చామని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. సీఎం జగన్ రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించినట్లు పేర్కొన్నారు. వీరితోపాటు గుంటూరు తూర్పు అసెంబ్లీ ఇన్‌చార్జి నూరి ఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మురుగుడు లావణ్య, ఎన్నారై అధికార ప్రతినిధి కడప రత్నాకర్, గాలి అరవింద, పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

చితిమంటల్లోనూ చలికాచుకుంటున్నారు...

ప్రభుత్వం చేసిన మంచిని చెప్పే ఉత్సాహంలో ఒక అంకె తప్పు చెప్పడం బూతులాగా అనిపించిందా? గీతాంజలి చనిపోయి రెండురోజులైనా ఇంకా పోస్టులు పెడుతూ, ఇంకా రాబందుల్లా పీక్కుతింటున్నారు. తాగుబోతులు, సైకోలు వీరంగం వేసినట్టుంది. గీతాంజలి చితిమంటల్లోనూ చలికాచుకుంటున్న మీకు సిగ్గుండాలి.లోకేశ్ భార్య, చంద్రబాబు భార్యపై పోస్టులు పెడితే పరిస్థితి ఏమిటి? చంద్రబాబు భార్యను ఏమీ అనకుండానే అసెంబ్లీ నుంచి బయటకొచ్చి గొడవ చేశారు. రాజీపడేదే లేదు. అందరికీ శిక్షలు పడతాయి. ఎవరినీ వదిలిపెట్టేది లేదు.

– నందిగం సురేష్, ఎంపీ

సోషల్ మీడియా టెర్రరిజం

గీతాంజలిపై ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా చేసింది ట్రోలింగ్ కాదు...టెర్రరిజం అంటాను. మా పార్టీలోని మహిళా ప్రజాప్రతినిధులు, మంత్రులు, సీనియర్ లీడర్లు, జర్నలిస్టులు అందరూ ఈ టెర్రరిజం బాధితులే. గీతాంజలి చనిపోయాక కూడా వదలడం లేదు. బాధపడుతున్నట్టు ఒక్కరు కూడా చెప్పటం లేదు. ఒక కుటుంబంలో భార్య, తల్లి, కోడలు, కుమార్తెగా ఉంటున్న మహిళ మరణానికి కారకులయ్యారు. న్యాయం ఏమిటి? నారా లోకేశ్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చెప్పాలి. ప్రజాస్వామ్యానికి ఇది నిజంగా బ్లాక్ డే. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాలో ఎక్కడా అసభ్యత ఉండదు.

– సజ్జల భార్గవ, కన్వీనర్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా

టీడీపీ, జనసేన సోషల్‌మీడియా చేసిన హత్య

గీతాంజలిది ఆత్మహత్య కాదు...టీడీపీ, జనసేన సోషల్‌మీడియా చేసిన హత్య. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి కుటుంబంలోని లబ్ధిదారులే స్టార్ క్యాంపెనర్లు అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుంటారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని చెప్పిన గీతాంజలి నోరు నొక్కితే ఇంకెవరూ నోరు విప్పరు అనే కుట్రతో ఆమెను ట్రోల్ చేశారు. సీఎం జగన్ చేసిన మంచిని ఎవరూ చెప్పకూడదనే ఆమె జీవితాన్ని అంతం చేశారు. సోషల్ మీడియాలో మహిళలు ఎవరూ మాట్లాడకూడదనే వారి కుట్ర.

– వాసిరెడ్డి పద్మ, ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్

పట్టా ఇచ్చిన చేత్తోనే నివాళి అర్పించడం దురదృష్టం...

గీతాంజలికి ఈ నెల 4వ తేదీన రిజిస్ట్రేషన్ పట్టాను ఇచ్చిన చేతులతోనే ఆమె భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించాల్సి రావడం దురదృష్టం. ఆమె మరణానికి కారకులను ప్రభుత్వం శిక్షిస్తుంది. మానవతా దృక్పథంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఆమె ఇద్దరు ఆడపిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాం. ఆ కుటుంబానికి అండగా ఉంటాం.

– అన్నాబత్తుని శివకుమార్, తెనాలి ఎమ్మెల్యే

గీతాంజలిని దారుణంగా వేధించారు..

ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియావాళ్లు గీతాంజలిని దారుణంగా వేధించారు. ఆమె బలవన్మరణానికి కారకులయ్యారు. ప్రభుత్వం వీరిని కఠినంగా శిక్షిస్తుంది. మళ్లీ మరో మహిళకు ఇలా జరగకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం.

– ఎస్‌ఎం పవిత్ర, చైర్‌పర్సన్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 13-3-2024

* స్ఫూర్తి

వయసు అరవై దాటిందంటే చాలు
'ఇంకా ఏం పనులు చేస్తావు, విశ్రాంతి తీసుకో..' అనే సలహాలు ఇస్తుంటారు.
కొందరు ఆ సలహాలను కూడా సవాళ్లుగా తీసుకుంటారు.
కొన్ని అభిరుచులను జీవితకాల సాధనగా మార్చుకుంటారు.
ఈ మాటలను నిజం చేస్తోంది 71 ఏళ్ల రాధామణి.
ఇప్పటివరకు 11 హెవీ వాహనాల లైసెన్స్‌లను పొంది
మూస పద్ధతులను బద్దలు కొట్టి కొత్త రికార్డులు సృష్టిస్తోంది.
అందరూ మణి అమ్మ అని పిలుచుకునే రాధామణి కేరళవాసి.
సాధనమున ఏవైనా సమకూరుతాయి అని
నిరూపిస్తున్న రాధామణి ఇప్పుడు ఇంజినీరింగ్ డిప్లొమాను అభ్యసిస్తూ
ఈ రంగంలో ఎదగడానికి చేస్తున్న కృషి అందరికీ ఓ స్ఫూర్తి మంత్రం.

డ్రైవింగ్ మణి @ 71





ట్రక్కు, జెసీబీ, క్రేన్ .. మొదలైన హెవీ వెహికిల్స్ నడుపుతూ..

1984లో కేరళలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన మొదటి మహిళగా గుర్తింపు పొందిన రాధామణి ఇప్పటికీ 'వయసు ఎప్పుడూ అడ్డంకి కాదు' అని, అందుకు తన జీవితమే ఓ ఉదాహరణగా చూపుతుంది.

స్కూటర్ నుంచి జేసీబీ వరకు

సాధారణంగా మహిళలు స్కూటర్, కార్ డ్రైవింగ్‌తో సరిపెట్టేస్తారు. రాధామణి మాత్రం అంతటితో ఆగలేదు. డ్రైవింగ్ పట్ల తనకు ఆసక్తి కలగడానికి ప్రోత్సాహాన్నిచ్చిన భర్తను గుర్తుచేసుకుంటూ "1981లో మొదటిసారి ఓ అంబాసిడర్ డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఆ తర్వాత ఐదేళ్లలోపు ఫోర్ వీలర్ లైసెన్స్ పొందాను. ఆ విధంగా కేరళలో హెవీ వెహికల్ లైసెన్స్ పొందిన మొదటి మహిళగా కూడా గుర్తింపు పొందాను. ఎ టు జెడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెవీ ఎక్విప్‌మెంట్ అనే డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించాను' అని వివరిస్తుంది. ఈ వెంచర్‌ను రాధామణి భర్త పదేళ్లకు ముందుగానే ప్రారంభించాడు. అక్కడ నుంచే ఈ జంట డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. కానీ రాధామణి పేరుతో లైసెన్స్ పొందడానికి స్కూల్ రిజిస్టర్ చేయడానికి కష్టంగా మారింది. దీంతో రాధామణి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. కొన్నేళ్ల న్యాయ పోరాటం తర్వాత ఈ జంట కేరళలో హెవీ వెహికల్ డ్రైవింగ్ లెర్నింగ్ స్కూల్‌ను రాధామణి పేరుతో రిజిస్టర్ చేయగలిగారు.

సంకల్పంతో నిలబెట్టింది..

రాధామణి భర్త 2004లో మరణించాడు. ఆ తర్వాత ఈ వెంచర్ మరింత ప్రాముఖ్యతను నింపుకుంది. మణి అమ్మ సంకల్పం ఆ ట్రైనింగ్ స్కూల్‌ను నిలబెట్టడం ఒక్కటే కాదు, దానిని ఒక సంస్థగా మార్చేందుకు కృషి చేయడం కూడా! అందుకే ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఏ రంగమైనా హెవీ డ్రైవింగ్ అంటే ముందు పురుషులే గుర్తుకు వస్తారు. అలాంటి ఆలోచనకు తావు ఇవ్వకుండా, వయసు నింబధనలను కూడా ధిక్కరిస్తూ ఈ డ్రైవింగ్ స్కూల్‌ను రాధామణి నడుపుతోంది. అందుకు మరింతగా ఎదగడానికి కావాల్సిన జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇంజనీరింగ్ డిప్లొమాను అభ్యసిస్తూ, అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

రికార్డుల చక్రం

ఆమె అద్భుతమైన నైపుణ్యాలు, అంకిత భావాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించింది. 'ఇన్స్పిరేషనల్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022' పురస్కారాన్ని ఇచ్చి తనను తాను గౌరవించుకుంది సంస్థ. రాధామణి అంతటితో ఆగలేదు. సోషల్ మీడియాలో కూడా తన ఉనికిని చాటుతోంది. అక్కడ ఆమె తన డ్రైవింగ్ అనుభవాలను పంచుకుంటుంది. వయసు లేదా జెండర్‌తో సంబంధం లేకుండా కలలను పండించుకునేందుకు తగిన ప్రేరణను ఇస్తోంది రాధామణి.

సోషల్ మీడియాలో..

రాధామణి ఇన్‌స్టాగ్రామ్ పేజీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. జేసీబీలు, ఫోర్క్‌లిఫ్ట్‌లు, క్రేన్లు, ఫెరారీలు, పడవలు, ట్యాంకర్లు, జీప్స్, పెద్ద పెద్ద ట్రక్కుల వరకు ప్రతి వాహనాన్ని డ్రైవ్ చేస్తూ కనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో తన డ్రైవింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఉన్న 19కె ఫాలోవర్లు మణి అమ్మను ప్రశంసిస్తుంటారు. ఎంతోమంది చేత సత్కారం పొందుతుంటారు. చాలా మంది మహిళలకు హెవీ డ్రైవింగ్ పరికరాల గురించి చెప్పడం, నేర్పడం చూడచ్చు.

రాధామణి అమ్మ అంటే ఆవేశం, పట్టుదల, శక్తికి నిదర్శనం. ఆమె కేవలం రోడ్డుపైనే కాదు అడ్డంకులను ఛేదించి చక్రాన్ని చేరుకోవడానికి తగిన స్ఫూర్తిని ఇచ్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తోంది.

కళ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో శ్రద్ధా జైన్

శ్రద్ధగా నవ్విస్తుంది!

'శ్రద్ధా జైన్ తెలుసా?' అని అడిగితే –
'తెలుసు' అని చెప్పేవారి సంఖ్య తక్కువ కావచ్చుగానీ–
'అయ్యో శ్రద్ధా తెలుసా' అంటే
'అయ్యో... తెలియకపోడం ఏమిటి!' అనే వాళ్ల సంఖ్య ఎక్కువే.
బెంగళూరుకు చెందిన శ్రద్ధా జైన్ అలియాస్ 'అయ్యో శ్రద్ధా'
'ఇంటర్నెట్ సెన్సేషన్'గా పేరు తెచ్చుకుంది.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా
ఇటీవల 'నేషనల్ క్రియేటర్స్' అవార్డ్ అందుకుంది.

హాయిగా నవ్వించే వీడియోలతో సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయింది శ్రద్ధా జైన్. తులు, కన్నడ, హిందీ, మరాఠీ, ఇంగ్లీష్ భాషలలో ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా వీడియోలు పోస్ట్ చేస్తుంటుంది.

2016లో కర్నాటకాలో జరిగిన ఒక ఫెస్టివల్‌కు సంబంధించి ఫేస్‌బుక్ వీడియోను పోస్ట్ చేసింది. వైరల్ అయిన ఈ వీడియో శ్రద్ధాకు వీర లెవెల్లో పేరు తెచ్చింది. ఒక డ్యాన్స్ రియాల్టీ షోకు హోస్ట్‌గా, కొన్ని టీవీ కార్యక్రమాలకు క్రియేటివ్ డైరెక్టర్‌గా అవకాశాలు తెచ్చింది. ఇక కామెడీ షోల సంగతి సరే సరి.

కామెడీ డ్రామా సిరీస్ 'పుష్పవల్లి'తో శ్రద్ధ పేరు హాస్యాభిమానుల అభిమాన పేరు అయింది.

పెద్ద బ్రాండ్స్‌తో కలిసి పనిచేసిన శ్రద్ధ ఇలా అంటుంది...

'కంటెంట్‌లో వెరైటీ ఉండేలా ప్రయత్నించేదాన్ని. ప్రేక్షకుల సంగతి ఏమిటోగానీ కంటెంట్‌లో వెరైటీ లేకపోతే ముందు నాకే బోర్ కొడుతుంది. అది ఎంత పెద్ద హిట్ అయినా సరే ఒకే అంశాన్ని పదేపదే చేయలేను. రియల్ ఎస్టేట్ రంగంలోకి ఉన్న వారికి ఎలాంటి ఇన్‌ఫ్లూయెన్సర్‌ను ఎంపిక చేసుకోవాలో తెలియదు. నేను సృష్టించిన రీనా దలాల్ క్యారెక్టర్‌ను చూసిన తరువాత... రీనా క్యారెక్టర్ పర్‌ఫెక్ట్ అనుకున్నారు. మొదట్లో రియల్ ఎస్టేట్ కోసం కంటెంట్ క్రియేట్ చేసిన అతి కొద్దిమందిలో నేను ఒకరిని' అంటుంది శ్రద్ధ.

ఏ బ్రాండ్ వారు వచ్చినా తమది ఏ బ్రాండ్ అనేది మాత్రమే చెబుతారు. వారికి 'ఐడియా' గురించి బొత్తిగా ఐడియా ఉండదు. ఈ నేపథ్యంలో ఐడియా జెనరేట్ చేయడం నుంచి స్క్రీన్‌ప్లే వరకు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి ఎన్నో చేయాల్సి ఉంటుంది. ఇలాంటి అన్ని విద్యల్లో ఆరితేరింది శ్రద్ధ.

పని పట్టాలెక్కడానికి అట్టే టైమ్ పట్టదు. కాన్సెప్ట్ డిస్కషన్ మీటింగ్ తరువాత పని పరుగులు తీస్తుంది.

సాధారణంగా పాపులర్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ఫిక్స్‌డ్ స్టైల్‌కే పరిమితం అవుతారు. అది దాటి బయటికి రావడాన్ని రిస్క్ అనుకుంటారు. అయితే ఎప్పటికప్పుడూ కొత్తగా ఆలోచిస్తూ 'ఫిక్స్‌డ్ స్టైల్' అనేది లేకుండా జాగ్రత్త పడింది శ్రద్ధ.

రేడియో జాకీ, డ్యాన్స్ షో హోస్ట్, కమెడియన్, రైటర్, అయిదు లక్షల ఫాలోవర్‌లు ఉన్న ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్... ఇలా శ్రద్ధా జైన్ సృజనాత్మక రూపాలు ఎన్నో ఉన్నాయి. 'డాక్టర్ జీ' సినిమాతో బాలీవుడ్‌లోకి కూడా అడుగు పెట్టింది.

'నా నటన, రచనలకు సోషల్ మీడియాలో మంచి గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు ద్వారా ఏదైనా సౌత్ ఫిల్మ్‌లో నటించే అవకాశం వస్తుంది అనుకున్నాను. అయితే ఏకంగా బాలీవుడ్ నుంచే పిలుపు రావడం ఆనందంగా అనిపించింది' అంటున్న శ్రద్ధ పోస్ట్-గ్రాడ్యుయేట్ స్టూడెంట్‌గా నటించింది.

'పెర్ఫార్మర్, కంటెంట్ క్రియేటర్‌లకు ఇది మంచి టైమ్. ఏమాత్రం టాలెంట్ ఉన్నా మన స్థాయి ఎక్కడికో వెళ్లిపోతుంది' అంటుంది శ్రద్ధా జైన్.

బ్యూటిప్

యాక్నే ట్రీట్‌మెంట్ ఇంట్లోనే...

చర్మగ్రంథుల నుంచి స్రవించే సెబమ్, ఇతర నూనెలు చర్మం మీద ఒక చోట గూడు కట్టుకున్నప్పుడు, వాటికి మృతకణాలు తోడైనప్పుడు మొటిమలు, యాక్నే వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇందుకోసం మార్కెట్‌లో దొరికే క్రీమ్‌లకంటే ఇంట్లోనే చేసుకోగలిగిన పరిష్కారాలు మంచి ఫలితాన్నిస్తాయి.



దాల్చినచెక్కతో ఫేస్‌ప్యాక్: ముఖాన్ని క్లెన్సర్‌తో కానీ మామూలు సబ్బుతో కానీ శుభ్రం చేసుకుని తుడిచేయాలి. రెండు టేబుల్ స్పూన్‌ల తేనెలో టీ స్పూన్ దాల్చిన చెక్క పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఇప్పుడు చన్నీటితో ముఖం కడగాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే చర్మం మీద మృతకణాలు, నూనెలు, సెబమ్ వంటివి నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగిపోతుంటాయి. కాబట్టి కొత్త మొటిమలు రావు. అప్పటికే ఉన్న మొటిమలు, యాక్నే కూడా తగ్గుముఖం పడుతుంది.



గ్రీన్ టీ ప్యాక్: ఒక గ్లాసు నీటిలో గ్రీన్ టీ బ్యాగ్ వేసి నాలుగు నిమిషాల సేపు మరిగించాలి. గ్రీన్‌టీ పూర్తిగా చల్లారిన తర్వాత అందులో కాటన్ బాల్‌ను ముంచి టీని ముఖానికి పట్టించాలి. టీని ముఖానికి కాటన్ బాల్‌తో పట్టించడం కుదరకపోతే స్ప్రే బాటిల్‌లో పోసుకుని ముఖం మీద స్ప్రే చేసుకుని చర్మానికి పట్టేటట్లు వేళ్లతో అద్దాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇప్పుడు టీ బ్యాగ్‌ను ఓపెన్ చేసి అందులో రెండు చుక్కల తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయాలి. ఈ ప్యాక్ బాగా ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. రోజుకోసారి ఇలా చేస్తుంటే వారంలోనే మొటిమలు, యాక్నే పోయి చర్మం కాంతిమంతమవుతుంది.



బీట్‌రూట్‌తో డే క్రీమ్



తొక్కతీసిన అరకప్పు బీట్‌రూట్ ముక్కలను గిన్నెలో వేసి అరగ్లాసు నీళ్లు పోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత స్టవ్ ఆపేసి బీట్‌రూట్ ముక్కల్లో టీస్పూను సోంపు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. పది నిమిషాల తరువాత బీట్‌రూట్ ముక్కల్లో ఉన్న నీటిని వడగట్టి తీసుకోవాలి. ఈ నీటిలో టీస్పూను రోజ్ వాటర్, రెండు టీస్పూన్ల అలోవెరా జెల్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసుకోవాలి. వారం రోజులపాటు నిల్వ ఉండే ఈ క్రీమ్‌ను రోజూ ఉదయం పూట రాసుకుంటే.. ముఖం మీద మచ్చలు, ముడతలు, డార్క్ సర్కిల్స్ తగ్గుముఖం పట్టి ప్రకాశవంతముగా కనిపిస్తుంది.

కిచెన్ టిప్స్

ఇలా చేస్తే కనరెక్కదు..



- రెండు స్పూన్ల నీటిలో స్పూను పాలు పోసి చక్కగా కలపాలి. ఈ పాల మిశ్రమాన్ని వంకాయ ముక్కలపై చిలకరిస్తే ముక్కలు చేదుగా మారవు.
- టేబుల్ స్పూను నిమ్మరసం వేసిన నీటిలో తరిగిన వంకాయ ముక్కలు వేస్తే కనరెక్కవు.
- వంకాయ ముక్కలు లేదా కూరగాయ ముక్కలు వేసే నీటిలో టేబుల్ స్పూను వెనిగర్ వేసి కలపాలి. అప్పుడు కూరగాయ ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.

యూత్ పల్స్

నాద వినోదం నాట్య విలాసం

ఆరోగ్య భాగ్యం

భరత నాట్యం నుంచి కూచిపూడి వరకు
భారతీయ శాస్త్రీయ నృత్యాలలో వ్యాయామానికి
సమానమైన అంశాలు ఎన్నో ఉన్నాయి.
ఈ నేపథ్యంలో ఈ తరం శాస్త్రీయ నృత్యాలపై
ఆసక్తి ప్రదర్శిస్తోంది. నృత్య సాధనతో ఫిట్‌నెస్‌ను
సొంతం చేసుకుంటుంది.



ప్రతీకాత్మక చిత్రం

ముంబైలో ఎంబీఏ చేస్తున్న శివానీ దీక్షిత్‌కు ఏ చిన్న పనిచేయాలన్న బద్దకంగా అనిపించేది. దీని వల్ల చదువు కూడా దెబ్బ తినే ప్రమాదం ఏర్పడింది. తన కజిన్ సలహా ప్రకారం అయిష్టంగానే భరతనాట్యం నేర్చుకోవడం మొదలు పెట్టింది. మొదట్లో ఎలా ఉన్నా ఆ తరువాత మాత్రం భరతనాట్యంపై దీక్షిత్‌లో అంతకంతకూ ఇష్టం పెరుగుతూపోయింది.

'నేను ఎప్పుడూ వ్యాయామాలు చేయలేదు. అయితే భరతనాట్యం వల్ల ఎన్నో వ్యాయామాలు ఒక్కసారే చేస్తున్నట్లుగా అనిపించింది. బద్ధకాన్ని వదిలించుకున్నాను. మనసు తేలిక అయినట్లుగా ఉంది' అంటుంది శివానీ దీక్షిత్.

'అధిక బరువుతో బాధ పడుతున్న నాకు కథక్ నృత్యం కాంతి కిరణంలా కనిపించింది. కథక్ నృత్య సాధనతో బరువు తగ్గడం సంతోషంగా ఉంది. కథక్ డ్యాన్స్ అనేది మచ్ మోర్ దెన్ ఏ వెయిట్ లాస్ ఎక్సర్‌సైజ్ అనేది నా అభిప్రాయం. బరువు తగ్గడానికే కాదు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌ల విషయంలోనూ కథక్ ఉపయోగపడుతుంది' అంటుంది కోల్‌కతాకు చెందిన ఇరవై రెండు సంవత్సరాల నయనిక.

బరువు తగ్గడానికి ఉపయోగపడే ఒడిస్సీ, జాజ్, కాంటెంపరీ వెస్ట్రన్ డ్యాన్స్‌లను కలిపి ఒక డ్యాన్స్ ఫామ్ రూపొందించినట్లు తెలుసుకున్న నయనిక ప్రస్తుతం ఆ సమ్మేళన నృత్యరూపం గురించి మరిన్ని వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో ఉంది.

'కేవలం బరువు తగ్గడానికే కాదు ఏకాగ్రతను పెంచడంలో, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో శాస్త్రీయ నృత్యాలు ఉపయోగపడతాయనే విషయాన్ని నృత్యసాధన ద్వారా స్వయంగా తెలుసుకున్నాను. శాస్త్రీయ నృత్యకదలికలకు చేతులు, కళ్ల మధ్య సమన్వయం అవసరం. ఇది ఆటోమెటిగ్‌గా ఏకాగ్రతను మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది' అంటున్నాడు బెంగళూరు చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ సందేశ్ సృజన్.

శివానిక్ దీక్షిత్, నయనిక, సందేశ్ సృజన్‌ల మాటలు శాస్త్రీయ నృత్యాల పట్ల యువతరం చూపుతున్న ఆసక్తికి అద్దం పడతాయి.

'మన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ నృత్యాల జాబితా పెద్దది. ప్రతి నృత్యానికి తనదైన వేషధారణ, అలంకరణ, సంగీతం ఉంటాయి. శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకునే విధానం చాలా కఠినమైనది. దీనికి తగిన సమయం, శక్తి అవసరం. శాస్త్రీయ నృత్యం నేర్చుకోవడానికి ఆసక్తి మాత్రమే కాదు అంకితభావం చాలా ముఖ్యం, నృత్యం అనేది శారీరక, మానసిక ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. శాస్త్రీయ నృత్య రూపాల శైలి ఒకదానికొకటి భిన్నంగా ఉన్నప్పటికీ అభ్యాస ప్రక్రియ కండరాలను బలోపేతం చేస్తుంది. భరత నాట్యం, కూచిపూడి, మోహినియాట్టంలాంటి శాస్త్రీయ నృత్యరూపాలను సాధన చేయడం ద్వారా మజిల్ ఇంప్రూమెంట్ ఉంటుంది. రెగ్యులర్ ప్రాక్టీస్ శరీరంలోని ఆక్సిజన్ స్థాయులను పెంచడంలో సహాయపడుతుంది' అంటుంది ప్రొఫెషనల్ క్లాసికల్ డ్యాన్సర్, ట్రైనర్ కీర్తి దివాకరన్. కేరళ కొచ్చీలోని వైనవి నృత్యకళాక్షేత్రం వ్యవస్థాపకురాలు కీర్తి. 'డ్యాన్సింగ్ అనేది న్యూరో-మస్క్యులార్ బ్యాలెన్స్‌ను వృద్ధి చేయడంలో సహాయపడుతుంది' అంటుంది క్లాసికల్ డ్యాన్సర్, ట్రైనర్, కోజికోడ్‌లోని గౌరీశంకరం క్లాసికల్ డ్యాన్స్ థెరపీ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రియా మేనన్.

శాస్త్రీయ నృత్య రూపకాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఎన్నో అధ్యయనాలు చెప్పాయి.

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ అప్లైడ్ రిసెర్చ్ పేపర్ ప్రకారం... ఏదైనా వర్కవుట్ పదినిమిషాల ఒడిస్సీ డ్యాన్స్‌తో సమానం. డ్యాన్స్‌లో భాగంగా కాళ్ల నుంచి మెడ వరకు అన్నీ కదులుతాయి. గంట ఒడిస్సీ నృత్యం 250 కేలరీలు ఖర్చు కావడానికి కారణం అవుతుంది.

'సైన్స్ అండ్ జర్నల్'లో ప్రచురితమైన రిసెర్చ్ పేపర్ ప్రకారం నాన్-డ్యాన్సర్‌లతో పోల్చితే కథక్ డ్యాన్సర్‌ల శరీర బరువు, బాడీ మాస్ ఇండెక్స్... మొదలైన వాటికి సంబంధించి బాడీ కంపోజిషన్ మెరుగ్గా ఉంటుంది. కథక్ డ్యాన్స్‌లోని క్విక్ ఫుట్ వర్క్ వల్ల ఒత్తిడి మాయం అవుతుంది.

వ్యాయమాలతో కూడిన డ్యాన్స్ అనగానే ఒకప్పుడు జాజ్, లైన్ డ్యాన్స్, హిప్ హప్, సల్సా... మొదలైన వెస్ట్రన్ డ్యాన్స్‌లు మాత్రమే గుర్తొచ్చేవి. 'ఎక్కడి దాకో ఎందుకు మన దగ్గరే బోలెడు శక్తిసంపద ఉంది' అని గ్రహించిన యువతరం మన శాస్త్రీయ నృత్యాలకు దగ్గరవుతోంది. సాధన చేస్తోంది. ఆరోగ్య భాగ్యానికి చేరువ అవుతోంది.

నృత్యం... ధ్యానసాధనం

'రోల్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ డ్యాన్స్ ఇన్ ఎడ్యుకేషన్' పేరుతో రిమ్లీ భట్టాచార్య ఒక ఆర్టికల్ రాసింది.

'భారతీయ శాస్త్రీయ నృత్యం మన విద్యా విధానంలో భాగంలో కావాలి. ఇది మన సంస్కృతికి సంబంధించిన శక్తిరూపమే కాదు అద్భుతమైన ధ్యాన సాధనం కూడా. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉండడానికి ఏకాగ్రత, సృజనాత్మకతను పెంపొందించడానికి శాస్త్రీయ నృత్యం ఉపయోగపడుతుంది. డ్యాన్స్ మూమెంట్స్‌తో శారీరక దృఢత్వం కలుగుతుంది. శరీరంపై నియంత్రణ పెరుగుతుంది. అంతర్గత భావాలను వ్యక్తీకరించే పద్ధతి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి' అంటుంది రిమ్లీ భట్టాచార్య.

మెకానికల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన రిమ్లీ ఎంబీఏ చేసింది. కార్పోరేట్ సెక్టార్‌లో పనిచేసింది. మానసిక ఆరోగ్యంపై ఎన్నో వ్యాసాలు రాసింది. 'ఏ బుక్ ఆఫ్ లైట్' పేరుతో పుస్తకం ప్రచురించింది.



క్యాటిల్ బెల్స్‌తో స్టూడెంట్స్‌కు శిక్షణ ఇస్తున్న బెనర్జీ

బాడీ బయో మెకానిక్స్

బాడీ బయోమెకానిక్స్‌ను బాగా అర్థం చేసుకోవడం డ్యాన్సర్ కమ్యూనిటీకి ముఖ్యం అంటుంది మధుమతి బెనర్జీ. భరతనాట్య కళాకారిణీ అయిన బెనర్జీ ఎన్నో దేశాలలో ప్రదర్శనలు ఇచ్చింది. ఇండియన్ క్లాసికల్ అండ్ ఫోక్ మ్యూజిక్‌లో కూడా ప్రావీణ్యం సాధించింది. శాస్త్రీయ నృత్యాలు నేర్చుకోవడానికి అవసరమైన స్ఫూర్తిని యువతరానికి ఇస్తోంది.



నాలుగో ర్యాంక్‌లో భారత పురుషుల హాకీ జట్టు

అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఒక స్థానం పడిపోయింది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా మూడు నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. గత ఏడాది ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం నెగ్గి భారత జట్టు నేరుగా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందింది. మరోవైపు భారత మహిళల జట్టు తొమ్మిదో స్థానంలో ఉంది. ఇటీవల జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు విఫలమై పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకోలేకపోయింది.

యశస్వి జైస్వాల్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో 712 పరుగులతో అదరగొట్టిన భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అవార్డు లభించింది. ఫిబ్రవరి నెలకుగాను యశస్వికి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారం దక్కింది. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు గెల్చుకున్న ఏడో భారత ప్లేయర్‌గా యశస్వి నిలిచాడు. గతంలో భారత్ నుంచి రిషభ్ పంత్, అశ్విన్, భువనేశ్వర్, శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లి, శుబ్‌మన్ గిల్‌లకు ఈ అవార్డులు లభించాయి.



ప్లే ఆఫ్స్‌కు బెంగళూరు

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఎలీస్ పెరీ

- 6 వికెట్లు తీయడంతోపాటు 40 పరుగులు చేసిన ఆర్‌సీబీ ప్లేయర్
- చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 7 వికెట్లతో నెగ్గిన బెంగళూరు


హర్మన్‌ప్రీత్ బౌల్డ్


ఎలీస్ పెరీ

న్యూఢిల్లీ: ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా దర్జాగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించింది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే గెలవాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్‌సీబీ జట్టు అదరగొట్టే ప్రదర్శన చేసింది. ఏడు వికెట్లతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను ఓడించిన బెంగళూరు చివరిదైన మూడో ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ముందుగా ముంబై ఇండియన్స్ 19 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌట్‌కాగా... బెంగళూరు 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ ఎలీస్ పెరీ అద్భుత ఆటతీరుతో బెంగళూరు విజయంలో కీలకపాత్ర పోషించింది. ముందుగా బంతితో మెరిసిన పెరీ 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టింది. అనంతరం బ్యాట్‌తో అదరగొట్టి 38 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో అజేయంగా 40 పరుగులు సాధించింది.

నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ గెలిస్తే 12 పాయింట్లతో లీగ్ టాపర్‌గా నిలిచి నేరుగా ఫైనల్‌కు అర్హత పొందుతుంది. ఫైనల్లో స్థానం కోసం ముంబై, బెంగళూరు జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఒకవేళ గుజరాత్ చేతిలో ఢిల్లీ ఓడిపోతే... ఢిల్లీ, ముంబై రెండు జట్లలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ఫైనల్ చేరుతుంది.

ముంబైతో మ్యాచ్‌లో టాస్ గెలిచిన బెంగళూరు ఫీల్డింగ్ ఎంచుకోగా... ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (23 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సజన (21 బంతుల్లో 30; 5 ఫోర్లు, 1 సిక్స్) 43 పరుగులు జోడించి ముంబైకు శుభారంభం ఇచ్చారు. అయితే ఆరో ఓవర్ చివరి బంతికి సోఫీ డివైన్ బౌలింగ్‌లో హేలీ అవుటవ్వడంతో ముంబై పతనం మొదలైంది. అనంతరం పెరీ తన పేస్ బౌలింగ్‌తో సజన, హర్మన్‌ప్రీత్ (0), అమెలియా కెర్ (2), అమన్‌జ్యోత్ (4), పూజ వస్త్రకర్ (6), నటాలీ సీవర్ బ్రంట్ (10)లను అవుట్ చేసింది. దాంతో ఒకదశలో 43/0తో ఉన్న ముంబై 82/7తో కష్టాల్లో పడింది. చివర్లో ప్రియాంక బాలా (19 నాటౌట్; 2 ఫోర్లు) రాణించడంతో ముంబై స్కోరు 100 దాటింది. 114 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. స్మృతి (11; 2 ఫోర్లు), సోఫీ మోలినెక్స్ (9; 2 ఫోర్లు), సోఫీ డివైన్ (4) తక్కు వ స్కోరుకే వెనుదిరిగారు. అయితే రిచా ఘోష్ (28 బంతుల్లో 36 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), పెరీ నాలుగో వికెట్‌కు 76 పరుగులు జోడించి బెంగళూరును విజయతీరాలకు చేర్చారు.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
ఢిల్లీ	7	5	2	10	0.918
ముంబై	8	5	3	10	0.024
బెంగళూరు	8	4	4	8	0.306
యూపీ	8	3	5	6	-0.371
గుజరాత్	7	2	5	4	-0.873

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

విదర్భ లక్ష్యం 538

- ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 418 ఆలౌట్
- ముషీర్ ఖాన్ సెంచరీ

ముంబై: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ టైటిల్‌ను 42వసారి దక్కించుకునేందుకు ముంబై జట్టు రంగం సిద్ధం చేసుకుంది. రెండుసార్లు విజేత విదర్భ జట్టుకు ఏకంగా 538 పరుగుల లక్ష్యాన్ని ముంబై నిర్దేశించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విదర్భ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 141/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై 130.2 ఓవర్లలో 418 పరుగులకు ఆలౌటైంది. యువ క్రికెటర్ ముషీర్ ఖాన్ (136; 10 ఫోర్లు) సెంచరీతో ఆకట్టుకోగా... కెప్టెన్ అజింక్య రహానే (73; 5 ఫోర్లు, 1 సిక్స్) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు మరో 15 పరుగులు జోడించి అవుటయ్యాడు. రహానే పెవిలియన్ చేరాక వచ్చిన శ్రేయస్ అయ్యర్ (111 బంతుల్లో 95; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి ఐదు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. ముషీర్, శ్రేయస్ నాలుగో వికెట్‌కు 168 పరుగులు జోడించారు. శార్దుల్ (0) డకౌట్‌కాగా... చివర్లో షమ్స్ ములానీ (50 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. విదర్భ జట్టు బౌలర్లలో హర్ష్ దూబే 5 వికెట్లు, యశ్ ఠాకూర్ 3 వికెట్లు పడగొట్టారు.


ముషీర్

సింధు శుభారంభం

తొలి రౌండ్‌లోనే ప్రణయ్, శ్రీకాంత్ పరాజయం

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. వ్యోన్ లీ (బెల్జియం)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు తొలి గేమ్‌ను 14 నిమిషాల్లో 21-10తో సొంతం చేసుకుంది. ఈ దశలో గాయం కారణంగా వ్యోన్ లీ వైదొలగడంతో సింధును విజేతగా ప్రకటించారు. ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 21-14, 13-21, 13-21తో సు లీ యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. ప్రపంచ నంబవర్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 9-21, 9-21తో పరాజయం పాలయ్యాడు. 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ ఏ దశలోనూ డెన్మార్క్ స్టార్‌కు పోటీనివ్వలేకపోయాడు. అక్సెల్‌సన్ చేతిలో శ్రీకాంత్‌కిది 11వ ఓటమి కావడం గమనార్హం.



జొకోవిచ్‌కు షాక్

ఇటలీ ప్లేయర్ లూకా నార్డీ సంచలనం



కాలిఫోర్నియా: ఐదేళ్ల తర్వాత ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బరిలోకి దిగిన ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. టాప్ సీడ్ హోదాలో పోటీపడ్డ ఈ సెర్బియా దిగ్గజం పోరాటం మూడో రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 123వ ర్యాంకర్ లూకా నార్డీ మూడో రౌండ్‌లో 6-4, 3-6, 6-3తో జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 20 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నార్డీ ఆరు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, జొకోవిచ్ సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ఈ గెలుపుతో మాస్టర్స్ సిరీస్, గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో జొకోవిచ్‌ను ఓడించిన అతి తక్కువ ర్యాంకర్‌గా నార్డీ గుర్తింపు పొందాడు.



నిశాంత్‌కు నిరాశ

క్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత బాక్సర్

బుస్టో అర్సిజియో (ఇటలీ): పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నమెంట్ నుంచి తొమ్మిది మంది భారత బాక్సర్లు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. బరిలో మిగిలిన చివరి బాక్సర్ నిశాంత్ దేవ్ (71 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. అమెరికా బాక్సర్ ఒమారి జోన్స్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 1-4తో ఓటమి చవిచూశాడు. మహిళల విభాగంలో భారత్ నుంచి ఇప్పటి వరకు నలుగురు బాక్సర్లు (నిఖత్ జరీన్, ప్రీతి పవార్, పర్వీన్ హుడా, లవ్లీనా) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందారు. మిగిలిన భారత బాక్సర్లకు ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందు రెండో అవకాశం ఉంది. మే 23 నుంచి జూన్ 3 వరకు థాయ్‌లాండ్‌లో జరిగే చివరిదైన రెండో క్వాలిఫయింగ్ టోర్నీలో సెమీఫైనల్ చేరితే భారత బాక్సర్లకు ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి.

పంత్ వచ్చేస్తున్నాడు...

ఐపీఎల్ కోసం సిద్ధమని ప్రకటించిన బీసీసీఐ ● పూర్తి ఫిట్ అని నివేదిక ఇచ్చిన వైద్యబృందం



న్యూఢిల్లీ: భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ జీవితంలో రెండో ఇన్నింగ్స్‌కు సిద్ధమవుతున్నాడు. 14 నెలల క్రితం కారు ప్రమాదంలో మృత్యువునకు చేరువగా వెళ్లి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డ పంత్ ఇప్పుడు మళ్లీ క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టనున్నాడు. ప్రమాదానంతర గాయాలన్నింటి నుంచి కోలుకొని పంత్ ఇప్పుడు పూర్తి ఫిట్‌గా మారాడని బీసీసీఐ ప్రకటించింది. అతను ఈనెల 22 నుంచి మొదలయ్యే ఐపీఎల్ 17వ సీజన్ టోర్నీలో బరిలోకి దిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది. 2022 డిసెంబర్ 30న ఉత్తరాఖండ్‌లోని రూర్కీ వద్ద పంత్ కారు ప్రమాదానికి గురయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గానే అతను ఐపీఎల్‌లో ఆడతాడు. 'కారు ప్రమాదం తర్వాత కోలుకునే ప్రయత్నంలో పంత్ 14 నెలల పాటు రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఐపీఎల్-2024 కోసం పంత్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా పూర్తిగా ఫిట్‌గా మారాడు. ఇటీవలే అతని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పంత్ ఫిట్‌నెస్ పరీక్షల్లో విజయవంతమయ్యాడు. దాంతో వైద్యబృందం 'రిటర్న్ టు ప్లే' అంటూ ఫిట్‌గా నిర్ధారించింది' అని బోర్డు స్పష్టం చేసింది. ఎన్‌సీఏలో సుదీర్ఘ సమయం పాటు పంత్ బ్యాటింగ్, కీపింగ్ ప్రాక్టీస్ చేస్తూ వచ్చాడు. అన్నీ సవ్యంగా సాగితే ఐపీఎల్ తర్వాత జరిగే టి20 ప్రపంచకప్ కోసం కూడా పంత్ పేరు పరిశీలించే అవకాశం ఉంది. మరోవైపు గతంలో ప్రకటించినట్లుగానే గాయం నుంచి కోలుకుంటున్న మొహమ్మద్ షమీ కూడా ఐపీఎల్‌కు దూరం కాగా... ఇటీవలే రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో గాయపడిన పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా ఐపీఎల్ నుంచి తప్పుకున్నట్లు బోర్డు వెల్లడించింది.


సినిమా



అది ఉద్దేశపూర్వకంగా చేసినది కాదు

- అల్ పచినో

ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో నంబర్ వన్ అవార్డుగా 'ఉత్తమ చిత్రం ' విభాగాన్ని భావిస్తారు. అందుకే ఈ విభాగపు అవార్డును వేడుకలో చివరిగా ప్రకటిస్తారు. అలాగే వేడుకలో చివరి మూమెంట్స్ కాబట్టి ఏదో ఒక డ్రామా క్రియేట్ చేస్తారు. కానీ అలాంటి డ్రామా గడిచిన ఆదివారం (భారత కాలమానం ప్రకారం సోమవారం) లాస్ ఏంజిల్స్‌లో జరిగిన 96వ ఆస్కార్ అవార్డ్స్ వేడుకలో కనిపించలేదు. 'ఉత్తమ చిత్రం' అవార్డును ప్రకటించిన ప్రముఖ నటుడు అల్ పచినో చాలా సాదాసీదాగా వెల్లడించేశారు. పోటీలో ఉన్న పది చిత్రాల పేర్లు చెప్పకుండా.. అవార్డు సాధించిన చిత్రాన్ని ప్రకటించేశారు. కవర్‌ని మెల్లిగా తెరుస్తూ.. 'నా కళ్లకు 'ఆపెన్‌హైమర్' కనిపిస్తోందని సింపుల్‌గా ప్రకటించారు. ఇలా చేయడం పట్ల హాలీవుడ్‌లోని కొందరు నటీనటులు, ఇతర ప్రముఖులు విముఖత వ్యక్తపరుస్తున్నారు. ఈ విషయంపై మంగళవారం అల్ పచినో స్పందించారు. ''ఆస్కార్ వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా పాల్గొనడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. ఇక వేడుకలో ఉత్తమ చిత్రం విభాగంలో విజేతగా నిలవడానికి పోటీ పడ్డ పది చిత్రాల పేర్లను నేను చదవక పోవడం పట్ల విమర్శలు వస్తున్నాయని తెలిసింది. కానీ ఇది నేను ఉద్దేశపూర్వకంగా చేసినది కాదు. అది ఆస్కార్ ప్రొడ్యూసర్ల నిర్ణయం. వేడుక ఆద్యంతం ఈ పది సినిమాల యూనిట్ వాళ్లు హైలైట్ అవుతూనే ఉన్నందువల్ల వారు ఇలా నిర్ణయించి ఉండొచ్చు. ఆస్కార్‌కు నామినేట్ కావడం అనేది ఎవరి జీవితంలోనైనా ఓ మంచి మైల్‌స్టోన్. ఫిల్మ్ ఇండస్ట్రీ వ్యక్తిగా నాకు ఈ విషయం తెలుసు. వారి పేర్లు ప్రస్తావించకపోవడం అనేది బాధకు గురి చేసే విషయమే. ఈ ఘటన పట్ల బాధపడిన వారికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను'' అని చెబుతూ ఓ స్టేట్‌మెంట్‌ను విడుదల చేశారు అల్ పచినో. ఇక ఉత్తమ చిత్రం విభాగంలో 'ఆపెన్‌హైమర్', 'అమెరికన్ ఫిక్షన్', 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్', 'బార్బీ', 'ది హోల్డోవర్స్', 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్', 'మేస్ట్రో', 'పాస్ట్ లీవ్స్', 'పూర్ థింగ్స్', 'ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్' సినిమాలు పోటీ పడగా, 'ఆపెన్‌హైమర్' అవార్డు దక్కించుకుంది.


● మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

కల్యాణి... వచ్చా వచ్చా...

'కల్యాణి.. వచ్చా వచ్చా...' అంటూ పాట పాడేస్తున్నారు విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'కల్యాణి.. వచ్చా వచ్చా...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. వివాహ వేడుకల్లో భాగంగా వచ్చే ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, కార్తీక్ పాడారు. 'కల్యాణి... వచ్చా వచ్చా, పంచ కల్యాణి తెచ్చా తెచ్చా.. సింగారీ చెయ్యందించా, ఏనుగంబారీ సిద్ధంగుంచా..' అంటూ ఈ పాట సాగుతుంది. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసూ వర్మ.


● ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్

మరింత నవ్వించాలనే ఈ సినిమా చేశాను

- 'అల్లరి' నరేశ్

''నాన్నగారి (ఈవీవీ సత్యనారాయణ) 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాకి, మా 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికి ఎటువంటి సంబంధం లేదు. జీవితంలో సెటిల్ కాకుండా పెళ్లి చేసుకునే హీరో కథ నాన్నగారి సినిమాలో ఉంటుంది. మా మూవీలో జీవితంలో స్థిరపడినా పెళ్లి కాని హీరో కథ. నా బలం వినోదం. ఈసారి మరింత నవ్వించాలని 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా చేశాను'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. మల్లి అంకం దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. కాగా ఈ మూవీ టీజర్‌ని హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ– ''ఆరోగ్యకరమైన కామెడీ ఉన్న ఎంటర్‌టైనర్ ఇది. మల్లిగారు క్లియర్ విజన్‌తో ఈ సినిమా తీశారు. రాజీవ్‌గారు ప్యాషన్‌తో నిర్మించారు'' అన్నారు. ''నిర్మాత కావాలన్న నా ఇరవై ఏళ్ల కల ఈ సినిమాతో నెరవేరింది'' అన్నారు రాజీవ్ చిలక. ''ఫ్యామిలీతో కలసి ఆనందంగా నవ్వుకుంటూ చూడదగ్గ చిత్రమిది'' అన్నారు మల్లి అంకం. ''ఈ సినిమాకి డైలాగ్స్ రాస్తున్నప్పుడు ఒక కిక్ వచ్చింది'' అన్నారు రచయిత అబ్బూరి రవి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ షురూ


● సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఆయన నటించనున్న 30వ సినిమాకి 'ధమాకా' ఫేమ్ త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించనున్నారు. 'ఎస్‌కే 30' (వర్కింగ్ టైటిల్) పేరుతో ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్‌పై రాజేశ్ దండా నిర్మించనున్నారు. ''పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఈ మూవీకి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ఈ మూవీలో త్రినాథరావు నక్కిన, ప్రసన్న కుమార్‌ల మార్క్ వినోదం ఉంటుంది'' అన్నారు మేకర్స్.

ప్రేమలు చూసి నవ్వుతూనే ఉన్నాను

- ఎస్ఎస్ రాజమౌళి

''సాధారణంగా నేను ప్రేమకథలు, రొమాంటిక్ కామెడీ చిత్రాలను ఇష్టపడను. నాదంతా యాక్షన్, ఫైట్స్ స్టైల్. మలయాళ 'ప్రేమలు' సినిమా బాగుంది.. తెలుగులో రిలీజ్ చేస్తున్నానంటూ మా అబ్బాయి కార్తికేయ చెప్పడంతో.. ఏదో ఉత్సాహపడుతున్నాడులే అనుకున్నాను. సినిమాకి వెళ్లాక తొలి పదిహేను నిమిషాల తర్వాతి నుంచి చివరి వరకూ నవ్వుతూనే ఉన్నాను'' అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి. నస్లేన్ కె. గఫూర్, మమిత బైజు, శ్యామ్ మోహన్, మాథ్యూ థామస్ కీలక పాత్రల్లో గిరీష్ ఏడీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమలు'. మలయాళంలో హిట్‌గా నిలిచిన ఈ మూవీని ఎస్ఎస్ కార్తికేయ ఈ నెల 8న తెలుగులో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సక్సెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ప్రేమలు' మూవీకి డైలాగులను అద్భుతంగా రాశాడు ఆదిత్య. కొంచెం అసూయ, కొంచెం బాధతో ఈ మాటను ఒప్పుకోవాలి. మలయాళ నటీనటులందరూ చాలా బాగా యాక్ట్ చేస్తారు. 'ప్రేమలు'లోని నటీనటులు అద్భుతంగా నటించారు'' అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, దర్శకులు అనిల్ రావిపూడి, అనుదీప్ కూడా మాట్లాడారు.


● నస్లేన్, మమిత, రాజమౌళి, కార్తికేయ, అనిల్


● అనుపమ

బహుమతిలాంటి సినిమా

విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్, హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించనున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాలో ధృవ్‌కు జోడీగా అనుపమా పరమేశ్వరన్ నటించనున్నట్లు మంగళవారం చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకుడు. రజనీకాంత్‌తో 'కాలా', 'కబాలి' వంటి సినిమాలు తీసిన దర్శకుడు పా. రంజిత్ ఈ సినిమాకు ఓ నిర్మాత. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ''నా కెరీర్‌కు ఓ మంచి బహుమతిలా ఈ చిత్రం ఉంటుందని భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు అనుపమా పరమేశ్వరన్. ''కబడ్డీ ఆట మూలాలను తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. మా టీమ్ సభ్యుల కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌లా ఈ చిత్రం ఉంటుంది'' అని మారి సెల్వరాజ్ పేర్కొన్నారు. కబడ్డీ ప్లేయర్ మానతీ గణేశన్ జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.

సుబ్రమణ్యం వినోదాలు


● రావు రమేష్

వైవిధ్యమైన పాత్రలు, విలక్షణ నటనతో ప్రేక్షకుల్ని అలరిస్తున్న రావు రమేష్ 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాతో హీరోగా మారారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్‌పై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. కాగా ప్రేక్షకులే ముఖ్య అతిథులుగా 'మారుతినగర్ సుబ్రమణ్యం' ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రావు రమేష్ మాట్లాడుతూ– ''మా సినిమా భలే గమ్మత్తుగా చాలా బాగుంటుంది. నటుడిగా నాకు ఈ స్థాయిని, ఈ స్థానాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులే మా మూవీ ఫస్ట్ లుక్ ఆవిష్కరిస్తే బాగుంటుందని రిలీజ్ చేయించాం'' అన్నారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. చక్కని భావోద్వేగాలు కూడా ఉన్నాయి'' అన్నారు లక్ష్మణ్ కార్య, బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య. ఈ చిత్రానికి కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శ్రీహరి ఉదయగిరి, సహ నిర్మాతలు: రుషి మర్ల, శివప్రసాద్ మర్ల.


● సల్మాన్ ఖాన్


● ఏఆర్ మురుగదాస్

కాంబినేషన్ సెట్

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, తమిళ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ మూవీ ఖరారైంది. ''ప్రతిభావంతులు ఏఆర్ మురుగదాస్, నా మిత్రుడు, నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాతో నేను చేయనున్న ఈ కొత్త సినిమా నాకు చాలా స్పెషల్. 2025 ఈద్‌కు సినిమాను రిలీజ్ చేస్తాం'' అని సల్మాన్ ఖాన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ''సల్మాన్, సాజిద్‌లతో సినిమా చేయనుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు ఏఆర్ మురుగదాస్.

వారసురాలు వస్తోంది

ప్రముఖ గాయకురాలు ఆశా భోంస్లే మనవరాలు జనై భోంస్లే నటిగా కెరీర్‌ను మొదలుపెట్టారు. హిందీలో 'భూమి', 'జునైద్' వంటి సినిమాలను నిర్మించిన సందీప్ సింగ్ దర్శకుడిగా మారి మెగాఫోన్ పట్టిన తొలి సినిమా 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ'. ఈ సినిమాలో లీడ్ రోల్ చేయనున్నారు జనై భోంస్లే. ''ఆశా భోంస్లే వారసురాలిగా జనై భోంస్లేను నా సినిమాతో పరిచయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. జనై వాయిస్ చాలా బాగుంటుంది. సంగీతంలో ప్రావీణ్యం ఉంది. మంచి డ్యాన్సర్ కూడా. ఈ చిత్రంలో ఆమె ఛత్రపతి శివాజీ భార్య రాణి సాయి బాయీ పాత్రలో కనిపిస్తారు'' అని చెప్పుకొచ్చారు సందీప్. 2026లో ఈ సినిమా విడుదల కానుంది.


● జనై భోంస్లే

సాక్షి బిజినెస్
బుధవారం
13-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
165	3
73,667	22,336

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,196	▲	177
డోజోన్స్	38,923	▲	153
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,747	▲	79
డాక్స్	17,965	▲	219
షాంఘై	3,056	▼	13
నికాయ్	38,792	▼	23

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,566	▼	80
బంగారం (99.5 స్వచ్ఛత)	65,303	▼	80
వెండి (కిలో)	72,675	▼	128

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.94	84.63
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.45	108.39
€	యూరో	ఎస్‌బీఐ	88.29	92.79
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	43.00	69.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.37	57.23
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.88	64.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.16	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.64	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.49

మార్చి 18 నుంచి ఫ్లై91 సర్వీసులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రాంతీయ విమానయాన రంగంలోకి ప్రవేశించిన ఫ్లై91.. వాణిజ్య సేవలను మార్చి 18 నుంచి ప్రారంభిస్తోంది. దీనిని పురస్కరించుకుని గోవా–అగట్టి మధ్య ప్రత్యేక విమానాన్ని మంగళవారం నడిపింది. తొలి దశలో గోవా, హైదరాబాద్, బెంగళూరు, సింధుదుర్గ్ మధ్య విమాన సర్వీసులు నడుపనున్నట్లు ఫ్లై91 ఎండీ, సీఈవో మనోజ్ చాకో తెలిపారు. ఆ తర్వాత అగట్టి (లక్షద్వీప్), పుణే, జల్గావ్, నాందేడ్ మధ్య సర్వీసులను జోడిస్తామన్నారు.

ఫార్మా సంస్థలకు కొత్త కోడ్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ లేదా వారి కుటుంబ సభ్యులకు బహుమతులు, విహార యాత్రలు వంటివి ఇవ్వకుండా ఫార్మా కంపెనీలు, వాటి పంపిణీదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లపై ఆంక్షలు విధిస్తూ కేంద్ర ఫార్మా విభాగం కొత్త నియమావళిని ప్రకటించింది. యూనిఫార్మ్ కోడ్ ఫర్ ఫార్మాస్యూటికల్స్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్ (యూసీపీఎంపీ) 2024ను నోటిఫై చేసింది. దీని ప్రకారం ప్రిస్క్రైబ్ చేసేందుకు అర్హత లేని వారికి ఉచిత శాంపిల్స్ ఇవ్వడాన్ని కూడా నిషేధించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
13-3-2024	
విశాఖ	450-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	433-00
విజయవాడ	433-00
రిటైల్ ధర (డజను)	72.00
12-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

జలన్ కల్రాక్ చేతికి జెట్ ఎయిర్‌వేస్

- యాజమాన్య బదిలీకి అనుమతి
- ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ ఆదేశాలు

న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యలతో మూతపడిన జెట్ ఎయిర్‌వేస్ రుణ పరిష్కార ప్రణాళికను దివాలా పరిష్కార అప్పీలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌ఏటీ) తాజాగా అనుమతించింది. జలన్ కల్రాక్ కన్సార్షియంకు కంపెనీ యాజమాన్యాన్ని బదిలీ చేసేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బదిలీని 90 రోజుల్లోగా పూర్తిచేయవలసిందిగా జెట్ ఎయిర్‌వేస్ పర్యవేక్షణ కమిటీకి సూచించింది. దీంతోపాటు పెర్ఫార్మెన్స్ బ్యాంక్ గ్యారంటీగా జలన్ కల్రాక్ కన్సార్షియం(జేకేసీ) చెల్లించిన రూ. 150 కోట్లను సర్దుబాటు చేయమంటూ జెట్ ఎయిర్‌వేస్ రుణదాతలను ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్ ఆదేశించింది. జెట్ ఎయిర్‌వేస్ కొనుగోలుకి గతంలో విజయవంతమైన బిడ్డర్‌గా జేకేసీ నిలిచిన సంగతి తెలిసిందే. అయితే జెట్ ఎయిర్‌వేస్ రుణదాతలు, జేకేసీ మధ్య యాజమాన్య బదిలీపై తలెత్తిన న్యాయ వివాదాలు ఏడాదికాలంగా కొనసాగుతున్నాయి.



ఇంతక్రితం కంపెనీ రుణదాతలు ఈ అంశంపై సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ జోక్యం చేసుకునేందుకు తిరస్కరించింది. అంతేకాకుండా నిర్ణయాధికారాన్ని ఎన్‌సీఎల్‌ఏటీకి అప్పగించింది. ఆర్థిక సవాళ్లతో జెట్ ఎయిర్‌వేస్ సర్వీసులు 2019 ఏప్రిల్ నుంచి నిలిచిపోగా.. 2021లో జేకేసీ విజయవంత బిడ్డర్‌గా నిలిచింది. కాగా.. కోర్టు అనుమతించిన రుణ పరిష్కార ప్రణాళిక(రూ. 350 కోట్ల ఆర్థిక మద్దతు)లో భాగంగా జెట్ ఎయిర్‌వేస్‌కు గతేడాది జలన్ కల్రాక్ కన్సార్షియం రూ. 100 కోట్ల పెట్టుబడులను సమకూర్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది(2024)లో కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని జెట్ ఎయిర్‌వేస్ యోచిస్తోంది.

ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ స్కీములకు ఫిర్యాదుల వెల్లువ

2022-23లో 68% అప్..

ముంబై: రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్ స్కీముల కింద వివిధ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. 2022–23లో ఇవి 68 శాతం పెరిగి 7.03 లక్షలుగా నమోదయ్యాయి. మొబైల్/ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్, రుణాలు, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు, పింఛను చెల్లింపులు, రెమిటెన్సులు మొదలైన వాటికి సంబంధించిన ఫిర్యాదులు వీటిలో ఉన్నాయి. ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవడం, ఆర్‌బీఐ–సమీకృత అంబుడ్స్‌మన్ స్కీము (ఆర్‌బీ–ఐవోఎస్) కింద దాఖలు చేసే ప్రక్రియను సరళతరం చేయడం తదితర అంశాలు ఫిర్యాదుల నమోదుకు దోహదపడ్డాయని అంబుడ్స్‌మన్ స్కీము వార్షిక నివేదిక పేర్కొంది. అత్యధికంగా 83.78 శాతం ఫిర్యాదులు (1,93,635) బ్యాంకులపై వచ్చాయి. అంబుడ్స్‌మన్ ఆఫీసులు 2,34,690 ఫిర్యాదులను హ్యాండిల్ చేశాయి. సమస్య పరిష్కారానికి పట్టే సమయం సగటున 33 రోజులకు మెరుగుపడింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇది 44 రోజులుగా ఉంది.



రూ. 10 లక్షల నుంచి రీట్స్‌లో పెట్టుబడులు

స్మాల్ రీట్స్ నిబంధనలపై నోటిఫికేషన్

న్యూఢిల్లీ: రియల్టీ అసెట్స్‌లో కనీసం రూ. 10 లక్షల నుంచి పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పిస్తూ చిన్న, మధ్య స్థాయి రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌ల (ఎస్‌ఎం రీట్స్) ఫ్రేమ్‌వర్క్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నోటిఫై చేసింది. ఇందుకోసం రీట్స్ నిబంధనలను సవరించింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం ఎస్‌ఎం రీట్‌లో యూనిట్ కనీస ధర రూ. 10 లక్షలు లేదా సెబీ సూచించే విధంగా ఉంటుంది. అలాగే సదరు స్కీము కింద కొనుగోలు చేసే అసెట్ విలువ రూ. 50 కోట్లు–రూ. 500 కోట్ల మధ్యలో ఉండాలి.



ద్రవ్యోల్బణం దారికి... పరిశ్రమ పక్కకు!

- ఎకానమీ మిశ్రమ గణాంకాలు
- నాలుగు నెలల కనిష్టానికి ఫిబ్రవరి రిటైల్ ధరలు
- 3.8 శాతానికి పరిమితమైన జనవరి పారిశ్రామిక ఉత్పత్తి

న్యూఢిల్లీ: భారత్ స్థూల ఆర్థిక రంగానికి సంబంధించి మంగళవారం మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ కీలక రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 5.09 శాతంగా నమోదయ్యింది. గడచిన నాలుగు నెలల్లో ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న వాస్తవిక లక్ష్యానికి (ప్లస్ 2 లేదా మైనస్ 2తో 4 శాతం) ఇంకా అధికంగా ఉన్నప్పటికీ.. నాలుగు నెలల కనిష్టానికి సూచీ దిగిరావడం గమనార్హం. అలాగే గరిష్ట లక్ష్యానికన్నా (6 శాతం) దిగువన ఉండడం హర్షణీయ పరిణామం. కాగా, జనవరిలో 8.3 శాతంగా ఉన్న ఫుడ్ బాస్కెట్ ధర, సమీక్షా నెల ఫిబ్రవరిలో 8.66 శాతానికి ఎగసింది. ఇక పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి 2024 జనవరిలో 3.8 శాతానికి మందగించింది. 2023 ఇదే నెలలో ఈ వృద్ధి రేటు 5.8 శాతంగా ఉంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 70 శాతం వెయిటేజ్ ఉన్న తయారీసహా మైనింగ్, విద్యుత్ రంగాలు పేలవ పనితనాన్ని ప్రదర్శించినట్లు గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ విడుదల చేసిన లెక్కలు తెలిపాయి. 2023 డిసెంబర్‌లో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతంకాగా, నవంబర్‌లో 2.4 శాతం.



వివిధ రంగాలు ఇలా...(వృద్ధి/క్షీణ రేట్లు శాతాల్లో)

పరిశ్రమ	2024 జనవరి	2023 జనవరి	2023 డిసెంబర్
తయారీ	3.2	4.5	3.9
విద్యుత్	5.6	12.7	1.2
మైనింగ్	5.9	9.0	- 5.1
క్యాపిటల్ గూడ్స్	4.1	10.5	- 3.2
కన్జూమర్ డ్యూరబుల్స్	10.9	-8.2	4.8
కన్జూమర్ నాన్–డ్యూరబుల్స్	- 0.3	6.5	2.1
మౌలిక/నిర్మాణ	- 4.6	11.3	- 4.1
ప్రైమరీ గూడ్స్	2.9	9.8	4.6
ఇంటర్మీడియట్ గూడ్స్	4.8	1.4	3.4

- 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకూ చూస్తే... ఐఐపీ 5.9 శాతం పురోగమించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ సూచీ 5.5 శాతంగా ఉంది.

మార్కెట్.. గణాంకాల అప్రమత్తత

స్వల్ప లాభాల ముగింపు

ముంబై: రిటైల్ ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో 662 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 165 పాయింట్ల లాభంతో 73,667 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 502 పాయింట్లు పెరిగి 74,004 వద్ద గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 197 పాయింట్ల రేంజ్‌లో కదలాడి 22,256 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి మూడు పాయింట్ల లాభంతో 22,336 వద్ద నిలిచింది.



- ఇంటిగ్రేటెడ్ మార్కెటింగ్ సేవల సంస్థ ఆర్‌కే స్వామి లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.288)తో పోలిస్తే 12.50% డిస్కౌంట్‌తో రూ.252 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 14% నష్టపోయి రూ.248 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 9% నష్టంతో రూ.263 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.1,329 కోట్లుగా నమోదైంది.

- భారత్ హైవేస్ ఇన్విట్ ఐపీఓ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. ఎన్‌ఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.100)తో పోలిస్తే ఒక శాతం ప్రీమియంతో రూ.101 వద్ద లిస్టయ్యింది. చివరికి 3% లాభపడి రూ.103 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 4,567 కోట్లుగా నమోదైంది.

యుటిలిటీ వాహనాలదే హవా



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 2024 ఫిబ్రవరిలో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన (హోల్‌సేల్) ప్యాసింజర్ వాహనాలు 3,70,786 యూనిట్లు నమోదయ్యాయి. 2023 ఫిబ్రవరితో పోలిస్తే హోల్‌సేల్‌లో గత నెలలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 11 శాతం పెరిగాయి. యుటిలిటీ వాహనాలకు బలమైన డిమాండ్ ఈ జోరుకు కారణమని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) తెలిపింది. సియామ్ గణాంకాల ప్రకారం.. హోల్‌సేల్‌లో ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా యుటిలిటీ వెహికల్స్ 38 శాతం దూసుకెళ్లి 1,91,435 యూనిట్లకు చేరాయి. ప్యాసింజర్ కార్లు 18 శాతం క్షీణించి 1,15,937 యూనిట్లకు పరిమితం అయ్యాయి.

జాబ్ పాయింట్

యూపీఎస్సీ–ఈఎస్‌ఐసీలో 1930 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1930
» **అర్హత:** బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత ఉండాలి. స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి లేదా డిప్లొమా(జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ), స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సు లేదా నర్సు, మిడ్‌వైఫ్‌గా రిజిస్టరై ఉండాలి. కనీసం యాభై పడకల ఆసుపత్రిలో ఒక సంవత్సరం పనిచేసిన అనుభవం ఉండాలి.
» **వయసు:** 27.03.2024 నాటికి అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 30 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 33 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 35 ఏళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు. పెన్–పేపర్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 28.03.2024 నుంచి 03.04.2024.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

ఏపీపీఎస్సీ 37 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ ఫారెస్ట్ సర్వీస్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **అర్హత:** అగ్రికల్చర్, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ అప్లికేషన్స్ / కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ (అగ్రికల్చర్ / కెమికల్/ సివిల్/ కంప్యూటర్ /ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్/ మెకానికల్), ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫారెస్ట్రీ, జియాలజీ, హార్టికల్చర్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, వెటర్నరీ సైన్స్, జువాలజీ సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **పరీక్ష విధానం:** మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్ ఆఫ్‌లైన్ విధానంలో(ఓఎంఆర్) జరుగుతుంది. జనరల్ స్టడీస్–మెంటల్ ఎబిలిటీ అండ్ మ్యాథమేటిక్స్–75 మార్కులు, జనరల్ ఫారెస్ట్రీ–1, 2 సబ్జెక్ట్సులో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. మెయిన్ పరీక్ష సీబీటీ విధానంలో జరుగుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**15.04.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.05.2024
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఏపీపీఎస్సీ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **అర్హత:** బీ.ఆర్క్ లేదా బీఈ(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ డిగ్రీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.61,960 నుంచి రూ.1,51,370.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్(సీపీటీ) ద్వారా ఎంపికచేస్తారు. మొత్తం 450 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్–1(జనరల్ స్టడీస్ –మెంటల్ ఎబిలిటీ)–150 మార్కులు, పేపర్ –2(టౌన్ ప్లానింగ్–1)–150 మార్కులు, పేపర్–3(టౌన్ ప్లానింగ్–2)–150 మార్కులు ఉంటాయి. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 21.03.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 10.04.2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

సెంట్రల్ వర్సిటీల్లో.. డిగ్రీకి మార్గం

ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకొని ప్రముఖ విద్యాసంస్థల్లో బ్యాచిలర్ డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు చక్కటి అవకాశం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్ (సీయూఈటీ-యూజీ)! ఈ పరీక్షలో స్కోర్‌తో దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లోని డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు ఉత్తమ వేదికలు సెంట్రల్ యూనివర్సిటీలు!! తాజాగా 2024-25 ప్రవేశాలకు సంబంధించి సీయూఈటీ-యూజీ-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ యూజీ వివరాలు, పరీక్ష విధానం, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» సీయూఈటీ-యూజీ 2024 నోటిఫికేషన్ విడుదల
» మే 15 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు
» ఒకే స్కోర్‌తో పలు వర్సిటీలకు దరఖాస్తు అవకాశం

దేశంలో ప్రస్తుతం 44సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిల్లో చేరేందుకు వేర్వేరు పరీక్షలు రాయాల్సిన అవసరం లేదు. ఒకే ఒక్క పరీక్ష (సీయూఈటీ–యూజీ)లో స్కోర్ ఆధారంగా అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనివల్ల విద్యార్థులకు ఆర్థిక భారం, సమయాభావం వంటి సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

సీయూఈటీ-యూజీ ఇలా

- సీయూఈటీ–యూజీ పరీక్ష.. మొత్తం 61 సబ్జెక్టులు/విభాగాల్లో పరీక్ష ఉంటుంది. 33 లాంగ్వేజ్‌లు, 27 డొమైన్ సబ్జెక్ట్స్, ఒక జనరల్ టెస్ట్ నిర్వహిస్తారు. పరీక్ష నాలుగు సెక్షన్‌లలో 200 మార్కులకు ఉంటుంది. సెక్షన్–1ఎ(లాంగ్వేజెస్)–50 ప్రశ్నలు, సెక్షన్–1బి(లాంగ్వేజెస్)–50 ప్రశ్నలు, సెక్షన్–2 (డొమైన్ సబ్జెక్ట్స్)–50 ప్రశ్నలు, సెక్షన్–3 జనరల్ టెస్ట్–60 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్ విభాగాలు, డొమైన్ సబ్జెక్ట్ విభాగంలో 50 ప్రశ్నలకు గాను 40 ప్రశ్నలు చొప్పున సమాధానం ఇస్తే సరిపోతుంది. జనరల్ టెస్ట్ పేరుతో 60 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. పరీక్షకు లభించే సమయం 45 నిమిషాలు. మ్యాథమెటిక్స్, అప్లైడ్ మ్యాథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ ప్రాక్టీసెస్‌ను ఎంచుకున్న వారికి జనరల్ టెస్ట్‌తో కలిపి 60 నిమిషాల్లో పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. ప్రతి ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది.
- అభ్యర్థులు లాంగ్వేజెస్, డొమైన్ సబ్జెక్ట్స్, జనరల్ టెస్ట్ మూడు విభాగాలు కలిపి.. గరిష్టంగా ఆరు సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం ఉంది. ఈ సబ్జెక్ట్‌లలో అభ్యర్థులు తమ అర్హతకు సరితూగే సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్‌లో గరిష్టంగా ఆరు సబ్జెక్ట్‌లను ఎంచుకునే వీలుంది. నిబంధనలను అనుసరించి 4 లేదా 5 డొమైన్ సబ్జెక్ట్‌లను, ఒక జనరల్ టెస్ట్, ఒకటి లేదా రెండు లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.

డొమైన్ సబ్జెక్ట్‌లు

మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటి వివరాలు.. అకౌంటెన్సీ/బుక్ కీపింగ్; అగ్రికల్చర్; ఆంత్రోపాలజీ; బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయో



కెమిస్ట్రీ; బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్; ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్; ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్; జాగ్రఫీ /జియాలజీ; హిస్టరీ; హోమ్‌సైన్స్; నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా; లీగల్ స్టడీస్; మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్; మ్యాథమెటిక్స్; పెర్ఫార్మింగ్ ఆర్ట్స్; ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా; ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్; సైకాలజీ; సంస్కృతం; టీచింగ్ ఆప్టిట్యూడ్.

లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు

అస్సామీ, బెంగాలీ, ఇంగ్లిష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మళయాలం, మరాఠి, తమిళం, పంజాబీ, ఒడియా, తెలుగు, ఉర్దూ లాంగ్వేజ్ సహా మొత్తం 33 లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

సెంట్రల్ వర్సిటీల ప్రవేశ విధానం

సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఆయా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ తదితరాల ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

44 వర్సిటీలు.. తెలుగు రాష్ట్రాల్లో 5

సీయూఈటీ–యూజీ–2024 స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో మొత్తం 44 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశ అవకాశం లభిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ; తెలంగాణలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలు ఈ ఏడాది సీయూఈటీ- యూజీ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్

సీయూఈటీ–యూజీ స్కోర్‌తో సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు మరెన్నో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఎన్‌ఐటీ యూనివర్సిటీ, బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగానే గత ఏడాది ప్రవేశాలు కల్పించాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మార్చి 26
- దరఖాస్తు సవరణ అవకాశం: మార్చి 28 -మార్చి 29
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: మే రెండో వారంలో
- సీయూఈటీ–యూజీ పరీక్ష తేదీలు: మే 15 నుంచి మే 31 వరకు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/CUETUG

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. డొమైన్ సంబంధిత సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి. లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజెస్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. దీంతోపాటు రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో పట్టు సాధించాలి.

జనరల్ టెస్ట్

ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

సిలికాన్ వ్యాలీకి దీటుగా విశాఖ

- గ్రోత్ కారిడార్‌గానూ వృద్ధి
- పుష్కలంగా వనరులు, వసతులు
- సీఎం వైఎస్ జగన్ పాలనలో వైజాగ్‌కు మహర్దశ
- 'విజన్ విశాఖ కాంక్లేవ్'లో నిపుణులు



సదస్సులో మాట్లాడుతున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: 'అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి దీటుగా విశాఖ రూపుదిద్దుకుంటోంది. ఆ దిశగా అభివృద్ధిలో శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రపంచస్థాయి ప్రఖ్యాత నగరాలతో పోటీపడేందుకు అవసరమైన అన్ని వనరులు, మౌలిక వసతులు, హంగులు, సదుపాయాలు ఈ నగరానికి ఉన్నాయి. ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైజాగ్‌కు మహర్దశ పట్టింది. గ్రోత్ కారిడార్‌గానూ వృద్ధి చెందుతోంది. పరిపాలనా రాజధాని అయ్యాక అభివృద్ధిలో మరింత వేగం పుంజుకుంటుంది. రూ.వేల కోట్ల పెట్టుబడులతో విశాఖ మహానగరం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. రానున్న పదేళ్లలో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలతో పోటీ పడేలా ఎదుగుతుంది' అని 'విజన్ విశాఖ కాంక్లేవ్'లో విద్యారంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, మేధావులు పేర్కొన్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. అమెరికా సిలికాన్ వ్యాలీ జీడీపీ వృద్ధిలో అగ్రగామిగా ఉందని, విశాఖపట్నం కూడా అందుకు తీసికట్టు కాదని చెప్పారు. అక్కడ అభివృద్ధిలో స్టాన్‌ఫోర్డు యూనివర్సిటీ మాదిరిగానే ఇక్కడ ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) కూడా దోహదపడుతోందని, సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఏయూలో గొప్ప మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. 'విశాఖలో భారీ పరిశ్రమలు, స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, తూర్పు నావికదళ ప్రధాన కేంద్రం, బీహెచ్‌ఈఎల్, పోర్టులతో పాటు రోడ్డు, రవాణా సదుపాయాలు మెండుగా ఉన్నాయి. వేలాది ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటా సెంటర్, బీచ్ కారిడార్‌లు వస్తున్నాయి. విశాఖ–హైదరాబాద్, విజయవాడ–కడప–బెంగళూరులకు హైస్పీడ్ రైల్ కారిడార్ కోసం ప్రధానితో చర్చిస్తానని సీఎం చెప్పారు. అడగకుండానే విశాఖ అభివృద్ధికి తపించే ముఖ్యమంత్రి మనకున్నారు. ఆయనకు మనమంతా సహకరిద్దాం. రూ.వేల కోట్ల పెట్టుబడులతో విశాఖ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. గ్రోత్ కారిడార్‌గా మారుతుంది. వచ్చే పదేళ్లలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో విశాఖ పోటీ పడుతుంది' అని ప్రసాదరెడ్డి వివరించారు. కాంక్లేవ్‌లో ఏయూ రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఇన్నిటం మీడియా సీఈవో రాహుల్ రాఘవేంద్ర, స్టూడెంట్ ట్రైబ్ సీఈవో సాయిచరణ్, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్, ఐబీఎం విశాఖ ఫీల్డ్ సీఈవో గుహేష్ రామనాథన్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖకు ప్రచారం అక్కర్లేదు



విశాఖకు ప్రచారం అక్కర్లేదు. ఇక్కడి వారంతా వైజాగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లే. ఇక్కడ ప్రఖ్యాత పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, కేంద్ర ప్రభుత్వ, రక్షణరంగ సంస్థలు, విద్యా సంస్థలు ఎన్నో ఉన్నాయి. విశాఖ ఎందరికో మంచి అవకాశాలు కల్పిస్తోంది. అందుకే ఈ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది.

– టీకే సాహు, చైర్మన్, నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

ఆకర్షణీయ నగరం



విశాఖ పెట్టుబడులను ఆకర్షించే నగరం. ఇక్కడ ఉన్నన్ని వనరులు రాష్ట్రంలో మరెక్కడా లేవు. అన్ని రవాణా సదుపాయాలూ ఉన్నాయి. ఇన్ని అవకాశాలు ఉండటంతో పరిశ్రమలు పెద్దసంఖ్యలో ఏర్పాటవుతున్నాయి. వ్యాపార ఉన్నతికి విశాఖ భాగ్యనగరం.

– అంజనేయవర్మ, వైస్ ప్రెసిడెంట్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్

విశాఖ అభివృద్ధికి జగన్ కృషి



పుష్కలమైన వనరులతో ఇప్పటికే విశాఖ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందింది. మంచి కనెక్టివిటీ ఉంది. ఇప్పటివరకు రాష్ట్రాన్ని మంచిగా ఐదారుగురు ముఖ్యమంత్రులు పాలించారు. వీరిలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ స్ట్రాంగ్ లీడర్. రాష్ట్రంతోపాటు విశాఖ అభివృద్ధికిపాటు పడుతున్నారు.

– డి.సూర్యప్రకాశరావు, వీసీ, డీఎస్ఎన్ లా విశ్వవిద్యాలయం

విశాఖకు రెండు వందేభారత్ రైళ్లు

- వాల్తేరు డివిజన్‌లో పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన మోదీ
- ఏలూరులో అభివృద్ధి పనులను ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్


ఏలూరులో గూడ్స్ షెడ్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ నజీర్, చిత్రంలో కలెక్టర్ వెంకటేష్ తదితరులు

ఏలూరు (టూటౌన్)/విశాఖ సిటీ/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విశాఖపట్నం–భువనేశ్వర్, సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ రైళ్లను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మంగళవారం ఉదయం అహ్మదాబాద్ నుంచి వర్చువల్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రెండు రైళ్లతోపాటు వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రాజెక్టులను సైతం ప్రధాని మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కోరాపుట్ సెక్షన్‌లో దుమురిపుట్ వద్ద రూ.3.5 కోట్లతో నిర్మించిన గూడ్స్ షెడ్‌ను, కొత్తవలస–కోరాపుట్ డబ్లింగ్ లైన్, కొత్తవలస–కోరాపుట్ సెక్షన్‌లో బొడ్డవర వద్ద నిర్మించిన 7.3 కిలోమీటర్ల లైన్, కోరాపుట్–రాయగడ సెక్షన్‌లో నిర్మించిన 14.6 కిలోమీటర్ల డబ్లింగ్ లైన్, విజయనగరం–టిట్లఘర మధ్య 9.2 కిలోమీటర్ల మేర 3వ లైన్, విజయనగరంలో రైలు కోచ్ రెస్టారెంట్‌లను కూడా ప్రధాని ప్రారంభించారు. దువ్వాడ, సింహాచలం, విశాఖ, కొత్తవలస, తిలారు, బొబ్బిలి, విజయనగరం, చీపురుపల్లి, అరకు, బొర్రా గుహలు, పార్వతీపురం, కోరాపుట్, జైపూర్, రాయగడ రైల్వేస్టేషన్‌ల్లో 'వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్' స్టాళ్లను కూడా వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఎస్‌వీ సూర్యనారాయణ, కుటికుప్పల సూర్యారావు, డీఆర్‌యూసీసీ సభ్యుడు ఎం.శేషగిరిరావు, ఏపీటీడీసీ డివిజనల్ టూరిజం మేనేజర్ హరిత, ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

ఏలూరులో అభివృద్ధి పనులను ప్రారంభించిన గవర్నర్

ఏలూరు రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మంగళవారం ప్రారంభించారు. రూ.5 కోట్లతో ఆధునికీకరించిన గూడ్స్ షెడ్‌ను, వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. గవర్నర్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.మేరీప్రశాంతి, విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనుంజయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధిపైనా 'పచ్చ'పాతమే

పనులు జరుగుతున్నా ఆగిపోయినట్లు రామోజీ దుష్ప్రచారం

- గడప గడపకు మన ప్రభుత్వంలో 65,857 ప్రాధాన్యత పనులు మంజూరు
- ఇప్పటికే రూ.1100.78 కోట్ల విలువైన 30,025 పనులు పూర్తి
- కొనసాగుతున్న 1978.46 కోట్ల విలువైన పనులు
- ఎప్పటికప్పుడు పూర్తయిన పనుల వివరాలు, బిల్లుల అప్‌లోడ్


సాక్షి, అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వేల కోట్ల నిధులు విడుదల చేస్తుంటే.. రామోజీ మాత్రం కడుపు మంటతో అబద్ధాలు అచ్చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన ప్రాధాన్యత పనులను చేస్తున్నా.. అక్కసుతో అడ్డమైన రాతలు రాస్తున్నారు. 'గడప గడపకు బోల్తా' అంటూ పచ్చి అవాస్తవాలతో ఈనాడులో అవాస్తవాలను ప్రచురించారు. చంద్రబాబు హయాంలో గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనను ఏ మాత్రం పట్టించుకోకపోయినా రామోజీ ఒక్క కథనం రాయలేదు.

ఆరోపణ: రూ. 3 వేల కోట్ల పనుల్లో మొదలైనవి రూ.వెయ్యి కోట్ల పనులే..

వాస్తవం: వైఎస్ జగన్ సర్కారు గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా ఆ పరిధిలోని ఇళ్లకు మంత్రులు, ఎమ్మెల్యేలను పంపించి వారి సమస్యలు తెలుసుకుంది. అక్కడి ప్రజలకు అవసరమైన అత్యంత ప్రాధాన్యత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఒక్కో గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అసలు గ్రామాలు, వార్డుల ముఖం చూసిన పాపాన పోలేదు. ప్రజలకు అవసరమైన పనులు చేపట్టకుండా నీరు–చెట్టు పేరుతో నామినేషన్లపై వేల కోట్లు పచ్చ నేతలు జేబులు నింపుకున్నారు. ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల్లో వేల సంఖ్యలో పనులు జరుగుతున్నా ఈనాడు రామోజీ అక్కసు వెళ్లగక్కారు. రూ.1000 కోట్ల విలువైన పనులు కూడా ప్రారంభం కాలేదని అవాస్తవలు ప్రచురించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన అత్యంత ప్రాధాన్యత పనుల్లో ఇప్పటికే రూ.1100.78 కోట్ల విలువైన 30,025 పనులు పూర్తయ్యాయి. మరో 1978.46 కోట్ల విలువైన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఆరోపణ: 65 వేల పనుల్లో 25 వేల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు..

వాస్తవం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 11,753 సచివాలయాల పరిధిలో 65,857 పనులను మంజూరు చేశారు. వాటిలో చాలా పూర్తి కాగా.. మరికొన్ని కొనసాగుతున్నాయి. స్థానికంగా ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత పనులను మంత్రులు, ప్రజాప్రతినిధులు గుర్తించిన వెంటనే ఆ పనుల వివరాలను గడప గడపకు మన ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అప్‌లోడ్ చేసిన పనుల తక్షణ మంజూరు నిరంతరంగా కొనసాగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అత్యంత ప్రాధాన్యత పనుల కోసం ఒక్కో గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రూ.3000 కోట్లను పరిపాలన మంజూరు చేశారు. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపు చేస్తున్నారు. అత్యంత ప్రాధాన్యత పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పూర్తి అయిన పనుల బిల్లులను సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి నిబంధన ప్రకారం చెల్లింపులు చేయాలని డీడీఓలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పనులు పూర్తయిన వాటికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపు చేస్తున్నారు. పనులు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ తెలిపారు.



'మెంటార్ ది యంగ్ మైండ్స్'కు శ్రీకారం

పీజీ విద్యార్థుల కోసం ఉద్యాన వర్సిటీ వెబినార్

సాక్షి, అమరావతి: పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం దేశంలోనే తొలిసారి 'మెంటార్ ది యంగ్ మైండ్స్' కార్యక్రమానికి వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయిలో వివిధ రంగాల నిపుణులతో అతిథి ఉపన్యాసాలు ఇప్పించడం ద్వారా పీజీ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉద్యాన రంగంలో శాస్త్రవేత్తలు, నిపుణులను అనుసంధానిస్తారు. ప్రాజెక్టులో భాగంగా మంగళవారం నిర్వహించిన తొలి వెబినార్‌ను యూనివర్సిటీ వీసీ తోలేటి జానకిరామ్, డైరెక్టర్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్.సూర్యకుమారి ప్రారంభించారు. 'నావిగేటింగ్ ది పాత్ వేస్ ఆఫ్ రీసెర్చ్ పబ్లికేషన్స్ ఇన్ స్కోపస్–ఇండెక్స్‌డ్ జర్నల్స్' అనే అంశంపై న్యూఢిల్లీలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) డైరెక్టర్ ఆఫ్ పర్సనల్ సంజయ్ కె.ద్వివేది ప్రసంగించారు. డీన్ ఎస్ఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డి.సలోమి సునీత పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల తలరాతలు మార్చిన సీఎం జగన్

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య

సాక్షి, అమరావతి: నాయీ బ్రాహ్మణుల తలరాతలు మార్చిన సీఎంగా వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూపొందిన క్యాలెండర్‌ను సీఎం జగన్ ఆవిష్కరించినట్లు ఆయన చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాయం వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ఈ రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులకు వైఎస్ జగన్ మేలు చేశారని, వారిని ఆర్థికంగా స్థితిమంతుల్ని చేయడమే కాకుండా రాజకీయ భవిష్యత్తు కూడా కల్పించారని పుల్లయ్య అన్నారు. ఎప్పుడూ ప్రవేశం లేని ఆలయాల్లోకి కూడా ప్రవేశాలు కల్పించారన్నారు. అన్ని దేవాలయాల్లో బోర్డు సభ్యులుగా నాయీ బ్రాహ్మణులు తప్పనిసరిగా ఉండాలని గవర్నర్ చేత ఆర్డినెన్స్ చేయించిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులంతా సీఎం జగన్ వైపే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రకాష్, మల్కాపురం కనకారావు, నాయీ బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

తీర ప్రాంత శోధన కోసం ఎన్‌సీసీఆర్ కేంద్రం

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు


ఎన్‌సీసీఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎం.రవిచంద్రన్

పెదగంట్యాడ (విశాఖపట్నం): సముద్ర జలాల నాణ్యతను పర్యవేక్షించడంతో పాటు ప్రిడిక్షన్ ఆఫ్ కోస్టల్ వాటర్ క్వాలిటీ (పీడబ్ల్యూక్యూ), ఎకో సిస్టం, సముద్ర తీర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పరిశోధనలు చేసేందుకు ఎన్‌సీసీఆర్ ప్రధాన భూమిక పోషిస్తుందని కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. మంగళవారం యారాడలోని డాల్ఫిన్ నోస్‌పై కొత్తగా నిర్మించిన మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ అనుబంధ సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ (ఎన్‌సీసీఆర్) కేంద్రాన్ని ఢిల్లీ నుంచి ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. 5.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.78 కోట్లతో నిర్మించిన ఈ కేంద్రంలో మరో 6నెలల్లో రీసెర్చ్‌కు అవసరమైన పరికరాలను సిద్ధం చేస్తామన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా తీర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో విపత్తులు ఎక్కువయ్యాయని, ఇటీవల సంభవించిన తుపాన్ల వల్ల ముంబై, చెన్నై వంటి నగరాలు వణికిపోయాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో 972 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న తీర ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించి, తీరం వెంబడి ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా పరిశోధనలు చేయాలని మినిస్ట్రీస్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్ కోరారు. ఇప్పటివరకూ ఎన్‌సీసీఆర్ కేంద్రాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎన్విరాన్‌మెంట్ విభాగంలో నిర్వహిస్తూ వస్తున్నామని, ఇకపై ఈ భవనంలోకి దానిని తరలించనున్నామని ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ ఎంవీ రమణమూర్తి చెప్పారు. అనంతరం ఈ కేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటరాలజీ (ఐఐటీఎం), ఎంవోఈఎస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కృష్ణన్, ఎంవోఈఎస్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్, సీపీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు, పలువురు శాస్త్రవేత్తలు, రీసెర్చ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువ పత్రాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- క్షేత్రస్థాయిలో జనన, మరణ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సకాలంలో జరిగేలా చర్యలు
- జనన మరణ రిజిస్ట్రేషన్ చట్టం–2023పై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష



సాక్షి, అమరావతి: జనన, మరణ నమోదు (సవరణ చట్టం–2023)పై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరిగే జనన, మరణ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ పత్రాలను నియంత్రించేందుకు పాత రికార్డులను డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఈ చట్టానికి సంబంధించి పూర్తి స్థాయి నిబంధనలు, మార్గదర్శకాల నోటిఫికేషన్ వచ్చేలోగా క్షేత్ర స్థాయి అధికారులందరికీ ఈ చట్టంపై పూర్తి అవగాహన కోసం తగిన సమాచారాన్ని అందించాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. జననాలతో పాటు మరణాలు కూడా గ్రామ, మున్సిపాలిటీల స్థాయిలోను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల సహా ప్రతి చోటా సకాలంలో సక్రమంగా రిజిస్టర్ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్య మిత్రల ద్వారా జనన, మరణ రిజిస్ట్రేషన్ల నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కొత్త చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. ఈ నూతన చట్టం ప్రకారం విద్యా సంస్థల్లో ప్రవేశానికి, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు జాబితా సవరణ, వివాహ రిజిస్ట్రేషన్, పాస్‌పోర్టు జారీ, ఆధార్, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. ఇంకా పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, గ్రామ, వార్డు సచివాలయాల అదనపు డైరెక్టర్ అభిషేక్ గౌడ, న్యాయశాఖ కార్యదర్శి జి.సత్యప్రభాకరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఐజీ లేఖను చట్టవిరుద్ధంగా ప్రకటించండి

- హైకోర్టులో నారా లోకేశ్ పిటిషన్
- గురువారం విచారించే అవకాశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, తద్వారా సంక్షేమ పథకాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే దిశగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (వీ అండ్ ఈ) విభాగం పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా చర్యలు కోరుతూ ఆ విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ కె.రఘురామిరెడ్డి గత నెల 5న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖను సవాల్ చేస్తూ టీడీపీ నేత నారా లోకేశ్ హైకోర్టును ఆశ్రయించారు. రఘురామిరెడ్డి లేఖ, తదనుగుణంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి తీసుకున్న చర్యలను రాజ్యాంగ, చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. రఘురామిరెడ్డి లేఖ ఆధారంగా తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా, ఉత్తర్వులు, నోటీసులు, సర్క్యులర్, ఆర్డినెన్స్ తదితరాలు జారీ చేయకుండా ముఖ్యమంత్రి సహా సంబంధిత ప్రభుత్వ శాఖలను నిషేధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, నిధుల వృథా, ప్రభుత్వ సంపద–సహజ వనరులకు నష్టం కలిగించడం వంటి విషయాల్లో ఏ సంస్థల్లోకైనా వెళ్లేందుకు, సోదాలు చేసేందుకు, సమాచారం సేకరించేందుకు, రికార్డులను పరిశీలించేందుకు, జప్తు చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసేలా గెజిటెడ్ అధికారులందరినీ అధీకృత అధికారులుగా నియమించాలని కోరుతూ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదాలో కె.రఘురామిరెడ్డి గత నెల 5న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. రాబోయే ఎన్నికల్లో తమను వేధింపులకు గురి చేసేందుకే ఈ లేఖ రాశారని లోకేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ పార్టీ వారిని, తమ పార్టీకి మద్దతు తెలిపే వారిని లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. ఈ లేఖకు ఎలాంటి చట్టబద్ధత లేదన్నారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపే అవకాశం ఉంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం : 13 : మార్చి : 2024

ఉద్యోగుల ఆటల పోటీలు



మైసూరు: ఉద్యోగులు ప్రతిభను చూపేందుకు ఆటల పోటీలు మంచి సందర్భమని, క్రీడా స్ఫూర్తి అనేది అందరికీ ముఖ్యమని కలెక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని చాముండి విహార క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా స్థాయి ఉద్యోగుల క్రీడలను ప్రారంభించారు. ఉద్యోగ విధుల్లో ఒత్తిడిలో ఉంటారని, ఇలాంటి క్రీడల వల్ల వారి ఒత్తిడి తగ్గిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జట్ల మధ్య ఆటల పోటీలు సాగాయి.

న్యూస్‌రీల్

కిలేడీ దొంగల అరెస్టు

- ఇళ్లలో పనివారుగా చేరి చోరీలు



నిందితులు మంజుల, మహదేవమ్మ



నగలు, సొత్తు

బనశంకరి: ఆకాశవాణి విశ్రాంత డైరెక్టర్ మునికృష్ణప్ప ఇంట్లో నర్సింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ నగలు దోచుకెళ్లిన ఇద్దరు మహిళలను మంగళవారం జేపీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. కొప్పళకు చెందిన మంజుళ ఉజరత్, కనకపుర మహిళ మహదేవమ్మలను అరెస్ట్‌చేసి వీరి వద్ద నుంచి రూ.28 లక్షల విలువచేసే 414 గ్రాములు బంగారు నగలు, 104 గ్రాముల వెండి సొత్తు, 4 విదేశీ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మునికృష్ణప్ప ఇంట్లో 31 గ్రాముల బంగారు ఆభరణాలు, 4 వాచ్‌లను ఎత్తుకెళ్లారు. జేపీ.నగర పోలీసులు దర్యాప్తు చేపట్టి ఖతర్నాక్ మహిళలను అరెస్టు చేశారు. ఇళ్లలో పని మనుషులుగా, రోగులకు సహాయకులుగా చేరి బంగారు నగలను తస్కరించేవారు. పలు ఇళ్లల్లో ఇదే రీతిలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలు సాధకులు కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గౌరిబిదనూరు: మహిళలు తమపై దాడులు జరిగినప్పుడు భయపడకుండా సమర్థంగా ఎదుర్కొనాలని రూట్స్ ఫర్ ఫ్రీడం సంస్థ సంచాలకులు కల్యాణకుమార్ తెలిపారు. మంగళవారం అంబేడ్కర్ భవనంలో మహిళా దినాచరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని మన పురాణాలు చెబుతున్నాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు సాధకులుగా గుర్తించబడాలి అన్నారు. తాలూకా మహిళా సంచాలకురాలు కవిత ప్రసంగిస్తూ బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఆన్‌లైన్లో రూ.6 లక్షలకు పైగా మోసం

దొడ్డబళ్లాపురం: ఆన్‌లైన్ వంచకుల చేతిలో యువకుడు రూ.6.62 లక్షలను పోగొట్టుకున్న సంఘటన మాగడి తాలూకా హుల్లేనహళ్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. బర్కతుల్లాఖాన్ అనే యువకుని మొబైల్‌కు ఇంట్లో ఉంటూనే వేల రూపాయలు సంపాదించవచ్చని మేసేజ్ వచ్చింది. నమ్మిన యువకుడు లింక్ ద్వారా టెలిగ్రాం గ్రూప్‌లో చేరాడు. ప్రముఖ హోటళ్లకు గూగుల్‌లో 5 స్టార్ రేటింగ్ ఇస్తే డబ్బులు వేస్తామని నమ్మించారు. ఆ ప్రకారం మొదట కొన్ని టాస్కులు ఇచ్చి అతని ఖాతాలోకి కొంత డబ్బు పంపడంతో నిజమేనని నమ్మాడు. ఇక తమ వద్ద పెట్టుబడి పెడితే అచిరకాలంలోనే దండిగా లాభాలు వస్తాయని అతన్ని ఒత్తిడి చేశారు. సరేనని బాధితుడు పలు దఫాలుగా రూ.6.62 లక్షలను సమర్పించుకున్నాడు. ఆ తరువాత అవతలి వైపు నుండి ఎటువంటి స్పందన లేదు. దీంతో మోసపోయానని తెలుసుకున్న యువకుడు రామనగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కారులో రియల్టర్ హత్య

- యలహంక పరిధిలో ఘటన



కారును పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) క్రిష్ణయాదవ్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రియల్ ఎస్టేట్ వ్యాపారిని దుండగులు కారులో హత్య చేసిన సంఘటన బెంగళూరులో బాగలూరు క్రాస్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. యలహంకలోని మారుతి నగరలో నివసిస్తున్న క్రిష్ణ యాదవ్ సోమవారం సాయంత్రం స్విఫ్ట్ కారులో బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం బాగలూరు క్రాస్ వద్ద ఫుట్‌పాత్ పక్కన నిలిచి ఉన్న కారులో స్థానికులు తొంగి చూడగా లోపల మృతదేహం కనిపించింది. యలహంక పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలిచారు. రియల్టర్ క్రిష్ణ యాదవ్‌గా గుర్తించారు. దుండగులు కారులోనే కత్తితో పొడిచి చంపారు. హతుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఆర్థిక వ్యవహారాలే హత్యకు కారణమై ఉంటాయని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

బ్యాడిగిలో తగ్గని ఉద్రిక్తత ఘాటు

- ఏపీఎంసీ మార్కెట్ మూసివేత
- ఆవరణలోనే మిర్చి రైతులు
- మోసకారి దళారులపై చర్యలు తీసుకోవాలని పట్టు
- భారీగా పోలీసుల మోహరింపు



కారును ధ్వంసం చేస్తున్న దృశ్యం



ఎన్నికల ముందు మిర్చి గొడవ

సాక్షి, బళ్లారి: హావేరి జిల్లా బ్యాడిగి ఏపీఎంసీ మార్కెట్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. హఠాత్తుగా మిర్చి ధరలను తగ్గించడంతో సోమవారం మధ్యాహ్నం రైతులు అగ్రహోదగ్రులై విధ్వంసానికి పాల్పడడం తెలిసిందే. ఫైరింజన్, కార్లు, మార్కెట్‌లో ఆఫీసులకు నిప్పంటించి దాడులకు దిగారు. పోలీసులు, దళారులను తరిమికొట్టడం తదితర సంఘటనలు జరిగాయి. దీంతో అక్కడ యుద్ధ వాతావరణం అలముకొంది. ఈ సంఘటన రాష్ట్రంలోనే కాదు దేశమంతటా దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో మంగళవారం బ్యాడిగి ఏపీఎంసీ మూతపడింది. వందలాది రైతులు ఏపీఎంసీ లోపల ఉంటూ నిరసన తెలిపారు. రైతులందరూ ఒక్కతాటిపై నిలబడి దమ్ముంటే ఎవరైనా తమ కేసులు పెట్టాలని సవాల్ చేయడం గమనార్హం.

ధర కాదు.. దగా చేస్తున్నారు

ఆరుగాలం కష్టపడి పనిచేసి, లక్షలాది రూపాయలు అప్పులు చేసి మిర్చి పంట పండించి ఎంతో దూరం నుంచి లారీలు బాడుగలు తీసుకుని వచ్చి ఇక్కడికి వస్తే అందరూ కుమ్మక్కై తమను మోసం చేస్తున్నారని కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రైతులు ధ్వజమెత్తారు. బళ్లారి, రాయచూరు, హావేరి తదితర జిల్లాలతో పాటు పొరుగున ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన రైతులు పెద్దఎత్తున ప్రతి రోజు మిర్చి బస్తాలను తీసుకొచ్చామని తెలిపారు. ఒక క్వింటాలుకు దాదాపు రూ.5 వేలు మోసం చేస్తూ ధరలు తగ్గించేస్తున్నారని, తమ గ్రామాల్లోనే క్వింటాలు మిర్చి రూ.15 నుంచి రూ.20 వేలు దాకా వ్యాపారులు అడుగుతున్నారని పలువురు రైతులు చెప్పారు. బ్యాడిగిలో ఎక్కువ రేటు వస్తుందని ఎంతో ఆశతో వస్తే దళారులు, అధికారులు కలిసి మోసం చేస్తూ క్వింటాలు మిర్చి రూ.8 వేల లోపు అడుగుతున్నారని ఆరోపించారు.

దళారులను అరికట్టాలి

బ్యాడిగిలో దళారులదే రాజ్యం అని మండిపడ్డారు. రైతులను మోసం చేస్తున్న దళారులు, అధికారులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. దళారులు, అధికారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తారు. క్వింటాలుపై రూ.5వేలు అమాంతంగా తగ్గించి, ఆ డబ్బును పంచుకుంటారని ఆరోపించారు. ఈ విషయం తెలిసినా పాలకులు పట్టించుకోవడం లేదని, బ్యాడిగి ఏపీఎంసీ మోసాలకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎంసీలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులందరూ తమ తమ మిర్చి సంచుల ముందే కూర్చొని నిరసన తెలిపారు. మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారం కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతన్నలు కోరారు. తమపై కేసులు పెట్టి వేధిస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

80 మంది రైతుల అరెస్టు

మంగళవారం సాయంత్రం వందలాది మంది పోలీసులు మార్కెట్‌లోకి వెళ్లారు. అడ్డుకున్న రైతులను పక్కకు తోసేశారు. గొడవల వీడియోలు, ఫోటోల్లో ఉన్నవారిని గుర్తించి 80 మంది వరకూ రైతులను అరెస్టు చేయడంతో కలకలం చెలరేగింది. వాహనాలలో వారిని తరలించారు. ఇందులో కన్నడ రైతులే కాకుండా అనంతపురం, కర్నూలు జిల్లావాసులూ ఉన్నట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో మరింత మందిని అరెస్టు చేసే అవకాశముంది. అల్లర్లు, అరెస్టుల భయంతో పెద్దసంఖ్యలో రైతులు తమ మిర్చి సంచులను వదిలేసి వెళ్లిపోయారు. అధికారులు బుధవారం నుంచి మార్కెట్‌ను తెరవాలని నిర్ణయించారు.



మార్కెట్‌లో గుమిగూడిన రైతులు

రాజధానిలో గట్టి భద్రత: సీపీ

బనశంకరి: సీఏఏ చట్టాన్ని అమలు చేస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నగరంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీఏఏను కొన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నందున నగరవ్యాప్తంగా పటిష్ట భద్రతను కల్పించామన్నారు. ఇప్పటివరకు ధర్నాలు చేస్తామని ఎవరూ అనుమతి కోరలేదన్నారు. డీసీపీలు వారి పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సీఐఎస్‌ఎఫ్ బలగాలు నగరానికి వచ్చాయన్నారు. సమస్యాత్మక ప్రాంతాలైన డీజీ.హళ్లి, కేజీ.హళ్లి, శివాజీనగర, జేజే.నగర, చామరాజపేటే, సుద్దగుంటెపాళ్య, ఆర్‌టీ నగరతో పాటు అనేక ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు.

యదువీర్‌కు టికెట్ ఇచ్చినా ఓకే: సింహా

మైసూరు: మైసూరు రాజవంశీకుడు యదువీర్ ఒడెయార్‌కు స్థానిక ఎంపీ టికెట్ ఇస్తే తప్పకుండా స్వాగతిస్తానని బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ యదువీర్‌ను పోటీ చేయిస్తే ఆయన విజయానికి శ్రమిస్తానని తెలిపారు. అయితే టికెట్ తనకే లభిస్తుందనే ఆశ ఉందని, గత పదేళ్లలో ప్రజలు, కార్యకర్తలతో కలసి మంచి పనులు చేశానని అన్నారు. ఒకవేళ టికెట్ ఇవ్వకున్నా పార్టీ కోసం పాటుపడతానన్నారు.

హుక్కా నిషేధంపై హైకోర్టులో వాదనలు

బనశంకరి: రాష్ట్రంలో అన్ని రకాల హుక్కా ఉత్పత్తుల విక్రయాలు, వినియోగం, సేకరణను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల ఆదేశాలిచ్చింది. దీనిని ప్రశ్నిస్తూ కొందరు హైకోర్టులో వేసిన పిటిషన్ ను మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం విచారించి, తీర్పును రిజర్వులో ఉంచింది. హుక్కా వినియోగాన్ని ప్రభుత్వం ముందుగా పూర్తిగా అరికట్టి ఉండాల్సింది. కొన్ని పాశ్చాత్య దేశాల్లో దీనిపై నిషేధం ఉంది అని పేర్కొన్నారు. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన జడ్జి తీర్పును రిజర్వులో ఉంచారు.

గురు రాఘవా శరణు

- మంత్రాలయ క్షేత్రంలో పాదుకా పట్టాభిషేకాలు



రథోత్సవంలో సుబుదేంద్ర తీర్థ

రాయచూరు రూరల్: భక్తులకు కామధేనువుగా కోరిన కోర్కెలు తీర్చే మంత్రాలయంలో గురు రాఘవేంద్రుల దేవస్థానం ఉత్సవ శోభతో విలసిల్లుతోంది. పాదుకా పట్టాభిషేక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాఘవేంద్రుల మఠంలో మూల విరాట్‌కు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. గురుసార్వభౌముల 403వ పట్టాభిషేక ఉత్సవాలు, స్వామివారి 429వ వర్ధంతి స్మరణోత్సవాలకు నాంది పలికారు. వందలాది మంది భక్తుల సమక్షంలో వెండి తేరు నిర్వహించారు.

రాష్ట్రానికి 2 వందేభారత్ రైళ్లు

- బెంగళూరు- కలబురగి, చెన్నై మధ్య సర్వీసులు



దొడ్డబళ్లాపురం: రాష్ట్రానికి మరో రెండు వందేభారత్ రైళ్లు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారంనాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ రైళ్లను ప్రారంభించారు. బెంగళూరు – కలబురిగి మధ్య ఒక రైలు, బెంగళూరు – చెన్నై మధ్య మరో కొత్త రైలు పరుగులు తీస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 5 వందే భారత్ రైళ్లు తిరుగుతున్నాయి. అవి ఇప్పుడు 7కి పెరిగాయి. హుబ్లీ రైల్వేస్టేషన్‌లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ ప్రగతిలో రైళ్లది ముఖ్య పాత్ర అన్నారు. దేశంలో రైల్వే ప్రధాన రవాణాగా ఉందన్నారు. విధానపరిషత్ స్పీకర్ బసవరాజు హొరట్టి, ఎమ్మెల్యే మహేశ్ తెంగినకాయి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త దారుణ హత్య

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ కార్యకర్త దారుణ హత్యకు గురైన సంఘటన గదగ్ జిల్లా ముండరగి తాలూకా డంబళ గ్రామం వద్ద చోటుచేసుకుంది. డోణి గ్రామానికి చెందిన శరణప్ప నందిగొడ (35) మృతుడిగా గుర్తించారు. హతుడు కాంగ్రెస్ పార్టీకి చెందినవాడు. సోషల్ మీడియలో చురుగ్గా ఉండేవాడు. దుండగులు కళ్లల్లో కారం కొట్టి కత్తులతో పొడిచి హత్య చేసారు. అనంతరం మృతదేహాన్ని చెట్టుకు వేలాడదీసారు. హత్యకు గల కారణాలు తెలిసిరాలేదు. ముండరగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18న శివమొగ్గకు ప్రధాని రాక

శివమొగ్గ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శివమొగ్గ పర్యటనకు రానున్నారు. భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. మార్చి 17న జరగాల్సిన పర్యటన 18వ తేదీకి వాయిదా పడింది. శివమొగ్గలో ఎంపీ బీవై రాఘవేంద్ర మాట్లాడుతూ శివమొగ్గ, చిక్కమగళూరు, చిత్రదుర్గ, దావణగెరె, ఉడుపి నియోజకవర్గాలకు సంబంధించి ప్రధాని పర్యటన ఉంటుందని తెలిపారు. సుమారు 3 నుంచి 4 లక్షల మంది ఈ సభలో పాల్గొంటారని అంచనా వేశామన్నారు. మైదానం చుట్టుపక్కల భారీ టీవీ తెరలపై సభ ప్రసారమవుతుందన్నారు.

ఎలక్ట్రీషియన్ దుర్మరణం

మైసూరు: ఇంటి కనెక్షన్‌ను సరిచేస్తూ ఓ యువకుడు కరెంటు షాక్‌కు గురై మరణించాడు. శ్రీరంగ పట్టణ తాలూకా మహదేవపుర నివాసి ప్రదీప్ (28) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రాజీవ్ నగరలో వద్ద ఇంటి ముందు విద్యుత్ కనెక్షన్ చెడిపోయింది. ఆ ఇంటివారు ఫోన్ చేయడంతో ప్రదీప్ విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సెస్కాం ఉద్యోగి తాను చేయాల్సిన పనిని ప్రదీప్ చేత చేయించడంతో మరణించాడని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఉందని, ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి పరిహారం ఇచ్చేలా రాజీ ఒప్పందం జరిగినట్లు తెలిసింది.

నిధుల్లేవని ఎమ్మెల్యే ఆవేదన

తుమకూరు: మేమంతా పేపర్ల మీదనే ఎమ్మెల్యేలం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని తుమకూరు గ్రామీణ బీజేపీ ఎమ్మెల్యే సురేశ్ గౌడ వాపోయారు. బెళ్లావిలో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర రైతు మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ చూసినా తాగు నీరు, విద్యుత్ సమస్యలు తాండవం చేస్తున్నాయని, పంటలకు నీరు లేక రైతులు దిగులు పడుతున్నారని చెప్పారు. రైతుల కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు..



కాలువలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టిన కారు



మృతదేహం

- యువకుడి మృతి

మండ్య: డ్రైవర్ అదుపుతప్పి కారు విశ్వేశ్వరయ్య కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువకుడు మరణించాడు. మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండ్య తాలూకా అవ్వేరహళ్లి వద్ద జరిగింది. పాండవపుర తాలూకా బ్యాడరహళ్లి గ్రామనికి చెందిన నందీశ్ (18) మృతుడు. యోగానందకు తీవ్రంగా గాయాలయ్యాయి. పాండవపుర నుంచి మండ్యకు వస్తున్న కారు అవ్వేరహళ్లి వద్ద విశ్వేశ్వరయ్య కాలువలోకి దూసుకెళ్లింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కాలువలోకి దిగి కారులో ఇరుక్కున వారిని బయటకు తీవారు. కారు నుజ్జునుజ్జయింది. నందీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాలువలో నీటి ప్రవాహం లేదు. గాయపడిన యోగానందను మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులు క్రితం ఒక కారు వీసీ కాలువలో ఇదేరీతిగా పడిపోయింది. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. పలుమార్లు ఇలాంటి ఘటనలు జరుగుతున్న కాలువకు అడ్డుగోడ కట్టించాలని ఎమ్మెల్యే పుట్టరాజు అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కొన్ని చోట్ల గోడ నిర్మించారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు.

నీటి కొరతపై విపక్షం ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

యశవంతపుర: రాష్ట్రంలో ఏర్పడిన కరవు, నీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు మంగవారం బెంగళూరులో ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఫ్రీడంపార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీలు పీసీ మోహన్, తేజస్వీసూర్య, ఎమ్మెల్యేలు రవి సుబ్రమణ్య, రామమూర్తితో పాటు అనేక మంది బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఖాళీ బిందెలు పట్టుకుని మహిళ కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. గుర్రం, గాడిదలను కూడా తోలుకువచ్చారు. నీరు లేదు..నీరు లేదు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు అని నినాదాలు చేశారు. బెంగళూరు మహనగర పాలికె ముందు కూడా ధర్నా చేశారు. ప్రజల సమస్యలపై మంత్రులు స్పందించడం లేదని, కేడీపీ సమావేశాలను నిర్వహించటం లేదని దుయ్యబట్టారు.



సీఎం, డీసీఎం మాస్కులతో నిరసన

రెండు రోజుల్లో బీజేపీ జాబితా

యశవంతపుర: రెండు రోజుల్లో 28 మంది ఎంపీ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఎన్నికల సమితి సమావేశంలో పాల్గొని అనంతరం విజయేంద్ర విలేకర్లతో మాట్లాడారు. మొదటి విడత ఎంతమంది అభ్యర్థులను ప్రకటిస్తారని విలేకర్లు ప్రశ్నించగా 28 మంది అభ్యర్థుల విషయంపై చర్చ జరిగిందన్నారు. జేడీఎస్ పార్టీ ఎన్ని సీట్లు కేటాయించారని అడిగిన ప్రశ్నకు అధిష్టానం చూసుకుంటుందన్నారు. సిట్టింగ్ ఎంపీలకు ఎంతమందికి ఇస్తారో కూడా హైకమాండ్ నిర్ణయమన్నారు.

మామిడి తోట ఆహుతి



మంటలకు దగ్ధమైన మామిడి చెట్లు

శ్రీనివాసపురం: పంట బాగుంది, త్వరలో మంచి ప్రతిఫలం వస్తుందనుకున్న రైతు ఆశలు బూడిదయ్యాయి. తాలూకాలోని మల్లెకుప్ప గ్రామంలో మధుబాబు అనే రైతుకు చెందిన మూడు ఎకరాల మామిడి తోటలో మంటలు చెలరేగి 120 మామిడి చెట్లు కాలిపోయాయి. మంగళవారం మంటలు చెలరేగగానే కొందరూ చూసి ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది చేరుకునే సరికి 120 చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. బాగా పూత పూసి మంచి దిగుబడి వస్తుందనే నిరీక్షణలో ఉన్న మధుబాబు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ సీజన్‌లో తోట కోసం దాదాపు 4 లక్షల వరకు ఖర్చు చేశానని చెప్పాడు. పంట చేతికి అంది ఉంటే రూ. 9, 10 లక్షల వరకు లాభం వచ్చి ఉండేదని తెలిపాడు. అనుకోకుండా జరిగిందా, లేక ఎవరైనా కావాలనే నిప్పంటించారా అనేది తేలాల్సి ఉంది.

ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

- డీఏ 3.75 శాతం పెంపు

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగుల డీఏను 38.75 నుండి 42.50 శాతానికి పెంచుతూ ఉత్తర్వులిచ్చింది. తద్వారా 3.75 శాతం డీఏ పెరిగింది. గత జనవరి 1 నుండి పెంచిన డీఏ వర్తిస్తుంది. పార్లమెంటు ఎన్నికలకు ముందు తాయిలం ఇచ్చింది. డీఏ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.1,702 కోట్ల భారం పడనుంది.

బంగారప్ప ఇంటి కొడుకుని కాను : శివు

దొడ్డబళ్లాపురం: మాజీ సీఎం బంగారప్ప కుటుంబాన్ని కలపడానికి నేనెవర్ని, నేను కేవలం ఆ ఇంటి అల్లుడిని మాత్రమే, ఇంటి కొడుకుని కాదంటూ హీరో శివరాజ్ కుమార్ అన్నారు. బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆయన పై విధంగా స్పందించారు. శివరాజ్‌కుమార్ భార్య గీతకు ఈసారి శివమొగ్గ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. పదేళ్ల తరువాత మళ్లీ ఆమె ఎన్నికల బరిలో దిగనున్నారు. ఈ నేపథ్యంలో బెళగావిలో మీడియాతో మాట్లాడిన శివరాజ్‌కుమార్ భార్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. అయితే స్టార్ క్యాంపెయినర్లుగా ఎవరినీ పిలిచి ఇబ్బంది పెట్టే ఆలోచన తనకు లేదన్నారు.

బెంగళూరులో కాంగ్రెస్ ఆందోళన

యశవంతపుర: రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బెంగళూరులో కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్ మాట్లాడుతూ... మొదటి నుంచి బీజేపీ రాజ్యాంగంపై అనేక వ్యాఖ్యలు చేస్తోందని మండిపడ్డారు.

ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలన అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. మోదీ సర్వాధికారంతోనే ఎంపీలు ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. హెగ్డే దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

దొరకని న్యాయం, పోయిన ప్రాణం

- అత్యాచార బాధితురాలి ఆత్మహత్య



యువతి, ఆమె పెళ్లిపత్రిక

మైసూరు: ప్రేమికుల దినోత్సవం రోజునే అత్యాచారానికి గురైన ఒక యువతి తనకు న్యాయం జరగలేదని బాధతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా శ్యానబోగనహళ్లి గ్రామంలో జరిగింది. రంజిత (19) మృతురాలు. వివరాలు.. ఫిబ్రవరి 14న రంజితను అదే గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లల తండ్రి వేణుగోపాల్ (35) తన బోలెరో వాహనంలో కేరళకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ప్రేమ, పెళ్లి అని మాయమాటలు చెప్పి ముఖం చాటేశాడు. యువతి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో యువతి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఎస్పీ సూచనల మేరకు బిళికెరె పోలీసులు ఫిబ్రవరి 21న కేసు నమోదు చేశారు. ఇంతలో యువతికి ఫిబ్రవరి 18న వేరే యువకునితో వివాహం నిశ్చయమైంది. ఇక పోలీసులు నెల గడుస్తున్నా వేణుగోపాల్‌ను అరెస్టు చేయలేదు, తనకు న్యాయం జరగలేదని విరక్తి చెందిన యువతి మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ధర్నా చేశారు.

బుద్ధిగా ఉండమంటే అంతుచూశాడు

- పాగల్ ప్రేమికుని దురాగతం



నిందితుడు ప్రవీణ్



హత్యకు గురైన సంగనగౌడ (ఫైల్)

యశవంతపుర: బుద్ధిగా నడుచుకోవాలని చెప్పిన ఓ వ్యక్తిని కొడవలితో దారుణంగా హత్య చేసిన ఘటన బాగలకోట తాలూకా భగవతి గ్రామంలో జరిగింది. హతుడు సంగనగౌడ (52), నిందితుడు ప్రవీణ్. వివరాలు... భగవతి గ్రామానికి చెందిన సంగనగౌడ కుమార్తెను ప్రవీణ్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో యువతి తన తండ్రికి విషయం చెప్పడంతో సంగనగౌడ, ప్రవీణ్‌ను పిలిచి బుద్ధిగా నడుచుకోవాలని హెచ్చరికలు చేశాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. దీంతో మరోసారి సంగనగౌడ హెచ్చరించాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ప్రవీణ్ కొడవలితో సంగనగౌడను దారుణంగా నరికి పారిపోయాడు. బాగలకోట గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకోని నిందితుడిని అరెస్ట్ చేశారు.

కనువిందుగా ఆనెగుంది ఉత్సవం


వివిధ వేషధారణల్లో వేదికపై కళాకారులు


వేదికపై సామూహిక బృంద నృత్యప్రదర్శన

- మిరుమిట్లు గొలిపిన విద్యుద్దీపాలంకరణలు
- ఉత్సవాలకు గతంలో కంటే పోటెత్తిన ప్రజలు


బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తదితరులు


వేదికపై సాహసోపేత క్రీడ మల్లకంబ ప్రదర్శన

గంగావతి: తాలూకాలో వెలిసిన అంజనాద్రి బెట్ట అభివృద్ధి కోసం ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిర్ణయించారని కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి పేర్కొన్నారు. ఆయన సోమవారం రాత్రి ఆనెగుంది బైపాస్ రోడ్డులో ఆనెగుంది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రధాన శ్రీరంగదేవరాయల వేదికపై ఆనెగుంది ఉత్సవ కార్యక్రమాలను డోలు వాయించి ప్రారంభించి మాట్లాడారు. కొప్పళ జిల్లా చారిత్రక ప్రదేశాలకు నిలయం అన్నారు. తుంగభద్ర నది ఇక్కడ కొండల మధ్య ప్రవహిస్తూ పచ్చని పంట పొలాలకు నీరందిస్తోందన్నారు. రాయల కాలం నాటి కోట గోడలు, ఆంజనేయ స్వామి జన్మస్థలమైన అంజనాద్రి బెట్ట, పంపా సరోవరం, శ్రీదుర్గ, విజయలక్ష్మి దేవస్థానాలు కలిగి రాయల కాలంలో వజ్రవైఢూర్యాలను రాసులుగా పోసి అమ్మిన చరిత్ర కలిగి ప్రపంచ ప్రసిద్ధి గాంచిందన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఐపీఎల్ క్రికెట్ ఆటగాడి లాంటివాడినని, తాను ఈ ప్రాంత అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఎంచుకొని పని చేస్తానన్నారు. ఈ ఏడాది 5000 మంది ఒకేసారి భోజనం చేయడానికి వీలుగా భోజనశాల, అంజనాద్రి కొండపై వృద్ధులు, దివ్యాంగులు వెళ్లేందుకు రోప్‌వే నిర్మాణంతో పాటు గంగావతి నుంచి హిట్నాల్ క్రాస్ వరకు ఫోర్‌వే రహదారి నిర్మాణాన్ని త్వరలో చేపడతామని ఆయన వివరించారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, కుష్టగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, రాజవంశస్తురాలు లలితారాణి శ్రీరంగదేవరాయలు, ఎమ్మెల్యే సతీమణి గాలి లక్ష్మీ అరుణ, కొప్పళ జిల్లాధికారి నళిన్ అతుల్, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాండే, జిల్లా ఎస్పీ యశోద, తహసీల్దార్ విశ్వనాథ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాధికార యంత్రాంగం తరపున వేదికపై పాల్గొన్న ప్రజాప్రతినిధులను సన్మానించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు హంసలేఖ ఆధ్వర్యంలో వేదికపై మూడు గంటలకు పైగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించాయి. సాంస్కృతిక, వ్యక్తిగత నృత్య ప్రదర్శనలు, చిత్రగీతాలాపనలు ప్రేక్షకులను అలరించాయి. పలు రోమాంచకర కలిగించే గీతాలను పాడి ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టారు. అనంతరం సాహసోపేతమైన క్రీడలు, జానపద గీతాలతో రాత్రి నుంచి తెల్లవారే వరకు కొనసాగాయి. కళాకారులకు ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి బహుమతులను, ఇతర సహాయ సహకారాలను వేదికపై అందించారు. కాగా ఉత్సవాలకు మునుపెన్నడూ లేని రీతిలో ప్రజలు పోటెత్తడంతో జనోత్సవంగా ముగిసింది.

సంక్షేమ నిధుల దారి మళ్లింపు

- ప్రజలకు కాంగ్రెస్ సర్కార్ మోసం
- కేంద్రంలో మళ్లీ మోదీని ప్రధానిని చేద్దాం
- మాజీ మంత్రి బీ.శ్రీరాములు పిలుపు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలికి కేటాయించిన నిధులను గ్యారెంటీలకు ఉపయోగించుకుని తమ వర్గాలకు కాంగ్రెస్ సర్కార్ తీవ్రంగా అన్యాయం, మోసం చేస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలోని బసవభవన్‌లో ఏర్పాటు చేసిన ఎస్టీ వర్గాల సమావేశంలో ఆవేశపూరితంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారి తప్పించి మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఓటమి, గెలుపులను సమానంగా స్వీకరిస్తూ ప్రజల సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో రాయచూరు, బళ్లారి రెండు ఎస్టీ నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపించాలన్నారు. దేశంలో మళ్లీ మోదీని ప్రధానిని చేయడానికి మనమందరం సైనికుల్లా పని చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా కరువు నిలయంగా మారుతోందని ధ్వజమెత్తారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని జనం గమనించి బీజేపీకి బ్రహ్మరథం పట్టాలని సూచించారు.

కేంద్రంలో బీజేపీ ఉంటేనే రాష్ట్రానికి మేలు

రాష్ట్రంలో కరువు నివారణ, అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే అన్ని విధాలుగా మంచి జరుగుతుందన్నారు. రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ ఎంపికైన సందర్భంలో అసెంబ్లీ ప్రాంగణంలోనే పాకిస్థాన్ జిందాబాద్ అని కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేస్తారంటే వీరికి దేశభక్తి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి దేశద్రోహ చర్యలకు పాల్పడేవారికి బుద్ధి చెప్పాలని, ఓటుతో తరిమికొట్టాలన్నారు. ఎంపీ దేవేంద్రప్ప, ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్ మాట్లాడుతూ దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి తేవడానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలన్నారు. మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బంగారు హనుమంతు, ఎమ్మెల్సీ హేమలత నాయక్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్, జిల్లా బీజేపీ నాయకులు ఓబులేసు, మురహరగౌడ, హాలిగప్ప తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

పీడీఓలపై చర్యలకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న వినోద్‌రెడ్డి

రాయచూరు రూరల్: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(నరేగ) పథకంలో వ్యవసాయ కూలీ కార్మికులకు ఉపాధి కల్పించకుండా నిధులు స్వాహా చేసిన పంచాయతీ అభివృద్ధి అధికారు(పీడీఓ)లపై కఠిన చర్యలు తీసుకోవాలని కన్నడ రక్షణ వేదిక అధ్యక్షుడు వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జెడ్పీ సీఈఓ ప్రకాష్‌తో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అధికారులు జెడ్పీ అధికారుల వివరాలు సేకరించి వారిని తొలగించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

గ్లకోమాపై జాగృతి వారోత్సవ నడక

బళ్లారి రూరల్: ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్), ఓఏ(ఆప్తాల్మాలజీ అసోసియేషన్), విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వైద్యులు జిల్లా ఆసుపత్రి నుంచి బెంగళూరు రోడ్డు, కాళమ్మ వీధి, మోతీ సర్కిల్, రాయల్ సర్కిల్ మీదుగా గ్లకోమా జాగృతి వారోత్సవ వాక్‌థాన్ నిర్వహించారు. విమ్స్ ఆప్తాల్మాలజీ ప్రముఖ వైద్యుడు డాక్టర్ యోగీష్ మాట్లాడుతూ కంటిలోని గ్లకోమాకు వ్యాధి సోకితే అంధత్వం వస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 6 మిలియన్ల మంది, భారత్‌లో సుమారు 2 మిలియన్ల మంది ఈ గ్లకోమా వ్యాధి బారిన పడ్డారన్నారు. 40 ఏళ్లు పైబడిన వారందరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ర్యాలీలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, కార్యదర్శి డాక్టర్ రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్‌రావు కులకర్ణి, సహ కార్యదర్శి డాక్టర్ సంగీత కట్టిమని, కోశాధికారి డాక్టర్ వారిజా రెడ్డి, విమ్స్ నేత్రవైద్యులు డాక్టర్ పరసప్ప, విశ్రాంత శస్త్రచికిత్స వైద్యుడు డాక్టర్ విద్యాధర్ కిన్నాల్, జిల్లా సర్జన్ డాక్టర్ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మోతీ సర్కిల్‌లో వాక్‌థాన్ చేస్తున్న వైద్యులు

దొడ్డబసవేశ్వర జాతర ఏర్పాట్లపై సమీక్ష

కంప్లి: కురుగోడు పట్టణ ప్రజల ఆరాధ్య దైవం దొడ్డ బసవేశ్వరుని జాతరకు హాజరయ్యే భక్తులకు తాగునీటి సమస్య ఎదురు కాకుండా పురసభ, ధార్మిక దత్తి శాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం కురుగోడులోని దొడ్డబసవేశ్వర ఆలయ సమీపంలోని సభామందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమీపంలోని ప్రైవేట్ బోరుబావిని ఉపయోగించుకొని భక్తులకు రక్షిత మంచినీరు అందించాలన్నారు. ఈ విషయంలో విఫలమైతే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయ ప్రాంగణంలో జరిగే ధార్మిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా వహించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే గణేష్, ఉప జిల్లాధికారి హనుమంతప్ప, తహసీల్దార్ ఎం.రేణుక, డీఎస్పీ కాశీగౌడ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

రాజ్యాంగాన్ని అవహేళన తగదు

రాయచూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని 400కు పైగా స్థానాల్లో గెలిపిస్తే భారత రాజ్యాంగాన్ని సవరిస్తామని ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు అనంత్ కుమార్ హెగ్డే అవహేళనకరంగా మాట్లాడటం తగదని రాష్ట్ర యువజన సేవలు, క్రీడా శాఖ మంత్రి నాగేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మంత్రాలయంలో గురు రాఘవేంద్రుల పాదుకా పట్టాభిషేక ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగం వల్లనే తాను ప్రధానమంత్రి హోదాలో ఉన్నానని అధినాయకుడు నరేంద్ర మోదీ చెబుతున్న విషయాన్ని పక్కన పెట్టి హెగ్డే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగం వల్లనే తాను కూడా మంత్రి పదవిని అలంకరించగలిగానన్నారు. ఇలా అవాకులు చవాకులు పేలితే హెగ్డేకు వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందన్నారు. మాజీ మంత్రి శ్రీరాములు చేసిన వ్యాఖ్యలు కూడా అనుచితంగా ఉన్నాయన్నారు. సమాజ సేవకు పునీతులైన రాయచూరు జిల్లా ఎస్పీ నిఖిల్, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శరణప్పలకు మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు గౌరవ పురస్కారాలను అందించారు.


ఆశీర్వాదం పొందుతున్న మంత్రి నాగేష్

భ్రూణ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

బళ్లారి రూరల్: శిశు భ్రూణ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం. దీనిని ఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని, దీనిపై ముమ్మరంగా జాగృతి కల్పించాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజేశ్.ఎన్.హొసమని తెలిపారు. ఆయన మంగళవారం వైద్యాధికారులకు, స్కానింగ్ సెంటర్ల యజమానులకు విమ్స్ బీసీరాయ్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడశిశువు ఆడపిల్లగా, ఇల్లాలుగా, తల్లిగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ త్యాగానికి మారుపేరుగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా మహిళలకు సమాజంలో ప్రత్యేక గౌరవం ఉందన్నారు. అదే గౌరవాన్ని నేడు మహిళలకు ఇవ్వాలన్నారు. పురుషులతో పాటుగా మహిళలపై దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. భ్రూణహత్యల నివారణకు విస్తారంగా జాగృతి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు భ్రూణహత్యల నివారణ జాగృతిపై మాట్లాడారు. డాక్టర్ శ్వేతా సంకనూరు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ, డాక్టర్ బసిరెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

వేతనాలు చెల్లించాలని నిరసన


ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులు

బళ్లారిఅర్బన్: జిల్లాలోని జీపీల పరిధిలో పొడి, తడి చెత్త సేకరణకు మహిళా పౌరకార్మికులుగా విధులు నిర్వహిస్తున్న తమకు సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని మహిళా కార్మికులు వాపోయారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి సంస్థ ఆధ్వర్యంలో తమను పనిలో పెట్టుకుని గత 8 నెలలుగా వేతనాలను చెల్లించలేదని కర్ణాటక డ్రైవర్ల సమాఖ్య మహిళా శాఖ కార్యనిర్వాహక అధ్యక్షురాలు కేఎం.కవిత వాపోయారు. తక్షణమే తమ కుటుంబాల నిర్వహణకు సహాయపడేలా పూర్తి జీతాలు చెల్లించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా జిల్లాధ్యక్షురాలు శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు మంజుళ, నాగవేణి, అమృత మంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో పట్టాలిస్తాం

కంప్లి: షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని 112 కుటుంబాలకు పట్టాల పంపిణీకి చర్య తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే జేఎన్.గణేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం కర్మాగారంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వాసులతో నిర్వహించిన సమాలోచన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుందరి షుగర్స్ పేరిట గల సర్వే నెంబర్–1300, 1301లో 4.60 ఎకరాల్లో 112 కుటుంబాలు నివాసముంటున్నారన్నారు. ఈ ఆస్తి గురించి ఉపవిభాగ అధికారులు సమగ్ర విచారణ జరిపారన్నారు. ఈ సమస్య సుమారు 50 ఏళ్లనాటిదని, ఎన్నికల సమయంలో వట్టి హామీలు ఇవ్వడం తప్ప కార్యాచరణ మాత్రం జరగలేదన్నారు. దీంతో రాజకీయ నాయకులు హామీ ఇస్తున్నా నమ్మేవారు కాదన్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చే హామీనే అన్న చందంగా సవాల్‌గా తీసుకోలేదన్నారు. అదే విధంగా అధికారం శాశ్వతం కాదని, తాను చేసిన పని మాత్రం చిరకాలం ఉంటుందన్నారు. కర్మాగార ప్రాంతంలో ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదలకు కూడా న్యాయం చేస్తామన్నారు.

ఈవీఎం వద్దు..బ్యాలెట్టే ముద్దు


ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: త్వరలో జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ జరపాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ అధ్యక్షుడు అమరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈవీఎం యంత్రాలతో ఓటర్లను తికమక పెడుతోందన్నారు. అందువల్ల గతంలో మాదిరిగా బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు సజావుగా జరగడమే కాకుండా నిష్పక్షపాతంగా ఓట్ల లెక్కింపుతో ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. ఈవీఎం యంత్రాలను రద్దు చేసి బ్యాలెట్ పత్రాలతో ఓటింగ్ జరపాలని ఒత్తిడి చేశారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి


విజేతకు క్రీడా ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నేటి యువత క్రీడలకు ప్రాధాన్యత కల్పించాలని కేకేపీఎల్ సంచాలకుడు ఫైజల్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ఓపెన్ టెన్నిస్ బాల్ టోర్నీ ముగింపు పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు ట్రోఫీలను అందించి మాట్లాడారు. క్రీడలలో గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. ఖలీల్‌ఖాన్ సాబ్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌బీ టీంకు రూ.రెండు లక్షలు ట్రోఫీ, రెండో స్థానం యువనిక్ టీంకు రూ.లక్ష ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో మహ్మద్ ముమ్తాజ్, ఏజాజ్, సయ్యద్ అఫ్రోజ్ ఖాద్రి, జావేద్‌ఖాన్‌లున్నారు.

క్లుప్తంగా

వందే భారత్ రైలుకు స్వాగతం


స్వాగతం పలికిన ఎంపీ అమరేశ్వర నాయక్

రాయచూరు రూరల్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కలబుర్గి– బెంగళూరు మధ్య సంచరించే వందే భారత్ రైలు మంగళవారం కలబుర్గిలో ప్రారంభమైంది. కలబుర్గి లోక్‌సభ సభ్యుడు ఉమేష్ జాధవ్ రైలును ప్రారంభించగా, మధ్యాహ్నం 11.30 గంటలకు రైలు రాయచూరు రైల్వేస్టేషన్‌కు చేరింది. న్యూఢిల్లీ నుంచి వర్చువల్ వీడియో విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వే శాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఈ రైలుకు శ్రీకారం చుట్టారు. రాయచూరులో లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం సంచాలకురాలు స్మిత, స్వాతంత్ర్య సమర యోధుడు పంపణ్ణ, మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా సమితి సభ్యుడు బాబూరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

కంప్లి: కూడ్లిగి తాలూకా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మౌలిక సదుపాయాలు, తగిన సమయంలో చికిత్స లభించడం లేదని ఎమ్మెల్యే డాక్టర్ ఎన్టీ శ్రీనివాస్‌తో ప్రజలు తమ గోడు వినిపించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్కడి లోపదోషాలపై రోగులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని, త్వరలో ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కన్నడ సంఘాల ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు గౌరవంతోనే సంపూర్ణాభివృద్ధి


డాక్టర్ అరుణా రావును సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ సంపూర్ణ అభివృద్ధి ఉంటుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. మంగళవారం విమ్స్ ఆధ్వర్యంలో శిక్షకర భవన్‌లో ఏర్పాటు చేసిన విశ్వ మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. విమ్స్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి మాట్లాడుతూ మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు సర్వత్రా పూజ్యనీయులని అందరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ అరుణా రావును సన్మానించారు. దంత వైద్య కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో బ్యాగ్ చోరీ

హుబ్లీ: సిద్ధారూఢ స్వామీజీ రైల్వే స్టేషన్‌లో రూ.85 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్న ప్రయాణికురాలి బ్యాగ్ చోరీకి గురైన ఘటన మంగళవారం జరిగింది. తెలంగాణకు చెందిన వేమల ఇందిరా హైదరాబాద్ నుంచి మురుడేశ్వరకు వెళ్లడానికి రైలులో ప్రయాణిస్తున్నారు. వేరే రైలును ఎక్కడానికి హుబ్లీ రైల్వేస్టేషన్‌లో దిగారు. ఈ క్రమంలో వెయిటింగ్ రూంలో విశ్రాంతి తీసుకుంటుండగా బ్యాగ్ చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళల సత్తా


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లత, ప్రముఖులు

కంప్లి: మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా తమ సత్తా చాటుతున్నారని ఎమ్మెల్యే పీ.లతా మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. హరపనహళ్లి తాలూకా తెలిగి గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో దివంగత ఎంపీ రవీంద్ర ఫౌండేషన్ పరంగా ఏర్పాటు చేసిన విశ్వ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తన తండ్రి, సోదరుడి మార్గంలో నడిచి కష్టనష్టాలు ఎదుర్కొన్న ఫలితంగానే ఒక మహిళగా తాను అనుభవిస్తున్న కష్టాన్ని గుర్తించి తనకు పట్టం కట్టారన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలను, ప్రజల విశ్వాసాన్ని పొంది క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి ఈ క్షేత్రానికి స్ఫూర్తిగా ముందడుగు వేస్తానన్నారు.

జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటుకు సూచన

హొసపేటె: జిల్లా వ్యాప్తంగా కన్నడ భాషా సమగ్రాభివృద్ధి చట్టం అమలుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాధికారి మాట్లాడారు. కన్నడ భాషా సమగ్రాభివృద్ధి బిల్లు–2024కు ఫిబ్రవరిలో గవర్నర్ ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ, కన్నడ సంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు సిద్ధలింగేష్ రంగన్నవరు పాల్గొన్నారు.

కరటక దమనకకు స్పందన భేష్

హొసపేటె: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన తాను నటించిన కరటక దమనక అనే కన్నడ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్ తెలిపారు. చిత్రం ప్రమోషన్ కోసం హొసపేటెకు విచ్చేసిన నేపథ్యంలో సోమవారం ప్రెస్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం ఉత్తర కర్ణాటకను ప్రతిబింబిస్తుందన్నారు. కరటక దమనక పంచతంత్రానికి మూలాధారమన్నారు. మైదాన ప్రాంత ప్రజల జీవితానికి అద్దం పడుతుందన్నారు. ఈ చిత్రంలో సమాజానికి గొప్ప సందేశం ఇచ్చే 6 పాటలు, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే అన్ని అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. కన్నడిగులందరూ పెద్ద ఎత్తున థియేటర్‌కి వచ్చిన సినిమాను ఆదరించాలని కోరారు. రాక్‌లైన్ బ్యానర్‌పై ప్రభుదేవ, యోగరాజ్ భట్, తాను కలిసి ప్రేక్షకులకు కొత్తదనాన్ని అందించాలనే తపనతో సినిమాని ఎంతో కసిగా తీశామన్నారు. అందుకు తగ్గట్టుగానే సినిమా అంచనాలకు మించి వసూళ్లు రాబడుతోందన్నారు. దర్శకుడు యోగరాజ్ భట్, నిర్మాత గుజ్జల పురుషోత్తం పాల్గొన్నారు.

కారు కడిగేందుకెళ్లి కాలువలో శవమైన యువకుడు


మృతదేహం, హుసేనప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: స్నేహితుడితో కలిసి కారు కడిగేందుకు వెళ్లిన యువకుడు తుంగభద్ర ఎడమ కాలువలో శవంగా మారిన ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు..జిల్లాలోని సిరివారకు చెందిన హుసేనప్ప(18) అనే యువకుడు ఈనెల 10న కారును కడిగేందుకు వెళ్లి కాలు జారి కాలువలో పడ్డాడు. ఈత రాక పోవడంతో కొట్టుకుపోయాడు. అతనిని రక్షించేందుకు కాలువలో దిగిన దిలీప్ నీరు అధికంగా తాగడంతో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హుసేనప్ప మృతదేహం సోమవారం సాయంత్రం బంగారప్ప చెరువు సమీపంలో లభించడంతో శవ పరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు గబ్బూరు పోలీసులు తెలిపారు.

అధిక లాభాల పేరిట రూ.3.32 లక్షల వంచన

హుబ్లీ: డబ్బులు పెట్టుబడి పెట్టి స్టాక్ కొనుగోలు చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి నుంచి రూ.3.32 లక్షలను బదలాయించి వంచించిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. భవాని నగర నివాసి విపుల్ సింగ్రే బాధితుడు. టెలిగ్రామ్ యాప్‌లో ట్రేడింగ్ బిజినెస్‌కు సంబంధించి ఓ సందేశం వచ్చింది. ఓ వ్యక్తి గ్లోబల్ ఇన్వెస్టర్ స్టాక్ ట్రేడర్స్ కంపెనీకి చెందిన వ్యక్తిగా పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఆ మేరకు ప్రారంభంలో లాభాలు ఇచ్చారు. అనంతరం వివిధ లింక్‌లు పంపించి వాటిని డౌన్‌లోడ్ చేసుకోమని దశల వారీగా రూ.3.32 లక్షలను బదలాయించుకొని వంచించినట్లు బాధితుడు నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వీఎస్కేయూ వీసీకి సన్మానం


వీసీని సన్మానిస్తున్న సంఘం ప్రముఖులు

బళ్లారిఅర్బన్: విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్కేయూ) వీసీగా పదవీ బాధ్యతలను చేపట్టిన ప్రొఫెసర్ కేఎం మైత్రిని రాష్ట్ర అలెమారి, అరె అలెమారి వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలపై అధ్యయనానికి వర్సిటీలో ప్రత్యేక పీఠం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు కేఈబీ బసవరెడ్డి, ప్రముఖులు వెంకటేష్ యాదవ్, రాఘవేంద్ర, హనుమంత సండూరు, చిదానంద పాల్గొన్నారు.

గ్యారెంటీలపై ప్రదర్శన ప్రారంభం


ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏఎస్పీ శివకుమార్

రాయచూరు రూరల్: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పంచ గ్యారెంటీ పథకాలపై మూడు రోజుల ప్రదర్శనను అదనపు ఎస్పీ శివకుమార్ ప్రారంభించారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్‌లో గృహజ్యోతి, గృహలక్ష్మి, అన్నభాగ్య, శక్తి, యువ నిధి పథకాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించి ప్రతి ఒక్కరూ వినియోగించుకొని లబ్ధి పొందాలన్నారు. ఆర్టీసీ అధికారి శీలప్ప, వార్త శాఖాధికారి సులేమాన్ డి నదాఫ్, లింగరాజ్, ప్రకాష్‌లున్నారు.

స్వయం ఉపాధికి ముందుండాలి


జ్యోతి వెలిగిస్తున్న శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలో స్వయం ఉపాధి పొందేందుకు మహిళలు ముందుండాలని నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం జహీరాబాద్‌లోని మురికివాడల అభివృద్ధి మండలి, నర్మ్ పథకంలో శిక్షణ పొందిన మహిళలకు జీవనోపాధి శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నగరసభ సభ్యురాలు ఉమా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర జాలదార్, జనార్దన్‌లున్నారు.